అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 06-12-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 337 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

పోషకాహారం పెట్టండి
మిడ్‌డే మీల్స్ కేసులో హైకోర్టు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో పోషకాలతో కూడిన ఆహారం పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. మాగనూరు, బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వికటించిన ...13లో



సొంతింటి కల నెరవేరాలి
పేదలకు ఆత్మగౌరవం కల్పించిన ఘనత ఇందిరా గాంధీదే



- ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు
- నియోజకవర్గానికి 3,500 ఇండ్లు
- ఐటీడీఏ పరిధిలో గిరిజనులకు ప్రత్యేక కోటా
- ప్రతి మండలంలో మోడల్ హౌస్ నిర్మాణం
- గతంలోని ఇందిరమ్మ ఇండ్ల రుణాలు మాఫీ
- కేసీఆర్ పెద్దరికాన్ని నిలుపుకోవాలి
- ప్రతిపక్ష నేతగా సలహాలు ఇవ్వాలి
- కేటీఆర్, హరీశ్‌రావు తీరు మార్చుకోవాలి :

ఇందిరమ్మ ఇండ్ల యాప్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు కేసీఆర్ సహా ప్రతిపక్ష నేతలకు ఆహ్వానం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్
ప్రతి శాసనసభ నియోజకవర్గానికీ 3,500 ఇండ్ల చొప్పున రాష్ట్రంలో తొలి ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతి ఇంటికీ రూ.5 లక్షలు ఇస్తున్నామన్నారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... దేశంలో ఇండ్ల నిర్మాణం ద్వారా పేదలకు ఆత్మ గౌరవాన్ని ఇందిరా గాంధీ కల్పించారని కొనియాడారు. ఆత్మగౌరవంతో బతకాలనుకుంటే సొంత ఇల్లు ఉండాలనీ, ఆ కల నెరవేరాలనే ఇందిరా గాంధీ ఇండ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. దేశంలో గుడి లేని ఊరు ఉండొచ్చేమో, కానీ ఇందిరమ్మ కాలనీ లేని ఊరు ఈ దేశంలోనే లేదని చెప్పగలనని అన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదాన్ని ఇందిరా గాంధీ ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులు, దళితులకు మిగులు భూముల పంపిణీ చేపట్టారని గుర్తు చేశారు. ఇండ్ల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఇందిరమ్మ హయాంలో ఇంటి నిర్మాణానికి రూ.10 వేలు కేటాయిస్తే, వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అది రూ.1.25 లక్షలకు చేరిందని అన్నారు. పెరిగిన ధరల ప్రకారం ఇప్పుడు తమ ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోందని వివరించారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు రూ.5 లక్షలు అందజేస్తామని తెలిపారు. తొలి ఏడాది సొంత స్థలం ఉన్నవారికి ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. వికలాంగులు, వ్యవసాయ కూలీలు, పారిశుధ్య సిబ్బంది, దళితులు, గిరిజనులు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లకు ఇండ్ల కేటాయింపులో ప్రాధాన్యతనిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో గిరిజనులకు ఇండ్లు కేటాయించారని అన్నారు. ఆ తర్వాత వారికి ఇండ్ల కేటాయింపు సక్రమంగా ...6లో

రవాణా శాఖ సిబ్బంది
సేవలు అసాధారణం
ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉచిత బస్సు పథకం : ప్రజాపాలన - రవాణా శాఖ విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 5లో..


రాహుల్ షర్ట్‌కు స్టిక్కర్ అంటిస్తున్న ప్రియాంక

ప్రతిపక్షాల
వినూత్న నిరసన
మోడీ-అదానీ ఏక్ హై
ప్రింటెడ్ టీ షర్ట్‌లతో ఆందోళన
పార్లమెంట్ పాత భవనం నుంచి కొత్త భవనం వరకు ర్యాలీ
అదానీ వ్యవహారంపై జేపీసీతో విచారణ జరపాలని డిమాండ్

న్యూఢిల్లీ : అదానీ ముడుపుల వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలని ప్రతిపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం ఉభయ సభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో వినూత్న నిరసన తెలిపారు. 'మోడీ-అదానీ ఏక్ హై, అదానీ 'సేఫ్ హై' ప్రింటెడ్ టీ షర్ట్‌లను ధరించి ఆందోళన చేపట్టారు. 'మోడీ-అదానీ భాయ్ భాయ్' అని నినాదాలు చేస్తూ పార్లమెంట్ పాత భవన్ ముందు బైటాయించారు. ఆ తర్వాత పార్లమెంట్ పాత భవనం నుంచి పార్లమెంట్ కొత్త భవనం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం 'అదానీ ముడుపులతో ఎవరికి లాభం దక్కింది మోడీ' అని రాసి ఉన్న ప్లకార్డులతో పార్లమెంట్ ముఖ ద్వారం (మకర ద్వార్) వద్ద నిలబడి ఆందోళన చేపట్టారు. ఈ ధర్నాలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సీపీఐ, ఆర్జేడీ, ఎన్సీపీ, డీఎంకే, ఆప్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్, ఎండీఎంకే తదితర పార్టీల నేతలు ప్లకార్డులు పట్టుకుని మోడీ సర్కార్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం 'మోడీ-అదానీ ఏక్ హై, అదానీ 'సేఫ్ హై' ప్రింటెడ్ వైట్ టీషర్ట్‌తో సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. అదానీపై ...13లో

ఆ ముగ్గురు చేతుల్లోనే విమానయాన రంగం
కేంద్రం ప్రభుత్వ నియంత్రణ లేదు
రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీం 6లో..

అల్లు అర్జున్, సంధ్య థియేటర్
యాజమాన్యంపై కేసు
తొక్కిసలాటకు థియేటర్ యాజమాన్యమే కారణం
మహిళ మృతికి కారకులపై కఠిన చర్యలు : సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్


ఫైల్

నవతెలంగాణ-ముషీరాబాద్
సంధ్య థియేటర్‌లో జరిగిన తొక్కిసలాటకు సినీ హీరో అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యం, హీరో వ్యక్తిగత సిబ్బంది కారణమని, వారిపై కేసులు నమోదు చేశామని సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్ తెలిపారు. బుధవారం పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్డులో సంధ్య థియేటర్‌కు సినీ హీరో అల్లు అర్జున్ వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతిచెందిన విషయం విదితమే. ఆమె కొడుకు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై గురువారం రాత్రి చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ రమేష్ కుమార్‌తో కలిసి సెంట్రల్ జోన్ డీసీపీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంధ్య థియేటర్‌లో పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో షెడ్యూల్ వేయడంతో భారీగా అభిమానులు వచ్చారని తెలిపారు. హీరో అల్లు అర్జున్ వస్తున్నారని తెలియడంతో ప్రేక్షకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ గేట్లను తోసుకుంటూ లోపలికి చొచ్చుకొని వెళ్లారన్నారు. ఈ క్రమంలో తొక్కిసలాట జరగడంతో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి(35), ఆమె కుమారుడు 13 ఏండ్ల శ్రీతేజ్ కింద పడగా.. జనం కాళ్ల మధ్య నలిగిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారని తెలిపారు. వెంటనే పోలీసులు వారికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించినా.. రేవతి మృతిచెందిందని చెప్పారు. శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందిస్తున్నారని తెలిపారు. సంధ్య థియేటర్‌లో రద్దీని నివారించడానికి థియేటర్ ...5లో



షెడ్యూల్ ప్రకారమే ఉద్యోగాల భర్తీ
కమిషన్‌పై నమ్మకంతో పరీక్షలు రాయండి
బాధ్యతల స్వీకరణ సందర్భంగా టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
రాష్ట్రంలో ఎప్పటికప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వడంతో పాటు భర్తీ ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా చేపడతామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మెన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ...13లో

విధులకు ఆటంకం కలిగిస్తున్నారని
బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు





బంజారాహిల్స్ పీఎస్‌కు కౌశిక్‌రెడ్డి తరలింపు
మద్దతు ఇచ్చేందుకు వచ్చిన హరీశ్‌రావు, ఇతర నేతలు గచ్చిబౌలి పీఎస్‌కు..రాత్రి విడుదల
నేతలను పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు
ప్రజా పాలన కాదు, రాక్షస పాలన : ఎమ్మెల్యే హరీశ్‌రావు వివరాలు 5లో


ప్రజల ఆదాయంలో సగం విద్య, వైద్యానికే
రెండు రంగాలనూ వ్యాపారమయంగా మార్చిన పాలకులు
ఈ క్రమంలో ఎంవీఎన్ క్లినిక్‌ల లాంటివి ఎంతో అవసరం : మల్లు వెంకటనర్సింహారెడ్డి స్మారక ప్రజా వైద్యశాల 14వ వార్షికోత్సవంలో జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్
పేద, మధ్య తరగతి ప్రజలు తమ సంపాదనలో సగం విద్య, వైద్యానికే ఖర్చు చేయాల్సి వస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్నేండ్ల నుంచి పాలకులు విద్య, వైద్యరంగాలను వ్యాపారమయం చేశారని తెలిపారు. ఈ క్రమంలో మల్లు వెంకట నర్సింహారెడ్డి స్మారక ప్రజా వైద్యశాలల (ఎంవీఎన్ఆర్ మెమోరియల్ పీపుల్స్ క్లినిక్)లాంటివి ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎంవీఎన్ఆర్ మెమోరియల్ పీపుల్స్ క్లినిక్ 14వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు, ఎంవీఎన్ఆర్ క్లినిక్ సలహాదారులు డాక్టర్ రమాదేవి అధ్యక్షతన సభను జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జూలకంటి ముఖ్యవక్తగా మాట్లాడుతూ ప్రస్తుతం రాజకీయ రంగం అతి పెద్ద మోసపూరిత రంగంగా మారిందని వాపోయారు. విద్య, వైద్య ...13లో



సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా
జస్టిస్ మన్మోహన్
ప్రమాణ స్వీకారం చేయించిన సీజేఐ
న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న మన్మోహన్ గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఆయనతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు ...13లో



కొలువుదీరిన
మహా సర్కార్
సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా శిండే, అజిత్ పవార్
ముంబయి: మహారాష్ట్రలో 'మహాయుతి' ప్రభుత్వం కొలువుదీరింది. బీజేపీ అగ్రనేత దేవేంద్ర ఫడ్నవీస్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ శిండే, ఎన్సీపీ ...13లో

నింగిలోకి దూసుకెళ్లిన
పీఎస్ఎల్‌వీ సీ-59
రాకెట్ ప్రయోగం విజయవంతం



సూర్యుడి ఉపరితలం, సూర్యకిరణాలపై అధ్యయనం : ఇస్రో

అమరావతి : పీఎస్ఎల్‌వీ సీ-59 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. గురువారం సాయంత్రం 4.04 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి ఈ రాకెట్‌ను ప్రయోగించగా.. నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకువెళ్లింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా3 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి కచ్చితంగా తీసుకువెళ్లిందని అధికారులు తెలిపారు. పీఎస్ఎల్‌వీ రాకెట్‌లోని ప్రోబా 3 మిషన్‌లోని రెండు ఉపగ్రహాలు విజయవంతంగా విడిపోయాయని ఇస్రో ఓ ప్రకటనలో తెలిపింది. దీంతో ఈ ప్రయోగం విజయవంతమైందని వివరించింది. సూర్యుడి ఉపరితలంతో పాటు సూర్యకిరణాలను అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగం చేపట్టినట్టు ఇస్రో పేర్కొన్నది. ప్రయోగం అనంతరం శాస్త్రవేత్తలు, అధికారులు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు.

వస్త్ర పరిశ్రమకు గడ్డుకాలమే..!
జీఎస్టీ పెంచితే భారీగా మూత..లక్ష ఉద్యోగాలు ఊడొచ్చు : సీఎంఏఐ



న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు చర్యలు వస్త్ర పరిశ్రమను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోన్నాయి. రెడీమేడ్ గార్మెంట్స్‌పై పన్ను రేట్లను పెంచాలని ఇటీవల జీఎస్టీకి సంబంధించిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జీఓఎం)లో కీలక ప్రతిపాదన చేశారు. అదే జరిగితే.. ముఖ్యంగా, ఈ రంగంలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) గడ్డుకాలాన్ని ఎదుర్కోవాల్సి రావొచ్చని ది క్లాతింగ్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఏఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జీఓఎం నూతన ప్రతిపాదనల్లో రూ.1500 లోపు వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ అమల్లో ఉంటుంది. అయితే రూ.1500 నుంచి రూ.10000 వస్త్రాలపై 18 శాతం జీఎస్టీ, రూ.10వేల పైబడిన దుస్తులపై 28 శాతం పన్నులను వసూలు చేయాలని ప్రతిపాదించింది. ఈ అధిక పన్ను రేట్ల విధానం తమ పరిశ్రమను దెబ్బతీయనుందని సీఎంఏఐ ఆందోళన వ్యక్తం చేసింది. అధిక ధరలు తయారీ,



డిమాండ్‌ను దెబ్బతీయనున్నాయని తెలిపింది. పన్ను రేట్ల పెంపునతో సంఘటిత రిటైల్ రంగానికి ప్రమాదమేనని వివరించింది. ఈ మార్పు అక్రమ వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చనుందని హెచ్చరించింది. "ఇప్పటికే టెక్స్‌టైల్ పరిశ్రమ ఒత్తిడిని ఎదుర్కొంటోంది. నూతన పన్ను ప్రతిపాదన ఒక లక్ష ఉద్యోగాలను కోల్పోయేలా చేయనుంది. స్పిన్నింగ్, నేత, వస్త్రాల తయారీ, ఎస్ఎంఈ సంస్థల ఆదాయాలు మరింత హరించనున్నాయి. దీంతో లాభదాయకతపై ప్రభావం పడనుంది. పన్నుల పెంపు ముఖ్యంగా జీవనోపాధికి ముప్పు కలిగించనుంది." అని సీఎంఏఐ తన ప్రకటనలో ...13లో

మహిళా సాధికారతలో తెలంగాణ ముందంజ

గ్రామాల్లోనే భారత్ :

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- అదానీ,అంబానీలతో పోటీ పడేలా ప్రోత్సహిస్తాం : సీఎం రేవంత్
- మహిళా శక్తి బజార్ ప్రారంభం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మహిళా సాధికారతలో తెలంగాణ అగ్రభాగాన ఉండటం సంతోషంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యానించారు. మహిళలు ఉద్యోగాలు తీసుకోవడం కాదు, ఇప్పుడు ఇస్తున్నారని అభిప్రాయపడ్డారు. మహిళా సాధికారతతోనే విప్లవం వస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రభుత్వమే కాదు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. గురువారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళాశక్తి బజార్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ప్రారంభించారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులతో దాదాపు గంటసేపు భేటీ అయ్యారు. సంఘాల ద్వారా వారు చేస్తున్న కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో మహిళల పాత్ర కీలకమన్నారు. సమాజాభివృద్ధిలో వీరి కృషి ఎంతో ఉందన్నారు. అలాగే గ్రామీణాభివృద్ధికి వీరి సహకారం చాలా గొప్పదని అభినందించారు. క్షేత్రస్థాయి నుంచే మహిళల సాధికారత సాధ్యమన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, వికసిత్ భారత్ అంటే ఇదేనని అభిప్రాయపడ్డారు. భారతదేశం అంటే గ్రామాలేనని ప్రధానమంత్రి చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ సంస్కృతిని కాపాడటంతోపాటు వ్యాపారాలను మహిళలు నిర్వహించడం ప్రశంసనీయమని చెప్పారు. విద్యుత్ ఉత్పత్తిలోనూ మహిళల పాత్ర ఉండటం సంతోషంగా ఉందన్నారు. కొత్త ఆలోచనల ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరగడానికి అవకాశముందని చెప్పారు.

అదానీ, అంబానీలతో పోటీపడాలి : మహిళలకు సీఎం రేవంత్ పిలుపు

వ్యాపారాల్లో అదానీ, అంబానీలతో పోటీపడాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మహిళలకు పిలుపునిచ్చారు. తెలంగాణ మహిళలు దేశానికి ఆదర్శం కావాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఇప్పుడు 65 లక్షల మంది ఉన్నారనీ, ఆ సంఖ్యను కోటికి పెంచాల్సిన బాధ్యత మహిళలదేనని అన్నారు. వారిని కోటీశ్వర్లను చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. ఉచిత బస్సు ద్వారా డబ్బులు మిగులుతున్నాయనీ, సిలిండరు, యూనిఫారాలు, క్యాంటీన్ల ద్వారా ఆదాయం పెరిగిందన్నారు. ఆడబిడ్డ చేతుల్లో నగదు ఉండాలనీ, పురుషుల దగ్గర ఉంటే సాయంత్రం బెల్టుషాపుల్లోకి వెలుతుందన్నారు. ఈనెల తొమ్మిదిన సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి లక్ష మంది మహిళలు రావాలని ఆహ్వానించారు. ఇందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి ఆదేశాలు ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజలు, మహిళల్లోకి తీసుకెళ్లే బాధ్యత మహిళలదేనని వ్యాఖ్యానించారు. మహిళా సాధికారతను మరింత పెంపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఒక మెగావాట్ నుంచి ఐదు మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టుల నిర్వహణను మహిళలకు అప్పగిస్తామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మహిళలకోసం ఏదీ చేయడానికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. మంత్రి ధనసరి సీతక్క అనసూయ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. 120 బస్సులను సంఘాలకు కేటాయించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ అత్యంత ఖరీదైన ప్రాంతంలో రూ.500 కోట్ల విలువగల 100 షాపులను డ్వాక్రా మహిళలకు కేటాయించడం మంచి పరిణామమని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు చేస్తున్న కార్యకలాపాలను గవర్నర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, మహిళా సహకార అభివృద్ధి కమిషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి సెర్ప్ సీఈవో దివ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి వ్యతిరేక ర్యాలీలు

- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని ఏసీబీ ఆధ్వర్యంలో గురువారం వివిధ జిల్లాల్లో అవినీతి వ్యతిరేక ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీలు హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో జరిగాయి. విద్యార్థులతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ ర్యాలీలను ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు ప్రారంభించారు. 'లంచం ఇవ్వకండి, సమాచారమివ్వండి' అనే నినాదాలు రాసి ఉన్న బ్యానర్లను పట్టుకొని విద్యార్థులు ఈ ర్యాలీలలో నడుస్తూ అవినీతికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే, వివిధ జిల్లాల్లో పలు ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలలో అవినీతికి వ్యతిరేకంగా వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైనవారికి 9న ముగింపు ఉత్సవాల్లో బహుమతులను అందజేయటం జరుగుతుందని ఏసీబీ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇతర రాష్ట్రాలకు నేర్చుకునేలా... పదేండ్ల తెలంగాణ ప్రగతి నుంచి అనేక పాఠాలు

టైకాన్ సదస్సులో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు నేర్చుకునేలా పదేళ్ల తెలంగాణ ప్రగతి సాధించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. గురువారం కేరళలోని కొచ్చిలో టైకాన్ కేరళ సదస్సులో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సాధించిన ప్రగతి, తెలంగాణ అనుభవాలను వివరించారు. సిలికాన్ వ్యాలీ మాదిరిగా సాఫ్ట్ వేర్ సేవలందిస్తునే ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ బలోపేతం చేసినట్టు తెలిపారు. ఐఎస్‌బీ, , నల్సార్, ట్రిపుల్ ఐటి తదితర సంస్థల భాగస్వామ్యంతో చేసుకుని ప్రపంచంలోనే అతిపెద్ద ఇంకుబేటర్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అనేక ఆలోచనలు ఉండి వాటి ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలో తెలియని యువతకి, ఔత్సాహికులకు టీ హబ్ మార్గదర్శిగా నిలిచిందన్నారు. వీటితోపాటు వీ హబ్, టీ హబ్, టీ వర్క్స్, త్వరలో అందుబాటులోకి రానున్న ఇమేజ్ టవర్ వంటి వాటి ద్వారా హైదరాబాద్ భారత దేశ ఇన్నోవేషన్ స్టాటప్ ఇకో సిస్టంలో అగ్రశ్రేణి నిలిచిందని తెలిపారు. అనేక ఆర్థిక సూచీలలో అగ్రస్థానంలో నిలిచి తలసరి ఆదాయంతో పాటు స్థూల రాష్ట్ర, జాతీయ ఉత్పత్తి జీఎస్డీపీ వంటి వాటిలో వేగంగా ముందుకుపోతుందన్నారు. వీటి కోసం కేసీఆర్ చేసిన కృషి ప్రధానమన్నారు. విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, సాగునీటి రంగం బలోపేతం వంటి ప్రాథమికమైన సమస్యలను పరిష్కరించే దిశగా విప్లవాత్మకమైన ప్రాజెక్టులను చేపట్టి రికార్డు సమయంలో పూర్తి చేసినట్టు వివరించారు.

అందరి మన్ననలు పొందిన వెంకటేశం

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం బహుముఖ వ్యక్తిత్వం అని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌గా నియమితులైన గవర్నర్ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా రాజ్‌భవన్‌లో ఆయన విధులు నిర్వహించి అందరి మన్ననలను అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా నూతనంగా నియమితులైన దాన కిశోర్, జాయింట్ సెక్రెటరీ జె.భవానీ శంకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అలాంటివారిని నమ్మొద్దు

- టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగాలను ఇప్పిస్తామని మోసగించేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పోటీ పరీక్షల అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచించింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోసం చేసే వారి మాయలో పడొద్దని కోరారు. అలాంటి సమాచారం తెలిస్తే వెంటనే టీజీపీఎస్సీకి 9966 700 339 నెంబర్ కు మెసేజ్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

గవర్నమెంట్ పాలిటెక్నిక్ లెక్చరర్ల లిస్టు ఆమోదం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గవర్నమెంట్ పాలిటెక్నిక్ లెక్చరర్ల పోస్టుల కోసం అభ్యర్థులను ఎంపిక జాబితాను ఆమోదించినట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. ఈ మేరకు కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో మరిన్ని వివరాల కోసం సంప్రదించాలని సూచించారు.

మోడీజీ...నాటి మాటలు మరిచారా ?

అప్పుడు ఒప్పు... ఇప్పుడు తప్పా ?

నాలుక మడతెడుతున్న కమలనాథులు

- బీజేపీ రాజకీయ సందేశాలకు వేదికలుగా చట్టసభలు
- ప్రశ్నించే గొంతుకలపై ఎదురు దాడులు



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట... అధికారం రాగానే మరో మాట. కమల నాథులకు నాలుక మడతపడుతోంది. పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బీజేపీ నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై నోరు పారేసుకుంటున్నారు.

ప్రతిపక్షాల నిరసనను పార్లమెంట్ 'హైజాకింగ్'గా ప్రధాని అభివర్ణించారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో కాషాయ నేతలే చెప్పాలి.

న్యూఢిల్లీ : తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బీజేపీ నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించుకుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బీజేపీ సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యూపీఏ-2 ప్రభుత్వంపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘించారంటూ 20 మంది బీజేపీ, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బీజేపీ ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్థించు కున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు.

కుడి ఎడమైతే...

ఈ ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకింగ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు' అని విమర్శించారు. పదేపదే ప్రజల తిరస్కరణకు గురైన వారు తమ సహచరుల మాటలను పెడచెవిన పెట్టి, వారి మనోభావాలను అగౌరవపరుస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండి పడ్డారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బీజేపీ నేతలు ఆయన మాటలను తరచూ వల్లె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభిం పజేయడానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు.

ప్రతిపక్షాలకు దారేది?

ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. అంతేకాక కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపుల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది.

చర్చకు ససేమిరా

రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. అయితే సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారిన పడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది.

నాడు అలా...నేడు ఇలా

2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బీజేపీ డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీ లకుల మాదిరిగా కాకుండా బీజేపీ ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతి ఓపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్క రిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుం టున్నాయి.

ప్రజలు తిరస్కరించింది వారినే

ప్రతిపక్ష ఎంపీలను ప్రజలు తిరస్కరించారంటూ మోడీ చేసిన ప్రకటన వారి పాత్రను తక్కువ చేసి చూపడమే అవుతుంది. వాస్తవానికి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించింది ప్రతిపక్షాలను కాదు...బీజేపీనే. భారత ప్రజాస్వామ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనకు పార్లమెంట్ 'హైజాకింగే' నిజమైన కారణమైతే అందుకు ఎవరిని నిందించాలో అందరికీ తెలిసిందే.

ఇదీ ప్రభుత్వ తీరు

హిందూత్వ ప్రచార చిత్రం 'ది సబర్మతి రిపోర్ట్'ను వీక్షించేందుకు మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఇటీవల పార్లమెంట్ గ్రంథాలయాన్ని వేదికగా మార్చేశారు. గడచిన రెండు ప్రభుత్వాల పాలనలోనూ ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలపై ప్రభుత్వ వైఖరిని ఆయన స్పష్టం చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు వచ్చినా అవి సాదాసీదాగా, దాటవేసే రీతిలో ఉంటున్నాయి. సభలో చర్చ జరపకుండానే అనేక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. బిల్లుల ప్రతులు తమకు అందలేదని, ముసాయిదాల అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్షం తరచూ ఫిర్యాదు చేసింది.

ఖాళీలు భర్తీ చేయండి

- రెండు వారాల్లో నివేదికలు ఇవ్వండి : సమాచార కమిషన్లపై కేంద్ర రాష్ట్రాలకు సుప్రీం ఆదేశాలు
- తెలంగాణలో మనుగడలోనే లేదని వ్యాఖ్య

న్యూఢిల్లీ : కేంద్ర సమాచార కమిషన్, రాష్ట్రాల సమాచార కమిషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గత నెల 11న అందజేసిన నివేదిక ప్రకారం కేంద్ర సమాచార కమిషన్‌లో ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రస్తుతం కేవలం ముగ్గురు సమాచార కమిషనర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ తెలిపింది. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో నివేదిక అందజేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ బ్రిజేందర్ ఛహార్‌ను న్యాయస్థానం ఆదేశించింది. కేంద్ర సమాచార కమిషన్, పలు రాష్ట్ర సమాచార కమిషనర్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై సమాచార హక్కు కార్యకర్త సహా పలువురు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను పురస్కరించుకొని సుప్రీం బెంచ్ ఈ ఆదేశాలు జారీ చేసింది. మహారాష్ట్రలో ఏడు, కర్నాటకలో ఎనిమిది, ఛత్తీస్‌గఢ్‌లో రెండు, బీహార్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో నాలుగు, ఒడిషాలో ఐదు, తమిళనాడు సమాచార కమిషన్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని న్యాయస్థానం గుర్తించింది. జార్ఖండ్, తెలంగాణ, త్రిపుర రాష్ట్రాల సమాచార కమిషన్లు గత కొన్ని సంవత్సరాలుగా ఉనికిలోనే లేవని, ఆయా రాష్ట్రాల్లో తాజా నియామకాలు జరగడం లేదని తెలిపింది. గత సంవత్సరం నవంబరులో జారీ చేసిన ఆదేశాల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించానని గుర్తు చేసింది. రాష్ట్రాలు కూడా రెండు వారాల్లో నివేదికలు అందజేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కాలపరిమితిని వివరించాలని ఆదేశించింది.

'ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయాన్ని రాష్ట్రాలు కూడా తెలియజేయాల్సి ఉంటుంది. రెండు వారాల్లో దీనిపై నివేదికలు అందజేయాలి' అని న్యాయస్థానం తన ఆదేశాల్లో పేర్కొంది. ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సమాచారం అందజేయడంతో న్యాయస్థానం ఈ ఆదేశాలను వెలువరించింది. తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేసింది. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయకపోవడమంటే సమాచార హక్కు చట్టం ఉద్దేశాన్ని నీరుకార్చడమే అవుతుందని సుప్రీంకోర్టు గతంలోనే వ్యాఖ్యానించింది.

ద్వైవార్షిక ప్రవేశాలకు స్పందన నామమాత్రమే

- ఆరు వర్సిటీల్లోనే యూజీసీ పథకం అమలు

న్యూఢిల్లీ : ఉన్నత విద్యాసంస్థల్లో ద్వైవార్షిక ప్రవేశాలకు సంబంధించి యూజీసీ ప్రవేశపెట్టిన పథకానికి స్పందన నామమాత్రంగానే ఉంటోంది. దేశంలో మొత్తం 48 కేంద్ర విశ్వవిద్యాలయాలు ఉండగా వాటిలో కేవలం ఆరు మాత్రమే ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. సాంకేతిక-యేతర కోర్సులను అందిస్తున్న యూనివర్సిటీలు, కళాశాలలు ఏడాదికి రెండుసార్లు...తొలుత జూలై-ఆగస్ట్, పిదప జనవరి-ఫిబ్రవరిలో విద్యార్థులను చేర్చుకునేందుకు అనుమతించే ప్రతిపాదనకు యూజీసీ మేలో ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేటును (జీఈఆర్) పెంచడానికి ఈ పథకాన్ని ఉద్దేశించారు. అమెరికా, బ్రిటన్ దేశాల్లోని అనేక విశ్వవిద్యాలయాలు సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకుంటున్నాయి.

ద్వైవార్షిక ప్రవేశాలు ప్రారంభించడానికి ముందు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బోధనా సిబ్బందిని దృష్టిలో ఉంచుకొని సరైన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ సూచించింది. కాగా ద్వైవార్షిక ప్రవేశాల పథకాన్ని ఎన్ని కేంద్రీయ యూనివర్సిటీలు, విద్యా సంస్థలు అమలు చేస్తున్నాయని ఎండీఎంకే సభ్యుడు వైగో బుధవారం రాజ్యసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనిపై విద్యా శాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ స్పందిస్తూ సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకునే విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది ఉన్నత విద్యా సంస్థలేనని తెలిపారు. పథకాన్ని అమలు చేసేందుకు ఈ ఏడాది ఆరు యూనివర్సిటీలు ముందుకు వచ్చాయని ఆయన చెప్పారు.

కుల దురహంకార హత్య ప్రభుత్వానికి
కనిపించడం లేదా..?
నాగమణి హత్యపై సీఎం స్పందించి ఆదుకోవాలి

- స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్ వెస్లీ
- త్వరలో కలెక్టరేట్ ఎదుట ధర్నా
- నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్‌లో జరిగిన కుల దురహంకార హత్య రాష్ట్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ ప్రశ్నించారు. పోలీస్ కానిస్టేబుల్ నాగమణి హత్యపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సీపీ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా మూడు నెలల్లో దోషులకు శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం నాగమణి భర్త శ్రీకాంత్ కుటుంబ సభ్యులను సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించింది. అనంతరం సీపీఐ(ఎం) నాయకులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఆస్తి కోసం జరిగిన హత్యగా కేసును తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. అదే నిజమైతే 2017లోనే నాగమణి తన ఆస్తిని సోదరుడు పరమేశ్‌కు బదలాయించిందని గుర్తుచేశారు. ఏడేండ్ల తర్వాత నాగమణి.. దళిత యువకుడు శ్రీకాంత్‌ను వివాహం చేసుకున్నదన్నారు. కుల దురహంకార హత్య కేసును పక్కదోవ పట్టించడానికి భూ వివాదాన్ని తెరపైకి తేవడం సబబు కాదన్నారు. ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టును చేర్చాలని డిమాండ్ చేశారు. కులాంతర వివాహాల ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అందుకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డ్రాఫ్ట్ తయారు చేసి కేంద్రానికి ఇచ్చిందన్నారు. ఈ హత్యలో పరమేశ్‌తో పాటు అతనికి సహకరించిన అనేక మందిని పోలీసులు ఇన్వెస్టిగేషన్ ద్వారా తేల్చాలని డిమాండ్ చేశారు. శ్రీకాంత్‌కు కూడా ప్రాణహాని ఉన్నదని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. త్వరలోనే జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. రాయపోల్ గ్రామంలోనూ సంతాప సభ నిర్వహిస్తామన్నారు.

హత్య జరిగి నాలుగు రోజులు కావొస్తున్నా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, బీజేపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. దళిత యువకుడిని వివాహం చేసుకున్న నేపథ్యంలోనే నాగమణి హత్యపై ఆయా పార్టీలు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదన్నారు. పరామర్శించిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, పి.యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ జంగయ్య, కె. జగన్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జార్ఖండ్ క్యాబినెట్ విస్తరణ

- హేమంత్ సోరెన్ మంత్రివర్గంలో 11 మందికి చోటు



రాంచీ : జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గురువారం 11 మంది మంత్రులతో తన మంత్రివర్గాన్ని విస్తరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో గవర్నర్ సంతోశ్ కుమార్ గంగ్వార్ వారితో ప్రమాణం చేయించారు. పాలక పార్టీ జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) నుంచి ఆరుగురు, కాంగ్రెస్ నుంచి నలుగురు, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నుంచి ఒకరిని క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. అయితే శాఖల కేటాయింపు జరగాల్సి ఉన్నది.

జేఎంఎం నుంచి చైబాసా ఎమ్మెల్యే దీపక్ బిరువా, ఘటశిల ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, గిరిడిహ్ ఎమ్మెల్యే సుదివ్య కుమార్, బిష్ణుపూర్ ఎమ్మెల్యే చమ్రలిండా, గోమియా ఎమ్మెల్యే యోగేంద్ర ప్రసాద్, మధుపూర్ ఎమ్మెల్యే హఫీజుల్ హసన్‌లు మంత్రులుగా ప్రమాణం చేశారు. కాంగ్రెస్ నుంచి దీపికా పాండే సింగ్, ఇర్ఫాన్ అన్సారీ, రాధాకృష్ణ కిషోర్, శిల్పి నేహా టిర్కీలను క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. తాము మంత్రి వర్గంలో భాగం కాదని ఇటీవల సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రకటించిన సంగతి తెలిసిందే.నాలుగు సీట్లు గెలుచుకున్న ఆర్జేడీకి వారి కోటాలో ఓ మంత్రి పదవి లభించింది. గొడ్డా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన సంజయ్ ప్రసాద్ యాదవ్ క్యాబినెట్ మంత్రిగా ప్రమాణం చేశారు.

ఇటీవల జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలలో 81 అసెంబ్లీ స్థానాల్లో, జేఎంఎం నేతృత్వంలోని ఇండియా బ్లాక్ 56 సీట్లు గెలుచుకున్నది. జేఎంఎం 34, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ (ఎంఎల్) 2 సీట్లు గెలుచుకున్నాయి. ఎన్డీఏ 24 స్థానాలకు మాత్రమే పరిమితమైంది.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- పచ్చని పొలాల చుట్టూ తీసిన ట్రంచులను వెంటనే పూడ్చివేయాలి : మాజీ ఎంపీ మిడియం బాబురావు
- గిరిజన సంఘం, వ్యకాస ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట బైటాయింపు



గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలు మానుకోవాలి

నవతెలంగాణ-అశ్వాపురం

మూడు దశాబ్దాలుగా గిరిజనులు సాగుచేసుకుంటున్న భూముల పైకి అటవీశాఖ అధికారులు వెళ్లి పచ్చని పొలాల చుట్టూ కందకాలు తీయించడం సరైన పద్ధతి కాదని, వెంటనే వాటిని పూడ్చివేయాలని లేదంటే గిరిజన రైతులే వాటిని పూడుస్తారని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు తెలిపారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై కొందరు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలను ఆపాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ముందుగా చింతిర్యాల క్రాస్ రోడ్‌లోని ఆదివాసీ భవన్ నుంచి గౌతమీ నగర్ కాలనీ గేట్, అశ్వాపురం ప్రధాన సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు రేగుల గండి, మనుభూతులపాడు, వేములూరు, రాయన్నపేటకు చెందిన గిరిజనులు భారీ ప్రదర్శన నిర్వహించారు. తహసీల్ ఎదుట సుమారు గంటపాటు బైటాయించి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ బి.స్వర్ణకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ మిడియం మాట్లాడుతూ.. పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనులపై కొందరు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యాలకు దిగుతున్నారని, వాటిని సహించబోమని అన్నారు. ఫారెస్ట్ అధికారులు కొట్టిన ట్రంచులను వెంటనే పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాల ప్రకారం.. గిరిజనులకు పోడు భూములపై హక్కు పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులకు ఉందని తెలిపారు.

ఈనెల 12 వరకు అటవీ అధికారులు తీసిన కందకాలను పూడ్చివేయాలని, లేనిపక్షంలో ఆయా గిరిజన గ్రామాల్లో ఉన్న ప్రజలందరూ తిరగబడి పూడ్చు కుంటారని హెచ్చరించారు. న్యాయబద్ధంగా, చట్టపరంగా గిరిజన హక్కుల ప్రకారం 30 ఏండ్లకు పైగా సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలను ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోడు సాగుదారులకు పట్టాలు వచ్చేంతవరకు పోరాటాల బాటను ఆపొద్దని గిరిజనులకు సూచించారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్య మాట్లాడుతూ.. అమాయక గిరిజనులపై దౌర్జన్యాలు చేస్తే సహించేది లేదని అన్నారు. పచ్చని అటవీ ప్రాంతాల్లో ఉంటూ గత కొన్నేండ్లుగా పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అమాయక గిరిజనులపై ఫారెస్ట్ అధికారులైన నాగరాజు, ప్రసాద్, మురళి చేస్తున్న దౌర్జన్యాలను వెంటనే నిలిపివేయాలన్నారు.

అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను అధికారులు సర్వే చేసి హక్కుపత్రాలు ఇవ్వాలని తెలిపారు. అటవీ శాఖ అధికారులు ఓ పక్కన అమాయక గిరిజనుల దగ్గర లంచాలు దండుకుంటూనే మరో పక్కన వారిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. కొందరు అటవీ శాఖ అధికారులు లంచాలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడి మరలా విధుల్లోకి వచ్చి అమాయకమైన గిరిజనులను వేధిస్తున్నారని, ఇకపై వాటిని ఆపివేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మడవి రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాస్, పాయం నరసింహారావు, మణుగూరు మండల కమిటీ నాయకులు సత్రపల్లి సాంబశివరావు, మోకాళ్ళ రమేష్, దండి రాములు, గౌరీ తదితరులు పాల్గొన్నారు.



బెనిఫిట్ షోలు రద్దు చేయాలి

అల్లుఅర్జున్ రావడం వల్లే తొక్కిసలాటలో రేవతి మృతి

- బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- గాయపడ్డవారికి మెరుగైన వైద్యమందించాలి
- సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి : ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆందోళన
- తీవ్ర ఉద్రిక్తత..ట్రాఫిక్ జామ్.. పలువురి అరెస్టు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో భారీ సినిమాల బెనిఫిట్ షోలను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్.మూర్తి, కార్యదర్శి టి.నాగరాజు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. అల్లు అర్జున్ రావడంతోనే సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట జరిగి రేవతి అనే మహిళ చనిపోయిందనీ, ఆమె కుమారుడు తీవ్రగాయాలపాలయ్యాడని చెప్పారు. బెనిఫిట్ షోలపేరుతో సెలబ్రిటీలు అభిమానుల్లోకి రావడానికి పోలీసులు అనుమతి ఇవ్వొద్దని కోరారు. బాధిత కుటుంబానికి కోటి రూపాయల సాయం చేయాలనీ, గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేయాలని కోరారు. ఇవే డిమాండ్లతో గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో గల సంధ్య థియేటర్ వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. 'అభిమానుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు..చనిపోయిన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలి...నిర్మాతలు, ప్రభుత్వం కలిసి రూ.కోటి ఆర్థిక సహాయం ప్రకటించాలి...బెనిఫిట్ షోలు రద్దు చేయాలి...టికెట్ల రేట్లను అన్నింటికీ ఒకేలా ఉంచాలి' అని నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఆ సంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి అక్కడ నుంచి కాంచన్‌బాగ్ పీఎస్‌కు తరలించారు. ధర్నా సందర్భంగా మూర్తి, నాగరాజు, వెంకటేశ్ మాట్లాడుతూ..బెనిఫిట్‌షోకు అల్లు అర్జున్ రావడంతో అభిమానులంతా ఒక్కసారిగా నెట్టుకోవడంతో తొక్కిసలాట జరిగిందనీ, ఆ ఘటనలో మహిళ చనిపోవడంతో పాటు పలువురికి గాయాలయ్యాయని వాపోయారు. చిన్నచిన్న ధర్నాలు, కార్యక్రమాలకే లా అండ్ ఆర్డర్ అని తిరస్కరించే పోలీసులు ఇరుకైన ప్రాంతంలో అల్లు అర్జున్ పర్యటనకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. అల్లు అర్జున్ వచ్చి ఒకరి ప్రాణాలు పోవడానికి కారణమయ్యారని విమర్శించారు. సంధ్యథియేటర్ యాజమాన్యం కూడా ఈ ఘటనకు కారణమని చెప్పారు. ఈ ఘటనను సుమోటోగా తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ, రేవతి కుటుంబాన్ని సినిమా నిర్మాతలు, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావెద్, డీవైఎఫ్ఐ హైదరాబాద్ అధ్యక్షులు హష్మీబాబు, నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్ గువేరా, రమేశ్, రమ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విగ్నేశ్, నాగేందర్, సహన, రజనీకాంత్, ప్రశాంత్, మనోజ్, లక్ష్మణ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఇద్దరు నియంతలకు ఎదురుదెబ్బ!



పార్లమెంటులో మెజారిటీ లేకున్నా ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ తనకు సంక్రమించిన నిరంకుశ అధికారంతో నియమించిన ప్రధాని మైఖేల్ బార్నియర్ అవిశ్వాస తీర్మానంతో ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. దీంతో మరోసారి రాజకీయ, అధికార అనిశ్చితి తలెత్తింది. పార్లమెంటు ప్రతిఘటనతో దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ అత్యవసర పరిస్థితి ప్రకటించిన ఆరుగంటల్లోనే ఎత్తివేయాల్సి వచ్చింది. ప్రతిపక్షాలు అభిశంసనను ఎదుర్కోనున్నాడు.యూన్ సుక్ యోల్ రాజీనామా చేసేంతవరకు నిరవధిక సమ్మె జరపనున్నట్లు కొరియా కార్మిక సంఘాల సమాఖ్య(కెసిటియు) ప్రకటించింది. వివిధ రంగాలకు చెందిన కార్మికులు తమ పని పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ సమ్మెలకు నోటీసులు, తేదీలను ప్రకటించిన పూర్వరంగంలో ఉత్తర కొరియా కమ్యూనిస్టుల నుంచి ప్రమాదం వచ్చిందని, ప్రతిపక్షాలు వారితో చేతులు కలుపుతూ దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నందున అత్యవసర పరిస్థితి విధిస్తున్నట్లు అధ్యక్షుడు కుంటిసాకులు చెప్పాడు.

> పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్మికులపైభారాలు మోపేందుకు వీలు కల్పించే నిర్ణయం తీసుకోవటంతో ప్రతిపక్షం అవిశ్వాసతీర్మానం పెట్టి బార్నియర్ సర్కార్‌ను గద్దెదించింది. జీడీపీలో 60శాతానికి మించి అప్పు ఉండకూడదన్న ఐరోపా సమాఖ్య మార్గదర్శకాలకు భిన్నంగా 112శాతం రుణంతో ఫ్రాన్సు ఉంది. మరిన్ని అప్పులు చేయకుండా లోటును తగ్గించే పేరుతో 60బిలియన్ యూరోల పన్ను విధింపునకు ప్రభుత్వం పూనుకుంది. సామాజిక భద్రత ముసుగులో పార్లమెంటులో చర్చ అవసరం లేని రాజ్యాంగ నిబంధనను ప్రయోగించింది.

అత్యవసర పరిస్థితి ప్రకటించగానే దక్షిణ కొరియా మిలిటరీ పార్లమెంటు చుట్టూ మోహరించి, కార్యకలాపాలను పక్కన పెడుతున్నట్లు ప్రకటించింది. మంగళవారం రాత్రి 11 గంటల నుంచి అత్యవసరపరిస్థితి అమల్లోకి వస్తున్నట్లు చెప్పారు. అయితే చీకటి మాటున ప్రతిపక్షం, అధికార పక్షంలో అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తున్న వారు గోడలు దూకి, చాటుమాటుగా పార్లమెంటులో ప్రవేశించి అధ్యక్షుడి చర్యకు వ్యతిరేకంగా నాలుగు గంటల తరువాత తీర్మానం చేయటమే కాదు, అత్యవసర పరిస్థితి రద్దు ప్రకటన వెలువడే వరకు తాము పార్లమెంటు నుంచి బయటకు వచ్చేది లేదంటూ భీష్మించారు. దాంతో బుధవారం తెల్లవారుజామున 4.30గంటలకు మంత్రివర్గ సమావేశం జరిపి ఆ మేరకు ప్రకటించారు. అధికారపక్ష ఎంపీలు కూడా గోడలు దూకిన వారిలో ఉన్నారంటే మిలిటరీ చూసీ చూడనట్లుగా లేకపోతే సాధ్యం కాదు. దీనంతటికీ కారకుడిగా భావిస్తున్న రక్షణ మంత్రి రాజీనామా చేసి తప్పుకున్నాడు. అధ్యక్షుడిని తొలగించేందుకు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులో అభిశంసన తీర్మానం పెట్టేందుకు నిర్ణయించారు. దానికి గాను అవసరమైన 200 ఓట్లకు గాను మరో ఎనిమిది మంది అధికారపక్షం వారు ఓటేస్తేనే నెగ్గుతుంది. దానికి సుప్రీంకోర్టు లోని తొమ్మిది మందికి గాను ఆరుగురు న్యాయమూర్తులు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.

ఫ్రాన్సు ఐదవ రిపబ్లిక్(1958 నుంచి) చరిత్రలో లేటు(73) వయస్సులో అధికారానికి రావటంలోనూ అత్యంత అల్పకాలం(మూడు నెలలు) అధికారంలో ఉన్న ప్రధానిగా మైఖేల్ బార్నియర్ చరిత్ర కెక్కాడు. ప్రధాని కాగానే నూతన యుగానికి ఆరంభం అని చెప్పాడు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌కు ముందు దేశం ఎక్కడికి పోతుందో తెలియదని హెచ్చరించి ఆప్రక్రియ ముగియగానే ఇంటిదారి పట్టాడు.పచ్చిమితవాద నేషనల్ రాలీ పార్టీ నాయకురాలు మేరీ లీపెన్ అవిశ్వాసానికి మద్దతు ఇవ్వరని బారియర్ వేసుకున్న అంచనాను తన రాజకీయంతో ఆమె వమ్ముచేశారు.వచ్చే ఏడాది జూలై వరకు పార్లమెంటును రద్దుచేసే అవకాశం లేకపోవటంతో అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మక్రాన్ మరోసారి పెద్ద పక్షంగా ఎన్నికైన వామపక్షపార్టీని కాదని అడ్డగోలుగా మరో కొత్త ప్రభుత్వాన్ని నియమిస్తారా, చేసిన తప్పును సవరించుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ప్రభుత్వ పతనం నిజానికి మక్రాన్‌కు తగిలిన ఎదురుదెబ్బ, స్వయంకృతమే. జనంలో గబ్బు పట్టిన ఆ పెద్దమనిషి పదవికి రాజీనామా చేస్తారా అంటే అదంతా భ్రమ అంటూ తిరస్కరించాడు.

పార్లమెంటు ఆమోదంతో నిమిత్తం లేకుండా కార్మికులపై భారాలు మోపేందుకు వీలు కల్పించే నిర్ణయం తీసుకోవటంతో ప్రతిపక్షం అవిశ్వాసతీర్మానం పెట్టి బార్నియర్ సర్కార్‌ను గద్దెదించింది. జీడీపీలో 60శాతానికి మించి అప్పు ఉండకూడదన్న ఐరోపా సమాఖ్య మార్గదర్శకాలకు భిన్నంగా 112శాతం రుణంతో ఫ్రాన్సు ఉంది.మరిన్ని అప్పులు చేయకుండా లోటును తగ్గించే పేరుతో 60బిలియన్ యూరోల పన్ను విధింపునకు ప్రభుత్వం పూనుకుంది. సామాజిక భద్రత ముసుగులో పార్లమెంటులో చర్చ అవసరం లేని రాజ్యాంగ నిబంధనను ప్రయోగించింది. ఫ్రాన్సు, దక్షిణ కొరియా రెండు చోట్లా కార్మికవర్గంపై అక్కడి పాలకులు సాకులు చూపి, నిరంకుశ పద్ధతుల్లో కార్మికవర్గాన్ని అణచివేసేందుకు, భారాలు మోపేందుకు చూసిన తరుణంలోనే ఈ పరిణామాలు సంభవించాయి.

తెలంగాణకు ఆత్మవంటి
స్థానికతకు స్థానం లేకుండా చేసి
పైనున్నోళ్లం కిందున్నోళ్లని
తొక్కి మరింత పైకిపోవాలని
ఇతరుల స్థానాలను, అవకాశాలను
కొల్లగొట్టడానికి
కోటి విద్యలు ప్రదర్శించి
దోచుకోవడానికి దారులు కనిపెట్టిన
మానవతామూర్తులెందరో?

ప్రాణమైన...ఆత్మాభిమానమైన..
జీతమైనా..జీవితమైనా..కష్టార్జితమైన..
సర్వస్వం త్యాగం చేయడమేనా?
కొందరిని రక్షించి..
ఎందరినో శిక్షించే...
అవకాశవాదపు అంచులను తాకే...
ఈనీతి న్యాయాన్ని కనిపెట్టి
'స్థానికత' ఆత్మ గౌరవాన్ని ఫణంగా పెట్టి

317 బాధితుల బాధ తీర్చేదెవరు?


అంగట్లో సరుకుగా చేసి..
ఏం పందెం కాస్తావు? నీ సర్వీసునా..
నీ ఆరోగ్యాన్నా..నీ కుటుంబాన్నా..
అనే స్థాయికి దిగజార్చిన
మహానుభావులెవ్వరో?

నా జిల్లాకు నేను,
నా కుటుంబానికి నేను
అనే పోటీలో నిలబడ్డ ఓ బాధితుడా...
ఈ కృత్రిమ మార్కెట్‌కు సూత్రధారెవరు?
ఈ డిమాండ్‌కు పాత్రధారెవరు?
ప్రశ్నించే తీరిక..
కొట్లాడి వేచి చూసే ఓపిక లేని
ఓ సగటు ఉద్యోగి..నీ బాధ
తీరేదెన్నడు?
ఆపన్న 'హస్తమై.' ఆత్మీయ నేస్తమై..
అధికారంలో కొలువుదీరిన మరుక్షణమే
నీ కష్టాలను కడతేరుస్తామన్న
ప్రజా ప్రభుత్వం
చోద్యం చూస్తున్న వేళ
నీ మనోవేదన వినేదెవరు?
నీ ఆక్రందన పట్టించుకునేదెవరు?
జరిగిన అన్యాయాన్ని రూపుమాపుతామని
స్వాంతన చేకూర్చేదెవరు?
బాధితునికి బాసటగా నిలిచి
స్థానికత బాధను తీర్చేదెవరు?

(చీకటి జీవో 317కు మూడేండ్లు నిండిన సందర్భంగా)

- చెలుమల్ల ఇంద్రరేఖ,
9948015339

అంబేద్కర్‌ది సహజ మరణమేనా?



డాక్టర్ దేవరాజు మహారాజు


బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 14 అక్టోబర్ 1956న నాగపూర్‌లో లక్షల మంది అనుచరులతో హిందూమతాన్ని వదిలి, బౌద్ధం స్వీకరించారు. నాగపూర్ నాగజాతి ప్రజలు జీవించిన భూమి గనుక, వారంతా బౌద్ధులు గనక, తాను బౌద్ధం స్వీకరించడానికి నాగ్‌పూర్‌ను ఎంచుకున్నానని ఆయన ప్రకటించారు. అంతేగాని, నాగ పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది గనక, వారి ప్రాముఖ్యం తగ్గించడానికి తను ఆ పట్టణాన్ని ఎంచు కోలేదనీ, వివరణ ఇచ్చారు. అయితే ఆ తర్వాత 52 రోజులకే 6 డిసెంబర్ 1956న అంబేద్కర్ కన్నుమూశారు. ఆయన మరణం వెనుక ఓ కుట్ర ఉందని, ఆయన మరణించిన నాటి నుండి నేటి దాకా ఒక ఆరోపణ ఉంది. ఆ ఆరోపణ నిజం కాదని అటు భారత ప్రభుత్వం గానీ, ఇటు ఆరోపణలు ఎదుర్కొన్న వర్గాలు గానీ ఆధారాలు, వివరణలు ప్రజల ముందు పెట్టలేదు. అందువల్ల అనుమానాలు అనుమానాల్లాగే ప్రజల మనసుల్లో సజీవంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో జీవించి ఉన్న ఇ.వి.ఆర్.పెరియార్ తన వార్తాపత్రిక 'విడుతలై'లో ఇలా రాశారు. "డాక్టర్ అంబేద్కర్ చనిపోయారని అకస్మాత్తుగా ప్రకటించడం వెనుక ఏదో కుట్ర ఉందని నాకు అనిపిస్తోంది. గాంధీ మరణం వెనుక ఏ కారణం, ఏ కుట్ర ఉన్నాయో అలాంటివే అంబేద్కర్ చనిపోవడం వెనుక ఉన్నాయని నేను బలంగా నమ్ముతున్నాను"-అంటూ చాలా వివరంగా రాశారు. మొత్తం మీద ఆయన వెలిబుచ్చిన ఆవేదనలోని సారాంశం ఏమిటంటే - గాంధీ మరణానికి కారకులెవరో, వారే అంబేద్కర్ మరణాని క్కూడా కారకులని ఆయన నిర్ధారించారు. అందుకు అవకాశమిచ్చే పలు అంశాలను కూడా ఆరోజుల్లో చాలా బయటికి వచ్చాయి. "తన తండ్రికి విషమిచ్చి తెలియకుండా చంపేశారని" స్వయాన అంబేద్కర్ కుమారుడు యశ్వంత్-ఒక అభిప్రాయం వెలిబుచ్చారు. అంబేద్కర్ అభిమానులంతా యశ్వంత్‌ను బలపరిచారు. అంబేద్కర్ మరణవార్త ఈ దేశ ప్రజలకు అనుమానాస్పదమైన వార్త అయ్యింది. "తన తండ్రిది సహజ మరణం కాదని, హత్య అనీ-దోషులెవరో తేల్చాలనీ- అంబేద్కర్ కుమారుడు యశ్వంత్ నాటి ప్రధాని నివాసం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ మరణం తర్వాత పదకొండవ రోజున, ఆయన అనుయాయులు ఢిల్లీ వీధుల్లో పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించారు. నాటి ప్రధాని, రాష్ట్ర పతులకు లిఖిత పూర్వక నివేదికలు, విన్నపాలు అందజేశారు. అంబేద్కర్ మరణం వెనక ఏం జరిగిందో తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

> అంబేద్కర్ మరణానికి ముందు ఆయన కార్యకలాపాలు ఎలా జరిగాయో చూద్దాం! 3 డిసెంబరు 1956న అంబేద్కర్ రెండో భార్య సవితా కబీర్, ఆమె సోదరుడు బాలు కబీర్, తండ్రి కె.బి.కబీర్, ఫ్యామిలీ డాక్టర్, మాల్యాం కర్‌లు అంబేద్కర్‌తో కలిసి గ్రూప్‌ఫొటోలు దిగారు. తమ మధ్య భేదాభిప్రాయాలు లేవని, తమది సంతోషకరమైన కుటుంబమని ప్రపంచానికి చెప్పడానికే డాక్టర్ శ్రీమతి సవిత ఆ ఫొటో షూట్ ఏర్పాటు చేశారని ఒక అభిప్రాయం ఉంది. 4 డిసెంబర్ 1956, రాజ్యసభ మెంబర్‌గా ఉన్న అంబేద్కర్, ఆ రోజు రాజ్యసభకు వెళ్లారు. పార్లమెంట్‌లో మిత్రులతో సరదాగా, చలాకీగా మాట్లాడారు. అదే రోజు సాయంత్రం శ్రీమతి సవిత బంధువులు తండ్రి, సోదరుడు అందరూ ముంబాయి వెళ్లిపోయారు. అయితే, వెళ్లేముందు వారు ఆమెకు నిబ్బరంగా ఉండమనీ, ధైర్యంగా అనుకున్న పని చేయుమని ప్రోత్సహించి వెళ్లారు. దీనికి కేవలం రెండు రోజుల (డిసెంబరు 6న) తర్వాత - ఆయన మరణవార్త విని అందరూ ఆశ్చర్యపోయారు. "ఇంత అకస్మాత్తుగా ఎలా చనిపోయారూ?" అంటూ ఆవేదనకు గురై, విషయం జీర్ణించుకోలేక పోయారు.

నాటి ప్రధాని నెహ్రూ స్పందించి సక్సేనా నిజనిర్ధారణ కమిటీని నియమించారు. కమిటీ భారత ప్రభుత్వానికి అందజేసిన రిపోర్టు ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రజల ముందు పెట్టలేదు. ఒకవేళ రహస్యాలేవీ లేకపోతే, అది బయటపెడితే అన్ని అనుమానాలకూ తెరపడినట్టయ్యేది కదా? ఢిల్లీ పోలీస్ ఐజి ఇచ్చిన వివరణను మాత్రం 27 నవంబర్ 1957 నాడు - అంటే దాదాపు సంవత్సరం తర్వాత, అప్పటి గృహమంత్రి గోవింద్ వల్లబ్ పంత్‌తో పార్లమెంట్‌లో ఒక ప్రకటన ఇప్పించారు. "అంబేద్కర్ మరణం సహజమైందని"- ఆ ప్రకటన సారాంశం! అదొక కంటి తుడుపు ప్రకటన అని దేశ ప్రజలు ఆనాడే భావించారు. అసంతృప్తితో రగిలిపోయారు. ఆనాటి నుండి నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. వ్యాసాలు, పుస్తకాలు ప్రచురింపబడుతూనే ఉన్నాయి. అసహనం, అసంతృప్తి ఏదోరకంగా బయటపడుతూనే ఉంది. 26 జనవరి 2021 నాగపూర్ ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయం ముందు-అంబేద్కర్ ఎలా చనిపోయారో తేటతెల్లం చేయాలని పెద్దఎత్తున నిరసన ప్రదర్శన జరిగింది. 26న జనవరినే ఎందుకు ఎంచుకున్నారంటే - ఆ తేదీన అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది గనుక! మనువాదులైన ఆరెస్సెస్ వారి పాత్ర లేకపోతే జనం వెళ్లి వారి కార్యాలయం ముందు ఎందుకు నిరసన ప్రదర్శనలిస్తారూ? అర్థం చేసుకోవాల్సిన విషయం!

అంబేద్కర్ మరణానికి ముందు ఆయన కార్యకలాపాలు ఎలా జరిగాయో చూద్దాం! 3 డిసెంబరు 1956న అంబేద్కర్ రెండో భార్య సవితా కబీర్, ఆమె సోదరుడు బాలు కబీర్, తండ్రి కె.బి.కబీర్, ఫ్యామిలీ డాక్టర్, మాల్యాం కర్‌లు అంబేద్కర్‌తో కలిసి గ్రూప్‌ఫొటోలు దిగారు. తమ మధ్య భేదాభిప్రాయాలు లేవని, తమది సంతోషకరమైన కుటుంబమని ప్రపంచానికి చెప్పడానికే డాక్టర్ శ్రీమతి సవిత ఆ ఫొటో షూట్ ఏర్పాటు చేశారని ఒక అభిప్రాయం ఉంది. 4 డిసెంబర్ 1956, రాజ్యసభ మెంబర్‌గా ఉన్న అంబేద్కర్, ఆ రోజు రాజ్యసభకు వెళ్లారు. పార్లమెంట్‌లో మిత్రులతో సరదాగా, చలాకీగా మాట్లాడారు. అదే రోజు సాయంత్రం శ్రీమతి సవిత బంధువులు తండ్రి, సోదరుడు అందరూ ముంబాయి వెళ్లిపోయారు. అయితే, వెళ్లేముందు వారు ఆమెకు నిబ్బరంగా ఉండమనీ, ధైర్యంగా అనుకున్న పని చేయమని ప్రోత్సహించి వెళ్లారు. దీనికి కేవలం రెండు రోజుల (డిసెంబరు 6న) తర్వాత - ఆయన మరణవార్త విని అందరూ ఆశ్చర్యపోయారు. "ఇంత అకస్మాత్తుగా ఎలా చనిపోయారూ?" అంటూ ఆవేదనకు గురై, విషయం జీర్ణించుకోలేక పోయారు.



5 డిసెంబర్ 1956న అంబేద్కర్ రెండో భార్య సవిత, ఫ్యామిలీ డాక్టర్ మాల్యాంకర్‌లు కలిసి కావల్సిన వస్తువులేవో తేవడానికి బయటికి వెళ్లారు. వాళ్లుసాయంత్రం దాకా తిరిగి రాలేదు. ఇంతసేపు ఎటు వెళ్లారని అంబేద్కర్ టైపిస్టు రట్టూను విసుగ్గా అడిగారు. తనకు తెలియదన్నాడు రట్టూ. టైప్ చేయాల్సిన కొన్ని ఉత్తరాలు అంబేద్కర్ డిక్టేట్ చేశారు. సాయంత్రం 8 గంటలకు జైనుల బృందం ఒకటి ఆయన్ను కలవడానికి వచ్చింది. ఆ మరునాడు డిసెంబర్ 6న ఒక కార్యక్రమానికి రావల్సిందిగా ఆహ్వానించింది. అంబేద్కర్ వస్తానని ఒప్పుకున్నారు కూడా! ఆ బృందం వెళ్తూ వెళ్తూ ఆయనకు ఒక పుస్తకం బహుమతిగా ఇచ్చి వెళ్లింది. అది బుద్ధుడిపై రాసిన పుస్తకం. జైనుల బృందంతో మాట్లాడుతున్నప్పుడే ఫ్యామిలీ డాక్టర్ వచ్చి జనరల్ చెకప్ చేసి, తను ముంబాయి వెలుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటికి అంబేద్కర్ రచన 'బుద్ధ అండ్ హిజ్ ధమ్మ' కొనసాగుతూ ఉంది. దానికి సంబంధించి కొన్ని విషయాలు టైపిస్ట్ రట్టూతో టైప్ చేయించారు. టైపిస్ట్ వెళ్లిపోయిన కొంతసేపటికి అంబేద్కర్ రాత్రి భోజనం ముగించుకుని పడక గదిలోకి వెళ్లిపోయారు. అంతే!!

ఆ మరునాడే అనూహ్యంగా ఆయన మరణవార్త బయటికొచ్చింది. సజావుగా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్న వ్యక్తి, ఆరోగ్యం ప్రమాదకరంగా లేని వ్యక్తి ఎలా మరణించారన్న అనుమానం దేశ ప్రజలకు కలిగింది. విష ప్రయోగం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. ఎవరు విషప్రయోగం చేశారూ? అన్నది అధికారికంగా బయటికి రాలేదు. మామూలుగా అయితే సరుకులు తీసుకురావడానికి శ్రీమతి సవితకు ఫ్యామిలీ డాక్టర్ను తీసుకుని వెళ్ళాల్సిన పనిలేదు. తీసుకు వెళ్లారంటే అతని సహాయంతో కొనవల్సిన వస్తువేదో ఉండి ఉంటుంది. పైగా ఆ ఫ్యామిలీ డాక్టరు ఉన్నఫళంగా ఊరు విడిచి వెళ్లాల్సిన అవసరమేమొచ్చిందీ? వెళితే సవిత కుటుంబ సభ్యులతో పాటే ముంబాయి వెళ్లిపోవాల్సింది. ఒక రోజు ఆగి, ఆయన నిర్వహించిన పాత్ర ఏమిటీ? అంబేద్కర్ రెండో భార్య డా.సవితది బ్రాహ్మణ కుటుంబం, ఫ్యామిలీ డాక్టరు బ్రాహ్మణుడు, ఆనాటి అగ్రశ్రేణి దేశ నాయకులంతా బ్రాహ్మణులు. వీరందరూ కలిసి, ఆనాటి బ్రాహ్మణాధిపత్య ఆరెస్సెస్ సంస్థకు సహకరించారా? అంబేద్కర్ ఎదుగుదలని జీర్ణించుకోలేకపోయారా? ఇలా ఆనాటి దేశప్రజల్లో వ్యక్తమైన సందేహాలు అనేకం. అవే సందేహాలు ఈనాటి ప్రజల్లో కూడా ఇంకా కొనసాగుతున్నాయి.

వీటికి నేపథ్యంగా మరి కొన్ని విషయాల్ని కూడా గమనించాల్సి ఉంటుంది. 1. బౌద్ధం స్వీకరించిన లక్షలాది మందిని ఉద్దేశించి అంబేద్కర్ 15 అక్టోబర్ 1956న నాగపూర్‌లో రెండు గంటల పాటు ఉపన్యసించడం. 2. బుద్ధుడు-కార్ల్‌మార్క్స్ శీర్షికన 4వ బుద్ధిస్ట్ కాన్ఫరెన్స్: 20 నవంబర్ 1956న అంబేద్కర్ నేపాల్‌లో ఉపన్యసించడం. 3.ప్రాచీన భారతంలో హిందూ మతంలోని లొసుగులు-శీర్షికన అంబేద్కర్ గ్రంథ రచనకు పూనుకోవడం.4. బౌద్ధంలోని భారతదేశ ప్రజల్ని అధిక సంఖ్యలో మార్చాలని తలపెట్టడం- వీటన్నిటి కారణంగా హిందూత్వ మనువాదులు అంబేద్కర్‌పై ద్వేషం పెంచుకున్నారా? వారి ఆలోచనా ధోరణికి అంబేద్కర్ చాలా ప్రమాదకారి కాబోతున్నాడని గ్రహించి, అడ్డుతొలగించుకున్నారా? బహుశా? ఒకవైపు రాజకీయంగా, మరొకవైపు, తాత్త్వికంగా, ఆధ్యాత్మికంగా దేశంలో తిరుగులేని నాయకుడైన అంబేద్కర్‌తో తమకు ఎప్పటికైనా ప్రమాదమేనని అనుకున్నారా? ఇవన్నీ ఆనాటి, జనం వెలిబుచ్చిన సందేహాలు!

> సజావుగా కార్యక్రమాలు నిర్వహించు కుంటున్న వ్యక్తి, ఆరోగ్యం ప్రమాదకరంగా లేని వ్యక్తి ఎలా మరణించారన్న అనుమానం దేశ ప్రజలకు కలిగింది. విష ప్రయోగం జరిగిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. ఎవరు విషప్రయోగం చేశారూ? అన్నది అధికారికంగా బయటికి రాలేదు. మామూలుగా అయితే సరుకులు తీసుకురావడానికి శ్రీమతి సవితకు ఫ్యామిలీ డాక్టర్ను తీసుకుని వెళ్ళాల్సిన పనిలేదు. తీసుకు వెళ్లారంటే అతని సహాయంతో కొనవల్సిన వస్తువేదో ఉండి ఉంటుంది. పైగా ఆ ఫ్యామిలీ డాక్టరు ఉన్నఫళంగా ఊరు విడిచి వెళ్లాల్సిన అవసరమేమొచ్చిందీ? వెళితే సవిత కుటుంబ సభ్యులతో పాటే ముంబాయి వెళ్లిపోవాల్సింది. ఒక రోజు ఆగి, ఆయన నిర్వహించిన పాత్ర ఏమిటీ? అంబేద్కర్ రెండో భార్య డా.సవితది బ్రాహ్మణ కుటుంబం, ఫ్యామిలీ డాక్టరు బ్రాహ్మణుడు, ఆనాటి అగ్రశ్రేణి దేశ నాయకులంతా బ్రాహ్మణులు. వీరందరూ కలిసి, ఆనాటి బ్రాహ్మణాధిపత్య ఆరెస్సెస్ సంస్థకు సహకరించారా? అంబేద్కర్ ఎదుగుదలని జీర్ణించుకోలేకపోయారా? ఇలా ఆనాటి దేశప్రజల్లో వ్యక్తమైన సందేహాలు అనేకం.

అంబేద్కర్ ఇంకొంత కాలం బతికిఉంటే, దేశంలో పరిస్థితులు వేరొక రకంగా ఉండేవి. దేశంలో బౌద్ధం ఉధృతంగా వ్యాపించేది. ఆర్య బ్రాహ్మణుల మనువాద సంస్థ అయిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కుట్రలు సత్వరం బట్టబయలయ్యేది. వీరు కల్పించిన హిందూ దేవీ దేవతల మాయలు, మంత్రాలు నిర్వీర్యమై పోయేవి. అభ్యుదయం కొత్తపుంతలు తొక్కేది. కనీసం మత సామరస్యం కొనసాగేది. మత కలహాల పేరిట అఘాయి త్యాలు, మారణకాండలు ఆగేవి. ఎటు నుండి ఎటు చూసినా, ఏరకంగా విశ్లేషించుకున్నా - అంబేద్కర్ మరణం ఎవరికి లాభం? కేవలం మనువాదులకే! వారిచే నిర్వహించబడే ఆరెస్సెస్ సంస్థకే!! దాని ఇతర అనుబంధ సంస్థలకే!! భారతదేశాన్ని హిందూ రాజ్యంగా మార్చాలన్న వారి కోరిక స్వాతంత్ర్యం రాక ముందు నుండే ఉంది. దేశ విభజన జరిగినపుడు అటు ముస్లిం రాజ్యం పాకిస్థాన్ ఏర్పడింది. గనుక ఇటు హిందూ రాజ్యం ఏర్పడాలనే కదా వారు కోరుకున్నదీ? దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకోకుండా బ్రిటీష్‌వాని భజన చేసింది ఎందుకూ? జాతీయ జెండాను ఎగరేయకుండా ఏండ్లకేండ్లు తమ కాషాయ జెండానే ఎగరేసుకున్నది ఎందుకూ?

నెహ్రూజీ తొలి ప్రధాని అయ్యారు కాబట్టి, సోషలిజానికి, వైజ్ఞానిక ప్రగతికి ఆయన ప్రాధాన్యమిస్తూ వచ్చారు. అప్పుడు వీరి ఆటలు అంతగా సాగలేదు. అయినా ఆశ వదులుకోకుండా వారి లక్ష్యసాధనకు వారు, నిరం తరం కృషిచేస్తూనే వస్తున్నారు. దాని ఫలితాలను నేడు కూడా మనం చూస్తూనే ఉన్నాం! డా. అంబేద్కర్‌ది సహజ మరణమా? లేక హత్యా అనేది ఆ రోజుల్లో బయటికి రాలేదు. అరవైఎనిమేండ్ల తర్వాత, ఆధారాలన్నీ చెదిరిపోయిన తర్వాత ఇప్పుడు అదే ఆరెస్సెస్ నడిపిస్తున్న ప్రభుత్వ హయాంలో బయటికి వస్తుదన్న నమ్మకం లేదు గానీ- గతంలో జరిగిన కొన్ని వాస్తవాలు ఈ తరానికి తెలియజేయడం అవసరమనిపించింది. అయితే, బాబాసాహెబ్ అర్థాంతరంగా వదిలేసిన కర్తవ్యాలని, రాజ్యాంగబద్ధమైన హక్కుల సాధనని ఈతరం యువతీ యువకులు ముందుకు తీసుకు పోవాల్సి ఉంది. ఈ పోరాటం నిరంతరం కొనసాగుతూ ఉండాల్సిందే!

(Ref: 1st JAN,1818 REVOLT OF INDEPENDENCE BY; VILAS KHARAT-BAMCEF 2003 Rediff.com.India News\2016 Hindi.one India. Com 2017 BAMCEF 2019 Jaibheem.Bligspot.com\Ambedkar's last

(6 డిసెంబర్, అంబేద్కర్ వర్ధంతి)

- కేంద్ర సాహిత్య అకాడమీ, అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త.(మెల్బోర్న్)నుంచి

సమానత్వం, సామాజిక న్యాయం: అంబేద్కర్‌వాదం



టి.సైలాబ్ బాబు
9177549646

ఇటీవల జరిగిన మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీ భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఒక మత ప్రచారకుడిలా మాట్లాడారు. హిందువులందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు.హిందువులు ఐక్యంగా లేరని, అసమానతలతో ఉన్నారని మోడీ అంగీకరించారు. సామాజిక అంతరాలు తొలగిపోవడానికి ఐక్యం కావలన్నారా? అగ్రవర్ణ హిందువులను ఐక్యం చేస్తారా?అణగారిన వర్గాల హిందువులను ఐక్యం చేస్తారా? తేల్చిచెప్పాలి. 'మనమంతా హిందువులం.. గంగాజల బిందువులం.. బంధువులం' అని ఆరెస్సెస్ నిరంతరం వల్లేవేస్తున్నది. ఒకే కులంలోపుట్టిన వాళ్లు మాత్రమే బంధువులు అవుతున్నారు.వేర్వేరు కులాల వాళ్లు స్నేహి తులు మాత్రమే అవుతున్నారు. దేశంలో 6486 కులాల వాళ్లు అందరూ హిందువులే కదా అన్ని కులాలను రద్దుచేసి ఒకే కులం పెట్టగలిగితే హిందువులంతా ఏకమవుతారు కదా? ఒకే కులానికి ఒప్పుకుంటారా? స్వకుల వివాహ పద్ధతిని తిరస్కరించి కులరహిత పెళ్లిళ్లకు ప్రధాని మోడీ పార్లమెంట్‌లో బిల్లుపెట్టి చట్టం చేస్తారా? దాని ద్వారా మాత్రమే హిందువులు ఐక్యం కాగలరు.ఇలాంటి ఐక్యతకు ఆరెస్సెస్- బీజేపీ సిద్ధమవుతుందా? అనేది ప్రధాన ప్రశ్న.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రధాని మోడీ భారత రాజ్యాంగ గ్రంథాన్ని కండ్లకు అద్దుకున్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని తమపై ప్రతిపక్షాలు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు.కానీ గత పదేండ్ల కాలంలో మోడీ సర్కారు రాజ్యాంగాన్ని రద్దు చేయకుండానే దాని మౌలిక లక్ష్యాలను పాతాళంలోకి తొక్కేసింది. 'మనుస్మృతి మా పవిత్ర ప్రాచీన రాజ్యాంగం' అని ఆరెస్సెస్ కార్యకర్త కృష్టారెడ్డి ఒక గ్రంథం రాశారు. దాన్ని 2022 ఫిబ్రవరి 23న హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో ఆవిష్కరించడానికి ప్రయత్నించారు. ప్రస్తుత బీజేపీ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ బాజాప్త భారత రాజ్యాంగంలో లౌకికవాదం అనే పేరును తొలగిస్తామని చెప్పారు. బీజేపీ విధానం రాజ్యాంగ రక్షణే అయితే ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? మూడువేల ఏండ్లుగా మనుస్మృతి దుష్ట ఫలితాలవల్ల మన దేశంలో మెజార్టీ హిందువులు చదువు, సంపద, ఆస్తులు, ఆభరణాలు, ఆయుధాలు, అధికారా లు నిషేధించబడ్డాయి. వాటిని ఎలా సరిదిద్దగలరో చెప్పగలరా? మెజార్టీ హిందు వులు ఈ అసమానతలు ఎందుకు అనుభవిస్తున్నారో వివరించగలరా?75 ఏండ్ల భారత రాజ్యాంగం తర్వాత కూడా నేటికీ సంపూర్ణ అక్షరాస్యత ఎందుకు సాధించలేక పోయాం? ఎందుకు నిలువ నీడ లేక లక్షలాది మంది పేదలు పట్టణాల్లో గుడిసెలు వేసుకుంటున్నారు? సమాధానం చెప్పగలరా?

77 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత ఒక్క ముస్లిం, ఒక్క క్రైస్తవుడు ఈదేశాన్ని పరిపాలించలేదు కదా. హిందువుల జీవితాలు ఎం దుకు మారలేదు. ప్రపంచ మానవాభివృద్ధి సూచీలో మనదేశం 107స్థానంలో ఎందుకుంది? ప్రపంచ ఆకలిసూచిలో132 స్థానానికి ఎందుకు దిగజారాం? మన దేశం జీడీపీ 8.1 నుండి 5.4శాతానికి ఎందుకు పడిపోయింది? ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు హిందువులకు ఎందుకివ్వలేదు? ఇటీవల ఆగస్టు1న అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీ ఉపవర్గీకరణ చేసుకునే అవ కాశం రాష్ట్రాలకు కల్పిస్తూ తీర్పునిచ్చింది. ఈ తీర్పు తర్వాత అట్టడుగు వర్గాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. మాలలంతా మనువాదు లేనని ఒకరు, మాదిగలంతా మనువాదులని వ్యాఖ్యలు చేసుకుంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాత మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఒక కులం నాయకుడిగా ,ఈ తీర్పు తర్వాత మాల నాయకుడిగా మారుస్తున్నారు. అంబేద్కర్ మాల కాదు, జగ్జీవన్ రామ్ మాదిగ కాదు ఒక రాష్ట్రంలో బీసీలో ఉన్న ఒక కులం మరో రాష్ట్రంలో ఎస్సీగా ఉంటుంది. దేశంలో 1500 ఎస్సీ కులాల్లో అంబేద్కర్ పుట్టిన మహార్ కులం కూడా ఒక షెడ్యూల్డ్ కులంఅంతేగాని, ఇక్కడ ఉన్న మాల కులం అక్కడి మహార్ కులం ఒకటి కాదు. మహార్, మాల వేర్వేరు. చమర్‌లు అందరూ మాదిగలు కాదు. సమగర మోచి కులం కూడా చెప్పులు కుట్టే వృత్తిలో ఉంది. అందుకని మోచి, మాదిగ ఒకటి కాదు. కులం అంటే మనువాద కులవ్యవస్థలో వియ్యం పొత్తు..కంచం పొత్తు ఉంటేనే ఒక కులంగా పరిగణిస్తుంది. దేశంలో అట్టడుగు వర్గాల విచ్ఛిన్నం మనువాదమైతే ఐక్యత విచ్ఛిన్నమవుతుంది. ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయమే అంబేద్కర్ వాదం. అసమానతలే మనువాదం. మనుస్మృతి సృష్టించిన ఈ అసమానతలను ఐక్యంగా ఎదుర్కొని ఆ మధ్యయుగాల కాలం నాటి దుష్టత్వాన్ని సమూలంగా సమాధి చేయాల్సిన అవసరం ఉన్నది.



మాల మాదిగలు సంపన్నులు కారు.నూటికి తొంభై శాతం మంది రెక్కలే ఆస్తులుగా కలిగి ఉన్న నిరుపేదలు. ఒకరిద్దరు సంపన్నులు ఉన్నమాట నిజమే, కానీ అత్యధికులు నేటికి దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్నారే. తెలంగాణ రాష్ట్రంలో 59 ఎస్సీ కులాల్లో మాల మాదిగ మినహాయిస్తే మిగిలిన 57 కులాలు నేటికి అక్షర జ్ఞానానికి నోచని దుస్థితిలో సంచార జీవనం సాగిస్తున్నారు.సభ్య సమాజంతో సంబంధం లేకుండా ఉన్నారు. వారి చదువు,ఉపాధి,నివాసం వైద్యం వాళ్ల జీవన విధానం నేటికీ అగమ్యగోచరమే.

ఎస్సీ వర్గీకరణ ఒక్కటే సర్వరోగ నివారిణి కాదు. ఆయినంతమాత్రాన అందరికి సమన్యాయం, సామాజిక న్యాయం జరిగి తీరాలి. దేశప్రజలందరి గుండెకాయగా ఉన్న భారత రాజ్యాంగం రద్దు చేస్తే దేశం తిరిగి మధ్యయుగాల్లోకి వెళుతుంది. రాజ్యాంగ రక్షణ ఐక్య కర్తవ్యం కావాలి ప్రభుత్వరంగం లేకుండా రిజర్వేషన్లు ఉండవు. సామాజిక న్యాయం సమాధి అవుతుంది. నూటికి 80శాతంగా పెరిగిన ప్రయివేట రంగంలో రిజర్వేషన్లకోసం ఐక్యంగా పోరాడాలి. ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం దేశవ్యాప్తంగా అమలుకు కృషి చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తూ, బడ్జెట్ తగ్గిస్తూ దళితుల నోటికాడి బుక్క లాగేస్తున్న బీజేపీ విధానాలపై పోరాడాలి.బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ తాత్సారం చేయడాన్ని ప్రశ్నించాలి.దేశవ్యాప్తంగా దళితులను టార్గెట్‌గా చేసుకొని మతోన్మాదులు సాగిస్తున్న దౌర్జన్యాలను ప్రతిఘటించాలి. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై పెరుగు తున్న దాడుల్ని ఐక్యంగా ఎదుర్కోవాలి. యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో దళితులు అభద్రతలో ఉన్నారు. ఆ దౌర్జన్యాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలి.

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యం కులనిర్మూలన, అసమానతలు లేని భారతం. కానీ ఆయన లక్ష్యాలు అధ్యయనం చేయకుండా అంబేద్కరిస్టులు కాలేరు. భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమల్లో కార్మికులకు కూడా యాజమాన్య వాటా ఉండాలని, స్త్రీ పురుష సమానత్వం కోసం ఆయన హిందూ కోడ్ బిల్లు తెచ్చి నాటి ప్రభుత్వాలు అంగీకరించకపోతే కేంద్ర క్యాబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1948లోనే కార్మికులకు కనీస వేతనచట్టం తీసుకొచ్చారు. అందుకే అట్టడుగు ప్రజల ఐక్యతలోనే అంబేద్కర్ ఉంటాడు. సమన్యాయం కోసం సమన్వయంతోనే అంబేద్కర్ లక్ష్యాలు సాధిస్తామన్న విషయం గమనించాలి.

> డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత లక్ష్యం కులనిర్మూలన, అసమానతలు లేని భారతం. కానీ ఆయన లక్ష్యాలు అధ్యయనం చేయకుండా అంబేద్కరిస్టులు కాలేరు. భూమి జాతీయకరణ జరగాలని, పరిశ్రమల్లో కార్మికులకు కూడా యాజమాన్య వాటా ఉండాలని, స్త్రీ పురుష సమానత్వం కోసం ఆయన హిందూ కోడ్ బిల్లు తెచ్చి నాటి ప్రభుత్వాలు అంగీకరించకపోతే కేంద్ర క్యాబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1948లోనే కార్మికులకు కనీస వేతనచట్టం తీసుకొచ్చారు. అందుకే అట్టడుగు ప్రజల ఐక్యతలోనే అంబేద్కర్ ఉంటాడు. సమన్యాయం కోసం సమన్వయంతోనే అంబేద్కర్ లక్ష్యాలు సాధిస్తామన్న విషయం గమనించాలి.

కేంద్ర బీజేపీ పాలకులు మతం కేంద్రంగా పరిపాలన చేస్తూ రాజ్యాంగం మౌలిక పునాదుల్ని తుంచే కుట్రలో నిమగ్నమై ఉన్నారు. ఈ నేపథ్యంలో అట్టడుగు వర్గాల ఐక్యత సమన్వయం సామాజిక న్యాయం వైపుగా అడుగులు వేయాలి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అస్పృశ్యుల ఐక్యతకు జీవితాన్ని ధారపోశాడు. అట్టడుగు కులాల్లో అనైక్యతను సృష్టించే మనువాద ఎజెండా మన తరగతుల్లో విస్తృతంగా అమలవుతున్నది. అంబేద్కర్, పూలే, మార్క్స్ ఆలోచనలు ఆశయాలు నేటితరం ఆకలింపు చేసుకొని ముందుకు సాగాలి. అట్టడుగు వర్గాల్లో ఐక్యతను సాధించకుండా రాజ్యాంగ లక్ష్యాలను రక్షించుకోలేము. సామాజిక న్యాయాన్ని సాధించుకోలేము. వర్గీకరణ అంశంపై మాల, మాదిగ మేధావులతో సంఘీభావ కమిటీ ఏర్పడాలి. శాంతి చర్చలు, సమన్యాయం జరగాలి. విద్వేషాలు రెచ్చగొట్టడం మనువాద సంస్కృతి, విశాలత ఐక్యత అంబేద్కర్ సంస్కృతి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వర్ధంతి సందర్భంగా దళితుల్లో ఐక్యతను సాధించడమే అంబేద్కర్‌కు మనమిచ్చే నిజమైన నివాళి.

రవాణా శాఖ సిబ్బంది సేవలు అసాధారణం

ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఉచిత బస్సు పథకం : ప్రజాపాలన-రవాణా శాఖ విజయోత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రవాణా శాఖకు సిబ్బంది చేస్తున్న సేవలు అసాధారణమైనవి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ మైదానంలోని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ప్రజాపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... ఏడాది కాలంలో రవాణా శాఖ సిబ్బంది సాధించిన విజయాలను గుర్తు చేయాలనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆరు గ్యారెంటీల్లో భాగంగా డిసెంబర్ 9న ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఇది ఆర్టీసీని పునరుజ్జీవింప చేసిందని తెలిపారు. ఇది ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగును నింపే కార్యక్రమమని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆర్టీసీ కార్మికుల పాత్ర మరువలేనిదని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ అయినా, ఇవాళ ముఖ్యమంత్రిగా ఉన్న నేనైనా బాధ్యతాయుతంగా రవాణా కార్మికుల ఆకాంక్షలను గౌరవించాల్సిందేనన్నారు. కానీ ఆనాడు ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పరామర్శించని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈనాడు కీలకమైన అంశాలకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. 11 నెలల 20 రోజుల్లో 115 కోట్ల మంది ఆడబిడ్డలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకున్నారని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ప్రతీ ఆడబిడ్డ ప్రతీ నెలా రూ.5 నుంచి రూ.7 వేలు ఆదా చేయగలుగుతున్నారని తెలిపారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆడబిడ్డలను రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్టు వివరించారు. ప్రతీ నెలా ఒక కుటుంబానికి రూ. 10వేలు ప్రయోజనం పొందేలా పథకాల అమలు జరుగుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 25లక్షల 35 వేల రైతు కుటుంబాలకు మొదటి ఏడాదిలోనే రూ. 21కోట్లతో రైతు రుణమాఫీ చేశామన్నారు.

వరి వేసిన వారికి గిట్టుబాటు ధరతో పాటు సన్నాలకు రూ.500 బోనస్ అందిస్తున్నట్టు తెలిపారు. కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని చెప్పారు. దొడ్డు బియ్యం తినే పరిస్థితి లేదనీ, అందుకే రైతులు సన్నాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ హాస్టళ్లలో, రేషన్ షాపుల్లో, మధ్యాహ్న భోజనాలకూ సన్నబియ్యం అందిస్తామని పునరుద్ఘాటించారు. ఈ నేలలో పండిన పంటనే మన బిడ్డలకు అందిస్తామన్నారు. 'బియ్యం రీసైక్లింగ్ మాఫియాను కూకటి వేళ్లతో పెకిలిద్దాం. నోటిఫికేషన్లు ఇచ్చి వాళ్ల పారిపోతే.. కోర్టుల్లో కేసులు పరిష్కరించి మొదటి ఏడాదిలోనే 55,143 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఏడాదిలోనే 55 వేల ఉద్యోగాలు ఇచ్చిన చరిత్ర ఉందా? ఏ లక్ష్యం కోసం అమరుల ప్రాణ త్యాగం చేశారో, ఆ లక్ష్య సాధనలో భాగంగా తొలి ఏడాదిలోనే 55వేల ఉద్యోగ నియామకాలు చేపట్టాం. ఇందులో ఒక్క తల తగ్గినా నేను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నా. నగరంలో కాలుష్య నియంత్రణలో రవాణా శాఖది కీలక పాత్ర. కాలం చెల్లిన వాహనాలను స్క్రాప్‌నకు పంపాల్సిన బాధ్యత మీపై ఉంది.

ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు పెరగాల్సిన అవసరం ఉంది. దీనిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనదే. రాబోయే రెండేండ్లలో మూడు వేల ఎలక్ట్రిక్ బస్సులు కొని హైదరాబాద్ నగరాన్ని కాలుష్యం నుంచి కాపాడుతాం. హైదరాబాద్ నగరంలో ఎలక్ట్రిక్ ఆటోలు నడుపుకునేందుకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇవ్వాలో ఒక ప్రణాళిక రూపొందించండి. నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చాల్సిన బాధ్యత ఉన్నది. మూసీకి గోదావరిని అనుసంధానం చేసి మూసీని అభివృద్ధి చేస్తాం. అవసరమైతే కొన్ని సార్లు కఠిన నిర్ణయాలు తీసుకునైనా సరే హైదరాబాద్ నగరంలో కాలుష్యాన్ని పారదోలుతాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా నిలబెట్టేందుకు కృషి చేస్తాం' అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా, రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, జేటీసీలు సీ. రమేష్, మమతా ప్రసాద్, డీటీసీ చంద్రశేఖర్ గౌడ్ , టెక్నికల్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్రకుమార్ , శ్రీనివాస్‌రెడ్డి, ఆర్టీవోలు, ఆర్టీసీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టు

నవతెలంగాణ-మియాపూర్

వరుసగా బీఆర్ఎస్ నేతల అరెస్టులు గురువారం రాష్ట్రంలో హైడ్రామా సృష్టించాయి. తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని ఆయన ఇంటివద్ద అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యే హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఇతర నేతలు కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి.. ఆయన్ను ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసులను నిలదీశారు. పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య వాగ్వివాదం జరిగింది. దాంతో కౌశిక్‌రెడ్డితోపాటు హరీశ్‌రావు, ఇతర నేతలను సైతం పోలీసులు అరెస్టు చేశారు. కౌశిక్‌రెడ్డిని బంజారాహిల్స్ పీఎస్‌కు తరలించగా.. హరీశ్‌రావుతోపాటు ఇతర నేతలను గచ్చిబౌలి పీఎస్‌కు తరలించారు. అయితే తమ నేతల అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు గచ్చిబౌలి పీఎస్‌కు భారీగా తరలివచ్చారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని ఆందోళన చేశారు. అరెస్టు అయిన వారిని ఎమ్మెల్సీ కవితతోపాటు మాజీ మంత్రులు పరామర్శించారు. కాగా, గచ్చిబౌలి పీఎస్‌కు తరలించిన హరీశ్‌రావు, ఇతర నాయకులను గురువారం రాత్రి విడుదల చేశారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్‌కు గురవుతుందని బుధవారం బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ముందుగా ఆయన ఏసీపీ అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పీఎస్‌కు వెళ్లగా అక్కడ ఏసీపీ లేకపోవడంతో తన ఫిర్యాదును తీసుకోవాలని స్టేషన్ సిబ్బందిని కోరారు. ఈ క్రమంలో అక్కడ వాగ్వివాదం చోటుచేసుకుంది. చివరికి కౌశిక్‌రెడ్డి తన ఫిర్యాదు సిబ్బందికి అందజేశారు. అయితే ఈ క్రమంలోనే తమ పీఎస్‌లో కౌశిక్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించారని, విధులకు ఆటంకం కలిగించారని పోలీసు అధికారి రాఘవేంద్ర పీఎస్‌లో కంప్లైంట్ చేశారు. ఆ కంప్లైంట్‌ను ఆధారంగా చేసుకుని గురువారం ఉదయం పోలీసులు కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం : కవిత ఎమ్మెల్సీ

రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి బుధవారం ఏసీపీకి ఫోన్ చేసి తను కంప్లైంట్ ఇవ్వడం కోసం పోలీస్ స్టేషన్‌కు వస్తున్నానని ముందస్తు పర్మిషన్ తీసుకొని మాత్రమే ఆయన వెళ్లినట్టు తెలిపారు. ఉదయం అరెస్టు చేసి రాత్రైనా వారిని కోర్టుకు తీసుకుపోకుండా పీఎస్‌లో బంధించడం వెనుక కారణాలేంటో చెప్పాలన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగేతర శక్తిగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం మారిందన్నారు. గాంధీ భవన్‌లో రాసిచ్చినవే ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. పోలీసులు తమ విధులు సక్రమంగా నిర్వహించాలని హితవు పలికారు.

ప్రజా పాలన కాదు, రాక్షస పాలన : ఎమ్మెల్యే హరీశ్‌రావు

రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన నడుస్తోందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ పాలన అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని విమర్శించారు. గచ్చిబౌలి పీఎస్ నుంచి విడుదలైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.. పోలీసులను అతిగా ప్రయోగించిన ఏ ప్రభుత్వమూ నిలబడలేదని, ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో ఇవాళ కేసులు, ఎఫ్ఐఆర్‌లు పోలీస్‌స్టేషన్లలో కాకుండా గాంధీభవన్‌లో తయారవుతున్నాయని తెలిపారు. గాంధీ భవన్ నుంచి ఆదేశాలు రానందునే తమను విడుదల చేయడానికి ఆలస్యం అయిందన్నారు. సీఎంకి ఢిల్లీలో రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని, ఆ పగ, ప్రతీకారంతోనే శాడిస్టిక్‌లా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడో గ్యారంటీ ప్రజాస్వామ్యం అమలు కావడం లేదన్నారు. దేశ ప్రతిపక్ష నాయకుడిని, తననెందుకు అరెస్టు చేస్తారని రాహుల్ గాంధీ అడుగుతున్నారని, మరి తెలంగాణలో కూడా సీఎం రేవంత్ అదే చేస్తున్నడు అని నిలదీశారు.

తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడ?

కేసీఆర్ ఫాంహౌస్ విడిచి బయటకు రావాలి

కౌశిక్‌రెడ్డి మతి లేకుండా మాట్లాడుతున్నారు

బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి గంధపు చెక్కల స్మగ్లర్ : మంత్రి కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ పిచ్చి కూతలు కూస్తున్నారు. ఆయన భాష దారుణంగా ఉంది. రాష్ట్రం వస్తుందని తెలిశాకే కేటీఆర్, కవిత తట్టాబుట్టా సర్దుకొని ఉద్యమంలోకి వచ్చారు. విద్యార్థుల బలిదానాలు, అన్ని వర్గాల పోరాటం ఫలితంగానే స్వరాష్ట్రం సిద్ధించింది. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ ఎక్కడున్నారో చెప్పాలి" అని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె బీఆర్ఎస్‌పై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ మీడియా ముందు ఏం మాట్లాడు తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. ఆయన ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. గతంలో పెట్రోల్ క్యాన్ తెచ్చుకొని అగ్గిపెట్టె మర్చిపోయా రనీ, ఇప్పుడు పెట్రోల్ క్యాన్ తెచ్చుకుంటే అగ్గిపెట్టెలు బీఆర్ఎస్ కార్యకర్తలే ఇస్తారని ఎద్దేవా చేశారు. ఉద్యమంలో కేసీఆర్ కుటుంబంలోని వారిలో ఏ ఒక్కరికి ఒక్క గీత కూడా పడలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులాలపై సూక్ష్మంగా ఆలోచిస్తూ వారి ఎదుగుదల కోసం పనిచేస్తున్నారని తెలిపా రు. కేసీఆర్ ఫాంహౌస్ వీడి ప్రజాక్షేత్రంలోకి రావాలని హితవు పలికారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు, నాయకులు అర్థవంతమైన సలహాలు, సూచనలు చేస్తే స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అర్థం పర్థం లేకుండా మాటాడితే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ లాగా తాము అక్రమ అరెస్టులు చేయదలుచుకుంటే ఆ పార్టీలో ఒక్కరూ మిగలరని వ్యాఖ్యానించారు. ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్ఎస్ నేతల హస్తం లేకపోతే అధికారులను దేశాలు ఎందుకు దాటించారని నిలదీశారు.

కోమటిరెడ్డిని విమర్శించే అర్హత రాకేష్‌కు లేదేద

రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే అర్హత బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డికి లేదని సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తమ స్థాయికి తగ్గ వ్యాఖ్యలు చేయాలని హితవు పలికారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు ప్రజలపై ఎంత ప్రేముందో అందరికీ తెలుసని పేర్కొన్నారు. ఉద్యమంలో బీఆర్ఎస్ నేతలు ఉత్తుత్తి రాజీనామాలు చేశారనీ, తెలంగాణ కోసం వెంకటరెడ్డి మాత్రమే తన మంత్రి పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు.

హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని సురేఖ విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో సైతం అతని ప్రవర్తన సరిగాలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఆయన తన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. తెలంగాణ తల్లిని దొరసానిలా తీర్చిదిద్దారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగారు ఆభరణాలు, వడ్డాణాలు పెట్టి కవితలా తెలంగాణ తల్లిని తయారు చేశారని ఆరోపించారు. సబ్బండ వర్గాల ప్రతినిధిగా ప్రజలు కోరుకునే తల్లి తెలంగాణ తల్లినే తాము ప్రతిష్ఠిస్తామని స్పష్టం చేశారు.

రైతు బాగుకే ఫుడ్‌పార్కు

- సత్తుపల్లిలో మినీ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు :ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వ్యవసాయమంత్రితుమ్మల నాగేశ్వరరావు
- క్వాలిటీ బొగ్గుంది- థర్మల్ పవర్ స్టేషన్ కావాలి : సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- బుగ్గపాడు ఫుడ్‌పార్కును ప్రారంభించిన మంత్రులు



నవతెలంగాణ- సత్తుపల్లి

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఏర్పాటు చేసిన మెగా ఫుడ్‌పార్కును అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రైతులను బాగు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లి వచ్చిన ఆయన మండలంలోని బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్కును వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. రాజకీయ, అభివృద్ధి పరంగా ఖమ్మం జిల్లాకు మంచి పేరుందన్నారు. జలగం వెంగళరావు మొదలుకొని తుమ్మల నాగేశ్వర రావు వరకు ఈ జిల్లాను రాష్ట్రంలోనే అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దారని తెలిపారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బుగ్గపాడు ఫుడ్‌పార్కుకు శంకుస్థాపన చేశారన్నారు. అప్పట్లోనే ఫుడ్‌పార్కు కోసం సుమారు రూ.100 కోట్లు కేటాయించి పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఆ తరువాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఫుడ్‌పార్కును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి దయానంద్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో దాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు.

ఔత్సాహిత పారిశ్రామిక వేత్తలను ఫుడ్‌పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానిం చడంతో పాటు మహిళా సాధికారత కోసం మహిళలు కూడా చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వపరంగా ప్రోత్సహించ నున్నట్టు చెప్పారు. ఇందుకోసం వారికి వివిధ రకాల చిన్న, మధ్య తరహా పరిశ్రమలపై 200 మందికి తగ్గకుండా ఔత్సాహిక మహిళలను గుర్తించి వారికి శిక్షణను ఇవ్వనున్నట్టు తెలిపారు. అంతేగాక ప్రతి నియోజకవర్గంలోనూ మినీ ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుందన్నారు. ఇందుకోసం సత్తుపల్లిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు కలెక్టర్‌ను ఆదేశించారు.

రైతుకు ఆదాయం కోసమే ఫుడ్‌పార్కు: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఈ ప్రాంత రైతులకు ఆదాయం తెచ్చి పెట్టడం కోసమే సత్తుపల్లి ప్రాంతంలో ఫుడ్‌పార్కు ఏర్పాటు చేసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఫుడ్‌పార్కుకు ఎక్కువ మొత్తంలో పరిశ్రమల యూనిట్లు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో ఫుడ్ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. తద్వారా ఈ ప్రాంత రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులు, ఇతరత్రా వాటి ద్వారా ఫుడ్‌పార్కును ఉపయోగించుకొని అభివృద్ధి చెందుతారన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ మాట్లాడుతూ ఫుడ్‌పార్కును అభివృద్ధి చేయడంతో పాటు తమ దగ్గర ఉన్న నాణ్యమైన బొగ్గుతో థర్మల్ పవర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని మంత్రులను కోరారు. పవర్ ప్లాంట్ ఏర్పాటు వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. బాలికల కోసం మహిళా డిగ్రీ, పీజీ కళాశాలను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డి, హస్తకళల చైర్మెన్ నాయుడు సత్యనారాయణ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల క్రియాశీలక పాత్ర

- ఆ ఉద్యమాల్లో పాల్గొనని వారే ప్రజలను రెచ్చగొడుతున్నారు : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-కల్చరల్

"దేశ మొదటి స్వాతంత్ర్య పోరాటం నుంచి తదుపరి ఉద్యమం వరకు ముస్లింలు క్రియాశీలక భాగస్వాములయ్యారు.. కానీ నాడు ఉద్యమాల్లో పాల్గొనని వారు నేడు ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ.. దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని కలుషితం చేస్తున్నారు" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సయీద్ షానవాజ్ అహ్మద్ ఖాద్రి రచించిన గ్రంథం పర్వేజ్ అలం సిద్దిక్ ఆంగ్ల అనువాదం "బ్లడ్ స్పీక్స్ టూ.." గ్రంథం ఆవిష్కరణ సభ హైదరాబాద్ రవీంద్ర భారతి ప్రధాన వేదికపై గురువారం జరిగింది. డిప్యూటీ సీఎం పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల త్యాగాలు విస్మరించలేనివన్నారు. ఇంక్విలాబ్ జిందాబాద్, క్విట్ ఇండియా, జైహింద్ వంటి నినాదాలు రూపొందించిన వారు ముస్లిం సోదరులేనని గుర్తు చేశారు. అలాంటి చరిత్రను మరుగుపరచాలని రాజ్యాంగం పట్ల గౌరవం లేని వారు ప్రయత్నిస్తు న్నారని విమర్శించారు. దేశంలో లౌకికవాదాన్ని కాపాడుకుంటూ ప్రేమ భావన పెంచుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పాదయాత్ర చేశారని, ఆయనకు అండగా నిలవాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం వనరులు, రాజకీయ ఆర్థిక అవకాశాలు సమంగా అందించాలని కులగణన చేస్తున్నామని చెప్పారు. అహ్మద్ ఖాద్రి రచించిన గ్రంథం.. దేశంలో ముస్లింల భాగస్వామ్యాన్ని తెలుపుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు చైర్మెన్ హుస్సనీ, గ్రంథాలయ పరిషత్ చైర్మెన్ రియాజ్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మెన్ కొత్వాల్ పాల్గొనగా ఎండీ జావీద్ కార్యక్రమ నిర్వహణ చేశారు.

7న ఆటో, మోటార్ కార్మికుల బంద్

ఆటో కార్మికులంతా జయప్రదం చేయండి : టీయూసీఐ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆటో, మోటార్ కార్మికులు శనివారం తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్ఎల్.పద్మ పిలుపునిచ్చారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమం కోసం వెంటనే సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలనీ, మీటర్ చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేలను వెంటనే ఇవ్వాలని కోరారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉపాధిని కోల్పోతున్న ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆటోమోటార్ రంగ కార్మికులు తమ సమస్యలపై ప్రభుత్వానికి అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. తక్షణమే ఆటో, మోటార్ కార్మికుల సమస్యలపై యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నేడు, రేపు రాష్ట్రంలో దీపాంకర్ భట్టాచార్య పర్యటన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో శుక్ర, శనివారాల్లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పర్యటించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేశ్‌రాజా తెలిపారు. గురువారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే లిబరేషన్ జనసభలోనూ, ప్రజాప్రదర్శన ర్యాలీలోనూ ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. తమ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యులు ఎన్.మూర్తి కూడా సభకు హాజరవుతారని తెలిపారు. ఏడో తేదీన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజాస్వామ్య, వామపక్ష మేధావులు, శ్రేయాభిలాషులతో ఏర్పాటు చేసిన సమావేశంలో దీపాంకర్ భట్టాచార్య పాల్గొంటారని తెలిపారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు : తపస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రాల్లో ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు తలపెట్టిన రిలే నిరసన దీక్షలకు, 9 నుంచి చేపట్టే నిరవధిక సమ్మెకు తాము మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు, నవాత్ సురేశ్ తెలిపారు. గురువారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఏండ్ల తరబడి పనిచేస్తున్న 19,360 మంది ఉద్యోగులకు కనీస వేతనం అమలు కావడం లేదనీ, వారికి ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు వారిని రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

యాజమాన్యం భద్రతకు సంబంధించి ఎలాంటి అదనపు నిబంధనలూ పాటించలేదన్నారు. యాజమాన్యానికి నటీనటుల రాక గురించి సమాచారం ఉన్నప్పటికీ ప్రత్యేక ప్రవేశం లేదా నిష్క్రమణ ఏర్పాట్లు చేయలేదన్నారు. అయినప్పటికీ అల్లు అర్జున్ వ్యక్తిగత భద్రతతో థియేటర్లోకి వచ్చారని.. అప్పటికే అక్కడ గుమిగూడిన ప్రజలందరూ ఒక్కసారిగా అతనితో పాటు లోపలికి వెళ్లడంతో వ్యక్తిగత సిబ్బంది ప్రజలను నెట్టడం ప్రారంభించారన్నారు. దాంతో తీవ్ర తోపులాట జరిగి మహిళ మృతికి కారకులయ్యారన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 105,118(1) రీ/ష 3(5) బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. థియేటర్ లోపల ఒక వ్యక్తి మరణంతోపాటు ఇతరులు గాయపడటానికి దారితీసిన పరిస్థితులకు కారణమైన అందరిపైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

బాలుడి పరిస్థితి విషమం !

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తల్లిని కోల్పోయి, తానూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైన బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలునికి బేగంపేట కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, బాలుని తల్లి రేవతి మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

317 జీవో బాధితులకు న్యాయం చేయండి

ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు టీపీటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ స్థానిక జిల్లాల్లో లోకల్ క్యాడర్ కింద రీ-అలోకేషన్ ఉత్తర్వులు వచ్చే విధంగా కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇటీవల వెలువరించిన 243, 244 జీవోల ద్వారా ఉపాధ్యాయులకు ప్రయోజం కలిగే పరిస్థితులు లేవనీ, స్పౌజ్, మెడికల్, తదితర కేటగిరీల్లో లోకల్ క్యాడర్ మార్పు కోసం వేచి చూస్తున్న ఉపాధ్యాయు లందరికీ బదిలీ అవకాశం కల్పించేలా ప్రభుత్వంతో చర్చించాలని విన్నవించారు.

సొంతింటి కల నెరవేరాలి

(మొదటిపేజీ తరువాయి)

జరగలేదన్నారు. తమ ప్రభుత్వం ఐటీడీఏల పరిధిలోని నియోజకవర్గాలు, ప్రాంతాల్లోని గిరిజనుల కోసం ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుల్లో ప్రత్యేక కోటా ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నల్లమల్లలోని చెంచులు, ఆదిలాబాద్‌లోని గోండులు, భద్రాచలంలోని కోయలు... ఎవరైతే తెలంగాణ మట్టి మనుషులో, తెలంగాణ మూల పురుషులో వారికి ఇందిరమ్మ ఇండ్లను ప్రత్యేకంగా కేటాయిస్తామని భరోసా ఇచ్చారు. ఇంద్రవెల్లికి వెళ్లి తాను స్వయంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాలు అందజేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఈ నమూనానే పాటించాలని తాము సూచించడం లేదన్నారు. అదే సమయంలో తమకున్న స్థలంలో ప్రతి అంగుళాన్ని లబ్ధిదారులు వినియోగించుకునేలా ప్రతి మండల కేంద్రంలో మోడల్ హౌస్‌లు నిర్మిస్తామన్నారు. లబ్ధిదారులు తమ అవగాహన కోసం వాటిని చూడాలని సూచించారు. లబ్ధిదారులు తమ స్థోమతకు తగ్గట్టు అదనపు గదులు నిర్మించుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని సీఎం చెప్పారు.

పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 65 వేల ఇండ్లు మాత్రమే నిర్మించింది

పదేండ్లు (2004 నుంచి 2014 వరకు) అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 25.04 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించిందని తెలిపారు. కొడుకు, కోడలు, అల్లుడు, బిడ్డ వస్తే ఎక్కడ ఉంటారని ఇందిరమ్మ ఇండ్లను ఎన్నికల ప్రచార సభల్లో విమర్శలు గుప్పించిన కేసీఆర్ తన పదేండ్ల పాలనా కాలంలో కేవలం లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లు ప్రారంభించి 65 వేల ఇండ్లు మాత్రమే పూర్తి చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 35 వేల ఇండ్ల పూర్తికి తాము రూ.195 కోట్లు కేటాయించామని తెలిపారు. కేసీఆర్ పదేండ్ల కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదన్నారు. కానీ ఆరు నెలల్లో ఆయన కోసం కోట లాంటి



ప్రగతి భవన్‌ను, వాస్తు కోసం సచివాలయాన్ని నిర్మించుకున్నారన్నారు. గజ్వేల్, జన్వాడల్లో ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ భవనాల కోసం ఎకరాల కొద్ది భూమి కేటాయించుకున్నారని తెలిపారు. కేసీఆర్ తన పదవీ కాలంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. ఆయన చెప్పినట్టు కోడి, మేక ఎక్కడ ఉండాలో చూపలేదన్నారు. కానీ కాలనీకో బెల్టు షాపు పెట్టారని విమర్శించారు. లక్ష్యం ఎంత గొప్పదైనా అమల్లో లోపాలు ఉంటే ప్రభుత్వ విశ్వసనీయత దెబ్బతింటుందని చెప్పారు. పేదలకు అన్యాయం జరుగుతుందనే ఆలోచనతోనే ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను సైతం వినియోగిస్తున్నామని తెలిపారు. పునాది స్థాయి నుంచి స్లాబు స్థాయి వరకు ప్రతి దశలోనూ సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు అందేలా చూస్తామని సీఎం హామీ ఇచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గృహ నిర్మాణ శాఖను పునరుద్ధరించడమే కాకుండా శాఖకు పూర్తి స్థాయి సిబ్బందిని ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం గతంలో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తున్నట్టు సీఎం ప్రకటించారు.

కేసీఆర్ అనుభవాన్ని రాష్ట్రానికి పంచాలి

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో రాష్ట్ర ఖజానాను కేసీఆర్‌కు అప్పగిస్తే... పదేండ్ల పాలనా కాలం తర్వాత ఆయన రూ.7 లక్షల కోట్ల అప్పుతో తమకు అప్పగించారని అన్నారు. కేసీఆర్ పాలనా కాలంలో చేసిన అప్పులు, తప్పులు సరి చేసేందుకు తమకు సమయం పడుతోందన్నారు. సీఎంగా, కేంద్రమంత్రిగా పని చేసిన కేసీఆర్ తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి, ఆయన సీఎంగా ఉన్నప్పుడు ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి నివేదికల రూపంలో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చేవారని గుర్తు చేశారు. నాడు ఆ మంచి సంప్రదాయం ఉందన్నారు. దానిని కొనసాగించాలని సీఎం సూచించారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న హరీశ్‌రావు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారనీ, కాంగ్రెస్‌లో చేరేందుకే హరీశ్‌రావు కలిశారనే విమర్శలు నాడు వచ్చాయని గుర్తు చేశారు. సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం రాజశేఖర్ రెడ్డిని కలిశానని ఆయన వివరణ ఇచ్చారని తెలిపారు. ఇప్పుడు అలానే కలిసి సమస్యలు విన్నవించాలని సూచించారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మంత్రులను కలిసి కొడంగల్ నియోజకవర్గానికి రూ.వందల కోట్లు తీసుకెళ్లానని సీఎం తెలిపారు. పాలక, ప్రతిపక్షాలు కలవకుండా చేసింది కేసీఆరేననీ, శత్రు దేశ సైనికుల్లా రెండు పక్షాలను కేసీఆర్ మార్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేసీఆర్‌లో మానసిక పరివర్తన రావాలని అన్నారు. తమిళనాడులో రాజకీయ వైరుధ్యాలు ఎంతగా ఉన్నా ఆ రాష్ట్ర అంశాల విషయంలో పార్టీలకు అతీతంగా వారంతా ఏకమవుతారని తెలిపారు. ఇక్కడ అలానే కావాలని అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై రాష్ట్రంలో 17 మంది లోక్‌సభ, ఏడుగురు రాజ్యసభ సభ్యులకు సూచనలు ఇచ్చేందుకు కలిసి రావాలని కేసీఆర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు.

నెలకు వడ్డీ రూ. 6,500 కోట్లు చెల్లిస్తున్నాం

కేసీఆర్ పదేండ్ల పాలన కాలంలో చేసిన అప్పులకు రూ.6,500 కోట్లు నెలకు వడ్డీ కడుతున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగుల జీతభత్యాలకు ఎంత ఖర్చవుతుందో కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీ అంత అవుతోందని తెలిపారు. తాము పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత ఆరు నెలలు లోక్‌సభ ఎన్నికల కోడ్‌తోనే సరిపోయిందనీ, కేవలం అయిదు నెలల కాలమే తాము పాలనపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టగలిగామని చెప్పారు. ఈ అయిదు నెలల కాలంలోనే రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామనీ, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చామని సీఎం తెలిపారు. తాము అభివృద్ధి, సంక్షేమం రెండింటి సమతూకం చేసుకుంటూ ముందుకు పోతుంటే చిన్న పిల్లల్లా కేటీఆర్, హరీశ్‌రావు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హోంవర్క్ చేయని పిల్లలు హోం వర్క్ చేసిన పిల్లాడి నోట్సు చింపివేసినట్టు, పక్కన వాడి చేతిలో ఆట బొమ్మలు విరగొట్టే చిన్న పిల్లల్లా హరీశ్‌రావు, కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని సీఎం అన్నారు. మనం చేయలేని పని వాళ్లు చేస్తున్నందున చూస్తూ ఉండాలని వారిద్దరికి హితవు చెప్పాలని కేసీఆర్‌కు సూచించారు. తాము చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకునేందుకు మారీచ సుబాహుల్లా, రాహు కేతువుల్లా వారు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు భేషజాలు లేవనీ, వయసులో, అనుభవంలో కేసీఆర్ పెద్ద వారనీ, ఆయన పెద్దరికాన్ని నిలుపుకోవాలని, తప్పులు చేస్తున్న తమ పిల్లలకు బుద్ధి చెప్పాలని సూచించారు. శాసన సభలో పాలక పక్షానికి ఎంత ప్రాధాన్యత ఉందో, ప్రతిపక్షానికీ అంతే ప్రాధాన్యత ఉందని సీఎం అన్నారు. కేసీఆర్ సభకు వచ్చి తాము పాటించే విధానల్లో ఏవైనా లోపాలుంటే తెలియజేయాలని సీఎం సూచించారు.

తెలంగాణ తల్లి విగ్రహా ఆవిష్కరణకు రండి

సచివాలయంలో డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు ప్రతిపక్ష నేత కేసీఆర్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో పాటు ఎంఐఎం, సీపీఐ, ఇతర ప్రతిపక్ష నేతలను ఆహ్వానిస్తున్నట్టు సీఎం తెలిపారు. కేసీఆర్‌తోపాటు కేంద్ర మంత్రులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా కలిసి ఆహ్వానిస్తారని సీఎం తెలిపారు. ఈ ఉత్సవానికి ప్రతిపక్ష నేత వచ్చి పెద్దరికం నిలుపుకోవాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా 7, 8, 9 తేదీల్లో సచివాలయ ప్రాంగణం నెక్లెస్ రోడ్డు, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో తెలంగాణ సంబరాలు అద్భుతంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. తెలంగాణ సంస్కృతికి పట్టం కట్టే కార్యక్రమాలు, పిండి వంటలు, మహిళా సంఘాల స్టాళ్లతో ఒక పండగ వాతావారణం నెలకొంటుందని చెప్పారు. బోనాలు, వినాయక నిమజ్జనం చేసుకునేప్పుడు ఎలాంటి వాతావరణం ఉంటుందో అలాంటి వాతావరణం ఉంటుందన్నారు. ప్రజలంతా వాటిలో పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, కేశవరావు, షబ్బీర్‌అలీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

-కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కి సీఎం ఆహ్వానం

హామీల అమలులో జాప్యం

- తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ వెంకన్న
- తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ ఆధ్వర్యంలో చలో బస్‌భవన్



నవతెలంగాణ - ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తున్నదని తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ వెంకన్న అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో చలో బస్‌భవన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని సంవత్సరం గడిచిపోతున్నా అమలు చేయలేదన్నారు. విలీనం గురించి గత ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌కు సంబంధించి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింటెడ్ డేట్ ప్రకటించలేకపోయిందని అన్నారు. అలాగే, ట్రేడ్ యూనియన్‌లను పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, దాని వల్ల ప్రభుత్వంపై గానీ, యాజమాన్యంపైగానీ ఎటువంటి ఆర్థిక భారమూ పడదని అన్నారు. 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదైన పోలీస్ కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. పీఎస్-సీసీఎస్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ ట్యాక్స్‌ల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో సిబ్బంది రిక్రూట్‌మెంట్ పూర్తిస్థాయిలో చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులకు కూడా కారుణ్య నియామకాలు, వయోపరిమితిని జీవో ప్రకారం 44 సంవత్సరాలకు పెంచాలని కోరారు. రిటైర్డయిన ఉద్యోగులకు సెటిల్‌మెంట్ వెంటనే ఇవ్వాలన్నారు. వైస్ చైర్మెన్ కమలాకర్‌గౌడ్ మాట్లాడుతూ.. 2017 వేతన సవరణ జరిగిన దానికి అనుబంధంగా ఉన్న అలవెన్స్ పెంచలేదన్నారు. 2013 వేతన సవరణలో జరిగిన అలవెన్స్‌లనే ఇస్తూ శ్రమదోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను తీసేసి నాలుగు కోడ్‌లుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వెంటనే ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్ యాదయ్య, సురేష్ యాదగిరి, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

అమ్మాయిల ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్

- 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కళాశాలలకు శంకుస్థాపన : వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ-జోగిపేట

అమ్మాయిల ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్ తయారు కాబోతున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా అందోల్‌లో 150 పడకల ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, హాస్టల్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. అమ్మాయిలకు చదువు చాలా ముఖ్యమైనదని, మహిళలు విజ్ఞానవంతులైతే సమాజం గుణాత్మక అభివృద్ధి వైపు పురోగమిస్తుందని అన్నారు. చదువుతో పాటు సమాజం, సంస్కృతిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇప్పటికే అమ్మాయిలకు సంబంధించిన అన్నిరకాల విద్యా సంస్థలు ఇక్కడున్నాయని, కొత్తగా నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాంపిటేటివ్ సమాజంలో సక్సెస్ కావాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, నిరంతర కృషి చాలా అవసరమన్నారు. అంతకుముందు తన బర్త్‌డే సందర్భంగా విద్యార్థినుల సమక్షంలో మంత్రి కేక్ కట్ చేశారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులను మంత్రి అభినందించారు. అనంతరం లక్ష్మీదేవి ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దామోదర్ రాజనర్సింహ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ అంజయ్య, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ చైర్మెన్ జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ తప్పులను ప్రశ్నిస్తే కేసులు, ఆ పార్టీ హామీలపై నిలదీస్తే అరెస్టులు చేస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. "పాలనలో లోపాలను గుర్తు చేస్తే కేసులు. గురుకులాల్లో విద్యార్థుల అవస్థలను పరిశీలిస్తే కేసులు. ప్రభుత్వం లాక్కుంటున్న భూములపై ఎదిరిస్తే కేసులు.. ప్రభుత్వం కూల్చుతున్న ఇండ్లకు అడ్డొస్తే కేసులు, ప్రభుత్వంలోని వ్యవస్థలను వాడుకుని దుర్వినియోగం చేస్తున్నారని ఫిర్యాదు చేస్తే కేసులు, కాసులు మీకు - కేసులు మాకు, సూటుకేసులు మీకు - అరెస్టులు మాకు" సర్కార్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

సీఎం వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- సామాజిక బహిష్కరణ పదానికి అర్థం తెలుసా?: కాసం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కులగణనలో పాల్గొనని వాళ్లను సామాజిక బహిష్కరణ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం బాధ్యతారాహిత్యమే అవుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎంకు అసలు సామాజిక బహిష్కరణ అనే పదానికి అర్థం తెలుసా? అని ప్రశ్నించారు. సీఎం తన వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర పేరుతో ఏకం చేస్తానంటే.. రేవంత్‌రెడ్డి సామాజిక బహిష్కరణ అంటున్నారని విమర్శించారు. గుజరాత్, కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని ప్రకటించారు. తెలంగాణ పరువు తీసేలా సీఎం మాట్లాడొద్దని హితవు పలికారు.

రేపు రాష్ట్రానికి నడ్డా

- సరూర్‌నగర్ స్టేడియంలో బీజేపీ సభ : ప్రేమేందర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనా వైఫల్యాలపై 'ఆరు అబద్ధాలు.. 66 మోసాలు' పేరుతో ఈ నెల ఏడో తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో తమ పార్టీ ఆధ్వర్యంలో బహిరంగ సభను నిర్వహిస్తున్నామనీ, దానికి ముఖ్య అతిథిగా తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జేపీ నడ్డా హాజరవుతారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ సభలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు.

ఆ ముగ్గురు చేతుల్లోనే విమానయాన రంగం

కేంద్రం ప్రభుత్వ నియంత్రణ లేదు

- టిక్కెట్టు ధరల తగ్గింపునకు చర్యలేవీ?
- సామాన్యులకు అనుగుణంగా ధరల నియంత్రణ చేయగలరా?
- ప్రయివేట్ కంపెనీలు విమానాలు కొనుగోలు చేయడం ప్రభుత్వ విజయమా?

: రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీసిన సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో విమానయాన రంగం అదానీ, టాటా, ఇండిగో ముగ్గురు చేతుల్లోనే ఉందని సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీం విమర్శించారు. గురువారం రాజ్యసభలో భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లుపై జరిగిన చర్చలో ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బిల్లు పేరునే తాను వ్యతిరేకిస్తున్నానని అన్నారు. భారతదేశం భాషా ప్రయుక్త రాష్ట్రాలతో కూడినదనే విషయాన్ని మరిచిపోవద్దని హితవు



పలికారు. ఈ బిల్లును ఇండియన్ ఎయిర్‌క్రాఫ్ట్ బిల్లుగా మార్చాలని తాను కోరుతున్నానన్నారు. ఈ బిల్లుపై మనం ఎందుకు చర్చిస్తున్నాం? భారత పౌర విమానయాన రంగ సంరక్షకులు ఎవరు? మంత్రా? లేక మంత్రిత్వ శాఖ? అని ప్రశ్నించారు. మంత్రి, మంత్రిత్వ శాఖ సంరక్షకులు కాదని అన్నారు. భారత పౌర విమానయాన రంగంపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఏమీ లేదని అన్నారు. కేవలం టాటా, ఇండిగో, అదానీ ఈ మూడు సంస్థలే మొత్తం విమానయాన రంగాన్ని నియంత్రిస్తున్నాయని పేర్కొన్నారు. దేశంలోని దాదాపు మేజర్ ఎయిర్‌పోర్టులన్నీ అదానీ చేతుల్లోనే ఉన్నాయని, టాటా, ఇండిగోలదే పైచేయి అని అన్నారు. కానీ కేంద్ర మంత్రి మోడీ ప్రభుత్వ హయాంలోనే విమాన ప్రయాణికులు రెట్టింపయ్యారని గొప్పలు చెప్పుకుంటున్నా రన్నారు. విమానచార్జీల ధరల నియంత్రణను మరిచారని అన్నారు. మంత్రి గారూ మీరేమైనా విమాన టిక్కెట్టు ధరలను నియంత్రించగలరా? అని ప్రశ్నించారు. కంపెనీలు టిక్కెట్టు ధర ఎంత చెబితే అంతేనని అన్నారు. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ 356 రిపోర్టు విమాన టిక్కెట్ల ధరలు నియంత్రించాలని, సామాన్యులకు అనుగుణంగా టిక్కెట్ల ధరలు ఉండాలని స్పష్టం చేసిందన్నారు. దేశంలో ఈ డిమాండ్ చాలా సుదీర్ఘంగా ఉందని గుర్తుచేశారు. యువ మంత్రిగా విమాన చార్జీలు రెగ్యులేట్ చేసేందుకు ఒక యంత్రాంగాన్ని తీసుకురాగలరా? అని ప్రశ్నించారు. మీరు తీసుకురాలేరు. ఎందుకంటే డీరెగ్యులేట్ అనేది నయా ఉదారవాద విధానాల ప్రాథమిక మంత్రమని విమర్శించారు. ఇండిగో, టాటా కొత్త విమానాలు కొనుగోలు చేస్తే, దాన్ని ప్రభుత్వ సాధించిన విజయంగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆ రెండు సంస్థలు విమానాలు కొనుగోలు చేస్తే, ప్రభుత్వం బిల్లు ఎందుకు తీసుకొస్తుందని ప్రశ్నించారు.

హెచ్‌సీఐటీఐ ప్రాజెక్టుకు భారీగా నిధులు

- రూ.5942 కోట్లకు పరిపాలనా అనుమతులు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నొవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)(హెచ్-సీఐటీఐ) ప్రాజెక్టులో భాగంగా చేపట్టే రహదారుల విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేసింది. రూ.5,942 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు ఇస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే టెండర్లు పిలిచి పనులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడ్రోజుల కిందట జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్-సిటీలో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తాజాగా ప్రభుత్వం జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో 5 ప్యాకేజీల్లో చేపట్టనున్న పనులకు నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా సికింద్రాబాద్ జోన్‌లోని ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రహదారుల నిర్మాణం కోసం అత్యధికంగా రూ.940 కోట్ల విడుదలకు అనుమతులు ఇచ్చింది. శేరిలింగంపల్లి జోన్‌లో ఖాజాగూడ, ఐఐటీ జంక్షన్, విప్రో జంక్షన్ల అభివద్ధికి రూ. 837 కోట్లు, మియాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి ఆల్విన్ ఎక్స్ రోడ్డు వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్, లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు మూడు వరుసలతో అండర్ పాస్ నిర్మాణానికి రూ.530 కోట్లు విడుదల చేసింది. ఎల్బీనగర్ జోన్‌లో టీకేఆర్ కాలేజీ జంక్షన్ నుంచి మందమల్లమ్మ చౌరస్తా వరకు ఆరు వరుసల ఫ్లైఓవర్ కోసం రూ.416 కోట్లు, ఖైరతాబాద్ జోన్ పరిధిలో రైతిబౌలి నుంచి నానల్‌నగర్ జంక్షన్ వరకు మల్టీ లెవల్ ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.398 కోట్లు విడుదల చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

మత విద్వేష వికృతాన్ని అంతమొందించేది ప్రేమ ఒక్కటే..

పూలదండలా వైవిధ్యాన్ని నెలకొల్పాలి : ప్రొఫెసర్ హరగోపాల్

సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభ గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-ముషీరాబాద్

రాజ్యాంగ పీఠిక ప్రకారం భారత దేశ ఆదర్శం, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్య స్థాపన కోసం పాటుపడాలని, మత విద్వేష వికృతాన్ని అంతమొందించేది ప్రేమ ఒక్కటేనని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం ఈనెల 14న మహబూబ్‌నగర్‌లో నిర్వహించ నున్న తొలి రాష్ట్ర మహాసభ నేపథ్యంలో కవి, రచయిత భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు సంబంధించిన గోడ పత్రికను హరగోపాల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనం ఒకే కొమ్మకు పూసిన పువ్వులం, మనందరం ఒకే తోటకు చెందిన పిట్టలం అన్నట్టుగా.. ఈరోజు ఏకత్వమే ఉండాలంటే భిన్నత్వాన్ని గౌరవించాలని అన్నారు. ఇంద్ర ధనస్సులా.. పూలదండలా వైవిధ్యాన్ని నెలకొల్పాలి.. భారత రాజ్యాంగాన్ని యూనివర్సిటీ స్థాయిలో సిలబస్‌లో పొందు పరచాలని అన్నారు. అందుకోసం ఈ మహాసభ రేపు తీర్మానం చేయబోతుందన్నారు. మత ప్రమేయం లేని రాజ్యం ఉండాలని అంబేద్కర్ నేతృత్వంలోని రాజ్యాంగ నిర్మాతలు భావించారన్నారు. అయితే నేడు లౌకిక ప్రజాస్వామిక విలువలకు గండి కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రజలు సామరస్యంతో జీవిస్తూ లౌకిక ప్రజాస్వామిక సంస్కృతిని నిర్మిస్తుంటే.. మరోవైపు మత రాజకీయవాదులు ప్రజలను మతపరంగా విభజించి సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని అన్నారు.రాజ్యాంగంలోని లౌకిక ప్రజాస్వామిక స్ఫూర్తిని ఎత్తిపట్టే రచయితలు మన సాహిత్యాన్ని, సంస్కృతిని ఆ కోణం నుంచి అధ్యయనం చేసి ప్రచారం చేయడమే లక్ష్యంగా సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభ మహబూబ్ నగర్‌లో జరగనున్నదని తెలిపారు.

ప్రముఖ రచయిత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. వర్తమాన సామాజిక, రాజకీయ సందర్భంలో ద్వేషం, అసహనం ఎంత ప్రమాదమో తెలియజేయాల్సిన అవసరం రచయితలపై ఉంద న్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సమూహ తొలి రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహి, యువ కవి నరేష్ సూఫీ, స్కైబాబా, ప్రొ. మెట్టు రవీందర్, ఆహ్వాన సంఘం సభ్యులు గుడిపల్లి నిరంజన్, ఏకె.ప్రభాకర్, సామిడి జగన్‌రెడ్డి, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి సమ్మె సైరన్

- ప్రభుత్వానికి సమగ్ర శిక్షా ఉద్యోగుల నోటీస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. గురువారం సచివాలయంలో ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి నేతృత్వంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను కలిసి సమ్మె నోటీస్ అందించారు. గతంలో పలు మార్లు సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేకపోవడంతోనే ఈ నెల 10 నుంచి సమ్మె బాటపట్టినట్టు వారు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో హన్మకొండలో జరిగిన సమ్మె శిబిరంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని వారు వాపోయారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పిన సీఎం ఇప్పటి వరకు ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ప్రభుత్వానికి సమ్మెనోటీస్ అందించిన వారిలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్సీ సౌజన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ అనిల్ చారి, కోశాధికారి దుర్గం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆ నలుగురికి అవకాశం

- తొమ్మిదిలోపు క్యాబినెట్ విస్తరణ ?
- హైకమాండ్ గ్రీన్‌సిగ్నల్
- జోరుగా ఆశావహుల ప్రయత్నాలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో త్వరలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్టు తెలిసింది. ఈనెల తొమ్మిది నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అ దిశగా అడుగులేస్తున్నారనే వ్యాఖ్యానాలు ఆపార్టీ సీనియర్ నేతల నుంచి వస్తున్నాయి. అయితే ప్రస్తుతం సర్కారు ఈనెల ఒకటి ఉంచి డిసెంబరు తొమ్మిది వరకు ఏడాదిపాలనపై ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈసందర్భంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు చేస్తున్నారు. సంవత్సరం కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, పథకాల గురంచి ఈ ఉత్సవాల ద్వారా ప్రచారం చేసుకుంటున్న విషయం తెలిసిందే.

ఒకవేళ మంత్రివర్గ విస్తరణకు ప్రజా విజయోత్సవాలు అడ్డంకి కావచ్చనే వాదనలు గాంధీభవన్‌లో వినిపిస్తున్నాయి. ఎలాంటి అవరోధాలు ఉండబోవని అంటున్నవారూ లేకపోలేదు. మరో మూడు రోజుల్లోపు మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు ఏమేరకు ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతున్నది. ఇదిలావుండగా ప్రస్తుతం రాష్ట్రమంత్రివర్గంలో ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కాగా ఇప్పటివరకు ఏఐసీసీ నలుగురికే మంత్రివర్గంలో బెర్తులు ఇచ్చేందుకు అంగీకరించినట్టు తెలిసింది. మరో రెండు స్థానాలను రిజర్వు చేయాలనీ, భవిష్యత్‌లో వీటిని భర్తీచేయాలని సూచించినట్టు సమాచారం. తాజా రాజకీయ సమీకరణల ప్రకారం పలువురు పోటీపడుతున్నారు. ఉమ్మడి జిల్లాల వారీగా పరిశీలించినప్పుడు నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రావు పోటీపడుతున్నారు. షబ్బీర్‌అలీ సైతం మంత్రిపదవిని ఆశిస్తున్నారు. అయితే సుదర్శన్‌రెడ్డికే పదవి ఖాయమనే ప్రచారం ఇప్పటికే ఉంది. అలాగే రంగారెడ్డి జిల్లా నుంచి టి రామ్మోహన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఇందులో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికే ఎక్కువ అవకాశాలు ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్‌కు వచ్చినప్పుడు పోటీ తీవ్రంగా ఉంది. కోదండరామ్‌తోపాటు మెదక్ నుంచి గెలిచిన మైనంపల్లి రోహిత్‌రావు పోటీపడుతున్నట్టు తెలిసింది. హైదరాబాద్ కోటా కింద తనకు అవకాశం ఇవ్వాలని రోహిత్, సీఎం రేవంత్‌తోపాటు ఏఐసీసీ పెద్దలను ఒప్పించే ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకొచ్చినప్పుడు వివేక్ వెంకటస్వామి, ప్రేమ్‌సాగర్‌రావు ఆశిస్తున్నారు. వీరిలో వివేక్‌కు ఇచ్చే పరిస్థితులు ఉన్నాయని కాంగ్రెస్‌వర్గాలు చెబుతున్నాయి.

టీ శాట్‌తో ఉన్నత విద్యామండలి ఎంఓయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విదార్థులకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లో విద్యనందించేందుకు టీ శాట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యలో భావితరాలకు విలువైన విద్యను అందించేందుకు ఈ ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అధునాతనమైన సబ్జెక్టులపై వారికి నైపుణ్యాలను పెంచే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సర్టిఫికేట్, డిప్లొమా, స్పెషలైజేషన్ కోర్సులను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీ శాట్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. వేణుగోపాల్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్లు ప్రొ. ఇటికాల పురుషోత్తం, మహమూద్, కార్యదర్శి ప్రొ. శ్రీరాం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చెత్త రిక్షాలు అందజేత



నవతెలంగాణ-హస్తినాపురం

తడి, పొడి చెత్తను వేరు చేసి జీహెచ్ఎంసీ చెత్త రిక్షాల్లోనే వేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని వార్డు కార్యాలయంలో 6 చెత్త రిక్షాలను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను రోడ్డుపైన వేయడం వలన దుర్గంధం వెదజల్లుతోందని, ఇంకా దోమల బెడద ఎక్కువై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ తడి పొడి చెత్తను వేరు చేసిచెత్త రిక్షాల్లో వేయాలని కోరారు. కాలనీల్లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవాన్ శంకర్, ఎస్ఎఫ్ఏలు మరియు రాజు, చందు, గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు : అమరేందర్ రెడ్డి



నవతెలంగాణ-తుర్కయంజాల్

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు తప్పవని తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో రోడ్లపై వేసిన చెత్తను సిబ్బందితో తొలగింపజేసి, ముగ్గులు వేయించారు. ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా మున్సిపాలిటీ అంతటా తెలంగాణ రైజింగ్ పేరుతో వీధులన్నీ శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఒక సంవత్సరం పరిపాలన పూర్తిచేసుకున్న సందర్భంగా మున్సిపాలిటీలో విజయోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త వాహనంలో వేయాలని కోరారు. ఆయన వెంట ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ హరీశ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని జయకృష్ణ ఎంక్లేవ్ నందు జరుగుతున్న అభివృద్ధి పనులను ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జయకృష్ణ ఎంక్లేవ్ నందు దాదాపు 3000 గజాల స్థలంలో 5కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్విమ్మింగ్ పూల్, షటిల్ కోర్టు, ఇండోర్ జిమ్, ఆఫీస్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

దాదాపు 8 కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయడం జరిగిందని, మొదటి విడతగా 5 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగతిన పనులు పూర్తి వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న బంద్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ- ఎల్బీనగర్

డిసెంబర్ 7న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, ట్రాన్స్ పోర్ట్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాములు మాట్లాడుతూ.. టాక్సీ, క్యాబ్స్, ఆటో, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బంద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు పని లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలో ఇచ్చిన హామీల అమల కోసం తెలంగాణ ఈ బంద్‌ను చేపడుతున్నామని వివరించారు. మహిళకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లందరికీ జీవన ఉపాధి దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.15,000 ఇవ్వాలని, రవాణా రంగం కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వాలి అన్నారు. ఓలా, ఉబర్, రాపిడ్ ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నిషేధించాలన్నారు. గ్రేటర్ హైదరాబాదులో ఆటో మీటర్ చార్జీలు పెంచాలని కోరారు. ఆటోలకు థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు. యాక్సిడెంట్ బీమా రూ.10లక్షలకు పెంచి సాధారణ మరణాలకు కూడా వర్తింపజేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఆటో, క్యాబ్‌లకు పార్కింగ్ స్థలం కల్పించాలని కోరారు. ఓలా, ఉబర్, రాపిడ్‌లను నిషేధించి ప్రభుత్వమే ఒక నూతన యాప్‌ను తీసుకురావాలని కోరారు. ఈ సమ్మెకు డ్రైవర్లందరూ వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, ట్రాన్స్ పోర్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాములు, బి.యాదగిరి, కృష్ణమూర్తి, గోపి, రమేష్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చంపాపేట్

డిసెంబర్ 7న నిర్వహించే ఆటో బంద్ వాల్ పోస్టర్‌ను సీఐటీయూ నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఎం.బాలునాయక్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు అలీ అబ్బాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా ఆటోవాళ్ళ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఈ మధ్యకాలంలో ఆటో కార్మికులకు సరైన ఉపాధి కల్పించకపోవడంతో పలువురు కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో కార్మికుల బోర్డును ఏర్పాటు చేసి ఆ బోర్డు ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములను రక్షించాలని వినతి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 19వ డివిజన్ గాయత్రి హిల్స్ కాలనీకి సంబంధించిన సర్వే నంబర్ 756, 776లో ఉన్న ఓపెన్ స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకులు అక్రమంగా కబ్జా చేసి భవన నిర్మాణాలు చేపడుతున్నారనీ.. ఈ ప్రభుత్వ స్థలాలను బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకోవాలని కోరుతూ గురువారం కమిషనర్ సరస్వతికి బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గతంలో బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ ఉన్న సమయంలో కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే ఆ సమయంలో ఉన్న టౌన్ ప్లానింగ్ అధికారి స్పందించి.. అక్రమ నిర్మాణాలను కూల్చివేసి ఈ స్థలం ప్రభుత్వ స్థలమని, దీనిని ఎవరు ఆక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో ఎవరికి తెలియడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో హైడ్రా సంస్థకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి హిల్స్ కాలనీ నివాసి పవన్, మల్లెల మహేందర్, బీజేవైఎం నాయకులు సతీష్, నంద, ప్రవీణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశం మేరకు బాలాపూర్ మండల జల్‌పల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని జల్‌పల్లి మున్సిపల్ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాంజాల అర్జున్ ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. తర్వాత విద్యార్థులతో పాటు భోజనం చేస్తూ నిత్యం అందించే భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్టోర్ రూములో బియ్యానికి పురుగులు పట్టి ఉందన్నారు. సన్న బియ్యానికి బదులుగా దొడ్డు బియ్యం వండుతున్నారని మండి పడ్డారు. ముప్పై మంది విద్యార్థులు ఇంటి నుండి భోజన బాక్సులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఎందుకిలా చేస్తూన్నారని పాఠశాల సిబ్బందిని విచారించగా.. ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యం ఇలా వస్తున్నాయనీ, మేం ఏం చేయగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్



పార్టీ నాయకులు హిద్రిస్, జాంగిర్, సిద్దు, బి.అరవింద్ కుమార్, వై శ్రీనాథ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీలోని పసుమాముల, కుంట్లూర్, పెద్ద అంబర్‌పేట తదితర గ్రామాల్లోని 1, 3, 4, 5, 6, 8, 9, 12, 19, 20, 21, 22, 23, 24 వార్డుల్లో రూ.15 కోట్ల 4 లక్షల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగల జయశ్రీరాజుతో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సంక్షేమ పథకాలు అందు తాయన్నారు. బలహీన వర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయశేఖర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కౌన్సిల ర్స్ విద్యావతి విజయేందర్ రెడ్డి, జోర్క గీత శ్రీరాములు, ఓరుగంటి సుజాత, దేవుడి గీత, కందాడ అనుపమ సుప్రసేనా రెడ్డి, గ్యారల శ్రీనివాస్ గౌడ్, పసుల రాజేందర్, సిద్దంకి కృష్ణ



అనంతరం ఓ పంక్షన్ హాల్లో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ పెద్ద అంబర్‌పేట పురపాలక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మరిన్ని నిధులతో అభివృద్ధిని వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజా పాలనలో ప్రజలందరికీ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్ జైపాల్ రెడ్డి, కమిషనర్ రవీందర్ రెడ్డి, మహిళా నాయకురాలు ముత్తిడి రమాదేవి, నాయకులు కొండల్, యంజాల సంజీవ, అనుకిరణ్ రెడ్డి, డీఈఈలు, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు



సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి

నవతెలంగాణ - మీర్‌పేట్

కమ్యూనిస్ట్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి అన్నారు. గురువారం బాలాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో నంది హిల్స్‌లో సీపీఐ పార్టీ సభ్యత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం ఎర్రజెండా సరైన బాట ఇస్తుందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితులై ప్రజా సంఘాల నాయకులుగా పార్టీ కార్యకర్తలుగా ఎంతో మంది పని చేస్తున్నారని తెలిపారు. నేడు సోషలిస్టు నిర్మాణమే కర్తవ్యంగా సమ సమాజ స్థాపన కోసం ఎర్రజెండా చేతపట్టి నిస్వార్థంగా జనం కోసం పనిచేస్తున్నటువంటి కార్యకర్తలు పార్టీకి పట్టుకొమ్మలని కొనియాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 ఏండ్లు అయ్యిందని, అప్పటి నుండి కమ్యూనిస్టులు ప్రజల కోసం చిత్తశుద్ధితో నిస్వార్థంగా జీవితాలను త్యాగం చేసి పనిచేస్తున్నారని గుర్తుచేశారు. నూతన సమాజ నిర్మాణం కోసం పోరాడుతున్న పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్క కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వాన్ని పెంచుకోవడంతో పాటు అన్ని ప్రాంతాలకు విస్తరించాలని, మండల నాయకత్వం శాఖలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ సీపీఐ పార్టీ మండల కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్ రెడ్డి, జర్పుల శివనాయక్, జాజాల అంజయ్య, బండ యాదమ్మ యాదవ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు అందజేత

నవతెలంగాణ - చంపాపేట్

చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో 181 మంది మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్టు డైరెక్టర్ జయ సింగ్ థామస్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు సాధికారత కల్పించే లక్ష్యంతో కుట్టుమిషన్ల శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన మరో 140 మంది మహిళలు సర్టిఫికెట్లు, కుట్టు మిషన్లు అందజేసినట్టు తెలిపారు. 2001లో ప్రారంభమైనప్పటి నుండి చైతన్య మహిళా మండలి విద్య, అవగాహన పెంపొందించడం, మానవ అక్రమ రవాణా వ్యతిరేక కార్యక్రమాలు మరియు పిల్లలు, బాలికలు, మహిళలకు పునరుద్ధరణ సేవల ద్వారా మహిళా సాధికారత కోసం అంకితం చేయబడిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రణీత్ యాదవ్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఫిర్దీపూర్ గ్రామానికి చెం దిన తుమ్మల ప్రణీత్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో అబ్దుల్లాపూర్ మెట్ మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు మద్దతు తెలిపి విజయానికి ముందగుడు వేసిన యువతకు కృతజ్ఞతుడై ఉంటానని తెలిపారు.



సబితమ్మకు సైనికుడులా..



అరవింద్ శర్మ

నవతెలంగాణ-దిల్‌సుఖ్‌నగర్

ఆర్కేపురం డివిజన్ అనగానే అరవింద్ శర్మ ఆటోమేటిక్‌గా గుర్తుకువస్తారు. అంతగా అరవింద్ శర్మ ఆర్కేపురం డివిజన్‌తో రాజకీయ జీవితం ముడిపడి ఉంది అంటే అతిశయోక్తికాదు. ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడుగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన అరవింద్ శర్మ...ప్రస్తుతం మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే శక్తి ఆర్కేపురం డివిజన్ కు ఉందంటే అతిశయోక్తి కాదు. దీనికి ప్రధాన కారణం నియోజకవర్గంలో అతిపెద్ద మాస్ ప్రాంతం ఎన్టీఆర్‌నగర్ ఇదే డివిజన్‌లో ఉన్నది. ఓటింగ్ శాతం కూడా అధికంగా నమోదు అయ్యే ఎన్టీఆర్ నగర్ సబితా ఇంద్రారెడ్డి పోటీ చేసిన ప్రతిసారి విజయాన్ని సొంతం చేసుకోవడానికి దోహదం చేస్తుంది. ఈ డివిజన్‌కు చెందిన అరవింద్ శర్మ డివిజన్ అధ్యక్షుడుగా సుదీర్ఘ కాలంగా పని చేశారు. ప్రస్తుతం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. క్లాస్ మాస్ కలయికగా ఉన్న ఆర్ కె పురం డివిజన్ లో అరవింద్ శర్మ బిఆర్ ఎస్ నేతగా అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. 2009 శాసనసభ పునర్విభజనలో భాగంగా నూతనంగా మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటు అయ్యింది. మాజీ మంత్రి స్వర్గీయ తెలంగాణ టైగర్ ఇంద్రారెడ్డి కుటుంబానికి కంచుకోటగా ఉన్న చేవెళ్ల నియోజకవర్గం పునర్విభజనలో ఎస్సీ రిజర్వుడు అయ్యింది. ఈ నేపథ్యంలో ఇంద్రారెడ్డి సతీమణి సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గం నుంచి 2009లో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. అనూహ్య విజయంతో సబితా ఇంద్రారెడ్డి నాటి వైఎస్సార్ ప్రభుత్వంలో దేశంలోనే మొట్టమొదటి హోంశాఖ మహిళా మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టారు. చేవెళ్ల చెల్లెమ్మగా ప్రసిద్ధి చెందిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రస్తుతం మహేశ్వరం నియోజకవర్గం ఇంటింటి ఆడ బిడ్డగా రాజకీయాలకు అతీతంగా ఆదరాభిమానాలు అందుకుంటున్నారు. 2009, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వరుస విజయాలను సొంతం సబితా ఇంద్రారెడ్డి చేసుకున్నారు.

పీవీ నరసింహారావు కూతురు విజయంలో అరవింద్‌ది కీలక పాత్ర...

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీగా పోటీ చేసిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కూతురు వాణి దేవి విజయంలో అరవింద్ శర్మ అత్యంత కీలక పాత్ర పోషించారు. ఆర్కేపురం అలకాపురి ప్రాంతాల్లో అరవింద్ శర్మ సామాజిక వర్గం బలంగా ఉంటుంది. అరవింద్ శర్మ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నియోజకవర్గం పార్టీ ప్రధాన కార్యదర్శిగా సేవలు కొనసాగిస్తున్నారు. డివిజన్‌లో కీలకమైన ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మెన్‌గా కూడా పని చేసిన అరవింద్ శర్మ.. సబితా ఇంద్రారెడ్డికి ఒక సైనికుడులా పని చేస్తున్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ఆర్కేపురం డివిజన్ అభివృద్ధి కోసం పాటు పడుతున్నారు. ఆర్కేపురం డివిజన్‌లో ప్రభుత్వ హాస్పిటల్, బాలాపూర్ ప్రాంతంలో బ్రాహ్మణులకు 15 వందల గజాల స్థలం రావడానికి సబితా ఇంద్రారెడ్డి సహకారంతో అరవింద్ శర్మ కృషి చేశారు. అదే విధంగా నియోజకవర్గంలో కీలకమైన బీఆర్ఎస్ నేతలు తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు జిల్లా పరిషత్ చైర్మెన్ తీగల అనితారెడ్డి మాజీ ఎంపీ రంజీత్ రెడ్డిలు బీఆర్ఎస్‌ను వీడారు. ఈ ముగ్గురు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలో అరవింద్ శర్మపై తీవ్ర ఒత్తిడి వచ్చింది. తమతో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరాలని టీకేఆర్, మాజీ ఎంపీ రంజీత్ రెడ్డిలు అరవింద్ శర్మపై తీవ్ర ఒత్తిడి తెచ్చిన ఆయన పార్టీ మారలేదు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఎన్నో ప్రలోభాలకు ఒత్తిళ్లకు గురి చేసినా అరవింద్ శర్మ సబితా ఇంద్రారెడ్డికి జై కొట్టారు. ఆర్కేపురం డివిజన్‌లో సుమారు 65 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్టీఆర్‌నగర్ వంటి అతి పెద్ద మాస్ ప్రాంతంతో పాటు ఆధునిక కాలనీలు సైతం ఈ డివిజన్‌లో ఉన్నాయి. వాసవి కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ, ఆర్కేపురం, అలకాపురి, చిత్రా లేవుట్ కాలనీలు సైతం ఉన్నాయి. రాజకీయ చైతన్యం అధికంగా ఉండే ఆర్కేపురం డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ పటిష్టంగా ఉండటానికి నిరంతరం అరవింద్ శర్మ కృషి చేస్తున్నారు. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా సబితా ఇంద్రారెడ్డి సహకారంతో పార్టీని సమన్వయం చేస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో నియోజకవర్గంలో నిరసనలు, ఆందోళనల కార్యక్రమాలలో భాగస్వామ్యం అవుతున్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌కు శుభకాంక్షలు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌కి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు విఠల్ నాయక్ మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కాప్రా గాంధీనగర్ వాసులు, కాంగ్రెస్ నాయకులు బస్తీలో శాలువాతో ఘనంగ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాప్రా కాంగ్రెస్ నాయకులు జి.సత్యనారాయణ, టి.శ్రీహరి, హరి, ఆకుల సంతోష్, జి.రాజు, జి.కృష్ణ, విజయ్, గౌతమ్, దశమంత్, కనకరాజ్, బస్తీవాసులు జి.బాలయ్య కె.వెంకట్, ఎన్ శ్రీనివాస్, జి.తదితరులు పాల్గొన్నారు.



భారత జాగృతి నాయకురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న దికొండ కవిత. సమీక్ష తర్వాత ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

గురుకులాల అభివృద్ధికి కృషి



- టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రెష్ యాదవ్

నవతెలంగాణ-ఘట్కేసర్

గురుకులాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. గురువారం ఘట్కేసర్ మున్సిపాలిటీ అంకషాపూర్ ప్రిన్స్‌టన్ లియాన్ గురుకుల పాఠశాలను స్థానిక నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యా అభివృద్ధి కోసం, గురుకులాల అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి సర్కారు చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్మెన్ మల్లి పావని, జంగయ్య యాదవ్, ఘట్కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాల్ యాదవ్, ఘట్కేసర్ మండల్ అధ్యక్షులు కర్రె రాజేష్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ శివ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మచందర్ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ ప్రధా న కార్యదర్శి రామ కృష్ణ, ఘట్కేసర్ మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి వెళ్ళిపోయిన యువకుడు



నవతెలంగాణ-జవహర్ నగర్

ఇంటి నుంచి ఓ యువకుడు వెళ్ళిపోయిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రక్షిత్ అనే యువకుడు స్కూల్ బస్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. వేతనం ఇంట్లో ఇవ్వకుండా, ఫోన్ ఇంట్లోనే ఉంచి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బుధవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో తండ్రి కొప్పుల లోకేష్ పిర్యాదు చేశారు. మ్యాన్ మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. తప్పిపోయిన యువకుని వివరాలు ఎత్తు 5.2 అడుగులు ఉంటాడని, తెలుగు, హిందీ, ఇంగ్లీష్, భాషలు మాట్లాడుతాడని ఆచూకీ తెలిసినవారు జవహర్ నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సేంద్రియ ఎరువులతో భూసారం



- మండల వ్యవసాయ అధికారి రవికుమార్
- ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

నవతెలంగాణ-శామీర్‌పేట్

సేంద్రీయ ఎరువులతో భూసారం పెరుగుతుందని మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్సింలు యాదవ్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏఓ రవి కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఓ రవి కుమార్ మాట్లాడుతూ.. పెరుగుతున్న భూతాపం, వాతావరణ మార్పులకు ప్రస్తుత వ్యవసాయం విధానం ప్రధాన పాత్ర పోషిస్తూందన్నారు. వీటని ఎదుర్కొనే ధీటైన పరిష్కారం స్వదేశీ పరిజ్ఞానంతో, తక్కువ పెట్టుబడితో సేంద్రియ వ్యవసాయం ఒక్కటేనని తెలిపారు. రైతులు కేవలం ఒకే రకమైన పంటలు వేసుకోకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించవచ్చని అన్నారు. నేల సారవంతం తగ్గడానికి గల కారణాలు, నేల ఆరోగ్య పరిరక్షణకు పాటించవలసిన పద్ధతుల గురించి తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటిస్తూ భూసారాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌వో లక్ష్మణ్, ఏఈవో ప్రియాంక, రైతులు సింగిరెడ్డి మల్లారెడ్డి, బుద్ధి ఆంజనేయులు, బాల్ నర్సింహ, వేణుగోపాల్ రావు, సంగిశెట్టి ఆంజనేయులు, లక్ష్మయ్య, కృష్ణ రెడ్డి, సత్యనారాయణ, శశిధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఎన్నికల తీరును పరిశీలించడానికి గురువారం మేడ్చల్‌కు హైదరాబాద్ డివిజన్ సంఘ్ కార్యదర్శి కెవిఆర్ ప్రసాద్ విచ్చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ బ్రాంచ్ కార్యదర్శి తులసి రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-మేడ్చల్

స్తంభాలకి వేలాడుతున్న వైర్లను తొలగించాలి



నవతెలంగాణ-కాప్రా

కాప్రా సర్కిల్ పలు ప్రాంతాల్లో కేబుల్ వైర్లు కోడి కాళ్ళకి వేలాడుతూ.. అవి రోడ్లపైకి రావడం వలన పాదచారులు, వాహనదారులు పలు ప్రమాదాలకు గురి అవుతున్నారు. కావున కేబుల్ యజమానులు కేబుల్స్‌ను రకరకాల హోల్స్‌కి బిగిస్తున్న సందర్భంలో ఇటువంటి ప్రమాదాలు జరుగుతతున్నాయి. దాదాపు 20 ఫీట్లకు పైనే బిగించుకొని ఇటువంటి ప్రమాదాలను నివారించుటకు చర్యలు తీసుకోవాలి. అలా చేయాకుంటే జీహెచ్ఎంసీ నుంచి వారి యొక్క లైసెన్సు క్యాన్సిల్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు. రోడ్లపై స్తంభాలపై దిగువగా జారి ఉన్న వైర్లను ఈరోజు జమ్మిగడ్డ సాకెట్ మెయిన్ రోడ్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శానిటేషన్ సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్‌ఐ అరవింద్ అంజలితో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

10 మంది నకిలీ వైద్యుల పట్టివేత

- కొంపల్లి, దూలపల్లి, బహదూర్ పల్లి ప్రాంతాల్లో టీజీఎంసీ అధికారుల విస్తత తనిఖీలు
- మరో 10 మంది నకిలీ వైద్యులపై త్వరలో కేసు నమోదు
- మరో పది మంది నకిలీ వైద్యులు పరారీ
- అన్నట్టు గానే స్పీడ్ పెంచిన టీజీఎంసీ అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ తనిఖీలతో నకిలీ వైద్యుల గుండెల్లో దడ పుట్టించి జల్లెడ పడుతున్నారు,. ఇంకా రానున్న రోజుల్లో తనిఖీల సంఖ్య పెరుగనుందని టీజీఎంసీ ఎథికల్ చైర్మన్ డా కిరణ్ కుమార్ స్పష్టం చేసారు. కొంపల్లి, దూలపల్లి, బహదూర్ పల్లి ప్రాంతంలో టీజీఎంసీ అధికారులతో పాటు హెల్త్ కేర్ రిఫార్మ్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు డా మురళీ కష్ణ, డా నాగేందర్‌ల బృందం విస్తత తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఎటువంటి విద్యార్హత లేకుండా వైద్యుల వలే చెలామణి అవుతూ ఆశాస్త్రీయంగా వైద్యం అందిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న పది మంది నకిలీ వైద్యులు రాంబాబు, పవన్, సంతోష్ చారి, బాబు, రామానుజం పలువురు కేటుగాళ్లను టీజీఎంసీ బృందం పట్టుకుంది. వీరి వద్ద లభించిన హై డోస్ ఆంటీ బయోటిక్స్, స్టేరోయిడ్స్ లాంటి మందులతో పాటు తగు ఆధారాలు టీజీఎంసీ అధికారులు సేకరించారు. తనిఖీల సమాచారం తెలుసుకున్న మరో పది మంది వారి సెంటర్‌లకి తాళాలు వేసుకొని పరారైనట్టు తెలిపారు. వీరిపైన ఎన్‌ఎంసీ చట్టం 34,54 ప్రకారం కేసు నమోదు చేయనున్నామని, ఇంకో వారం రోజులు తనిఖీ బృందాలు హైదరాబాద్‌లోనే ఉండి తనిఖీల సంఖ్య పెంచానున్నామని తెలిపారు. ప్రజలు నకిలీ వైద్యుల వద్దకు వెళ్లి మోసపోవద్దని వారికి ఎటువంటి విద్యార్హత లేకుండా అనవసరంగా ఇచ్చే మందుల వలన లేని సమస్యలు వస్తాయని చెప్పారు. దగ్గర లోని గవర్నమెంట్ లేదా క్వాలిఫైడ్ వైద్యుల వద్ద నాణ్యమైన చికిత్స తీసుకోవాలని తెలంగాణ వైద్య మండలి కో ఆప్ట్ సభ్యులు డా చకిలం ఫణికుమార్ సూచించారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో బొక్క సంజీవరెడ్డి ఘనవిజయం



నవతెలంగాణ-ఘట్కేసర్

యూత్ కాంగ్రెస్‌కు చేసిన సేవలే నన్ను రెండోసారి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా గెలిపించాయని బొక్క సంజీవ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికలలో భాగంగా ఘట్కేసర్ మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ఎన్నిక ల్లో రెండోసారి బొక్క సంజీవరెడ్డి ఘన విజయం సాధించారు. గత రెండు నెలల ముందు జరిగిన యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఘట్కేసర్ మున్సిప ల్‌లో ముగ్గురు వ్యక్తులు పోటీలో నిలువగా బుధవా రం సాయంత్రం ఫలితాలు వెల్లడించారు. ఈ ఫలితాల్లో బొక్క సంజీవరెడ్డి అధ్యక్షులుగా గెలుపొందారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతా నికి ఎన్నో విధాలుగా కృషి చేస్తూ గతంలో పార్టీ అధికారంలో లేకున్నా యువజన కాంగ్రెస్ అధ్యక్షు నిగా ఉంటూ పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొని యూత్ కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు పార్ల మెంటు ఎన్నికల అభ్యర్థుల విజయానికి కృషి చేశా నని, యువజన కాంగ్రెస్ ఎన్నికలకు నాకు అం దించిన మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోట కూర వజ్రెష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపేది సుధీర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు మహేష్ గౌడ్, మున్సిపల్ చైర్మెన్ పావని , జంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు ముత్యాలు యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంచేందర్ రెడ్డి కౌన్సిలర్లు, ముఖ్యం నాయకులకి వారితో పాటు ముఖ్యంగా యువజన కాంగ్రెస్ నాయకులకు యువకులకు మిత్రులకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వికలాంగుల పెన్షన్ పెంపు హామీని అమలు చేయాలి

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్
- డిసెంబర్ 10న ఛలో హైదరాబాద్ వికలాంగుల మహాధర్నా



నవతెలంగాణ-కాప్రా

వికలాంగుల పెన్షన్ రూ. 6000లకు పెంచాలని, అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, డిసెంబర్ 10న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద వికలాంగుల మహాధర్నా నిర్వహిస్తున్నామని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భాస్కర్ రావు భవన్ కమలా నగర్ కార్యాలయంలో ఛలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్ ఉపాధ్యక్షులు గుడ్డి బాలయ్యలతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అవుతున్న వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. పెన్షన్ పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో కాలయాపన చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పెన్షన్ పెంపు నిర్ణయం కోసం 44.44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు ఎదురుచూస్తున్న ప్రభుత్వానికి కన్పించడం లేదని ప్రశ్నించారు. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, వికలాంగుల చట్టాల అమలు వంటి వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సమావేశాలలోపు పెన్షన్ పెంపుపై ప్రభుత్వం ప్రకటన చేయాలని ఉద్ఘటించారు. విద్యా, ఉద్యోగాల్లో వికలాంగులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని వెల్లడించారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెన్షన్ పెంపు కోసం డిసెంబర్ 10న జరిగే ఛలో హైదరాబాద్ ధర్నాకు మేడ్చల్ జిల్లా నుండి వికలాంగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పారిశ్రామిక వ్యర్థాలు పారబోత.. పోలాలు కలుషితం

- పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామంలో ఉన్న తునవ్ ఫుడ్ కంపనీ నిర్వాహకులు యథేచ్ఛగా పారిశ్రామిక వ్యర్థ జలాలు కంపెనీ ఆవరణలో పారబోయడంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని పలువురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలను కొంత మొత్తంలో ప్రయివేట్ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్వాహకుల ద్వారా బయటకు తరలిస్తున్నప్పటికీ కొంత మొత్తంలో కంపెనీ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో వదులుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ పారిశ్రామిక వ్యర్థ జలాల పారబోత వల్ల చుట్టుపక్కల ఉన్న రైతుల పొలాలు కలుషితమై వారికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. కంపెనీ నిర్వాహకులు ఏదేచ్ఛగా కలుషితమైన నీరు పారబోయడంతో పశువులకు, మనుషులకు ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తక్షణమే పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గురువారం తుంకుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు అధ్యక్షతన సీఎం కప్-2024 సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ స్థాయిలో ఈ నెల 10 నుంచి 12 వరకు హకీంపేట్‌లోని స్పోర్ట్స్ స్కూల్ ప్రాంగణములో సీఎం కప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం కప్ అథ్లెటిక్స్, ఫుట్ బాల్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో, యోగ క్రీడా పోటీలు జరుగుతాయని ఆసక్తి గల క్రీడాకారులు ఆన్లైన్ లో www.cmcup2024.telangana.gov.in వెబ్సైట్‌లో పేరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. నవతెలంగాణ-శామీర్‌పేట్



రేవతి కుటుంబానికి రూ. 2 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలి

- టికెట్ రేట్లు పెంచి సినిమా అభిమానులను రోడ్ల పాలు చేస్తున్నారు
- ఏఐవైఎఫ్ టీ.సత్య ప్రసాద్



నవతెలంగాణ-కాప్రా

పుష్ప 2 ప్రీమియర్ షో ప్రదర్శన సందర్భంగా అల్లు అర్జున్ బాధ్యత రహిత్యంగా వ్యవహరించడం వలన ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య సినిమా థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ, ఆమె కుమారుడు ప్రాణాలు కోల్పోయారు. రేవతి, ఆమె కుమారుడు మృతికి కారణమైన అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి టీ.సత్య ప్రసాద్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టీ.సత్య ప్రసాద్ మాట్లాడుతూ.. అల్లు అర్జున్‌పై అభిమానంతో థియేటర్‌కి వచ్చిన ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయారని, భారీ స్థాయిలో అభిమానులు ప్రీమియర్ షోకు వచ్చి నప్పుడు బాధ్యతగా వ్యవహరించాల్సిన అల్లుఅర్జున్, మూవీ టీమ్, సదరు సంధ్య థియేటర్ యాజమాన్యం దానికి భిన్నంగా వ్యవహరించి షోకి రావడం వలన తొక్కిసలాట జరిగి రెండు నిండు ప్రాణాలు పోవడమే కాకుండా అనేకమంది హాస్పిటల్ పాలయ్యారన్నారు. ప్రభుత్వం విచ్చలవిడిగా దండు కోవడం కోసం సినిమా టికెట్ల రేట్లను 3వేలకు పైగా పెంచి పేద మధ్యత రగతికి చెందిన సినిమా అభిమానులను రోడ్ల పాలు చేస్తున్నారని ధ్వజమె త్తారు. భారీ స్థాయిలో అంచనాలు ఏర్పాటు చేసి సినిమా మీద పెట్టిన పెట్టుబ డులను సొమ్ము చేసుకోవడం కోసం, భారీగా లాభాలను ఆర్జించి జనం సొమ్ము ను దండుకోవడం కోసం విపరీతమైన ఆసక్తి చొప్పించారన్నారు. అలా చేయ డం మూలన అభిమానుల భారీ స్పందనతో తొక్కిసలాట చోటు చేసుకుందని, సినిమాలకు వినోదం కోసం వచ్చే అభిమానులకు విషాదాలను మిగిల్చే విధంగా చేస్తున్నారన్నారు. నిత్యం విద్యారంగ సమస్యలపై, ప్రజా సమస్యలపై నిరసన, ఆందోళన కార్యక్రమాలకు ఆంక్షలు, ఆటంకాలు విధిస్తున్న ప్రభుత్వం నేడు అల్లు అర్జున్‌కు ఎలా అనుమతి ఇస్తారని ప్రశ్నించారు. జనం గుమి కూడుతే లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని చెప్తారు. నిన్న అల్లు అర్జున్ అర్ధ రాత్రి తన వ్యక్తిగత లాభం కోసం వస్తే బందోబస్తుతో ఎలా స్వాగతం పలు కుతారో చెప్పాలన్నారు. సామాన్య ప్రజలను దోపిడీ చేయడం కోసం దోపి డీదారులు సినిమాలు తీయడం దానికి ప్రభుత్వం ప్రత్యేకమైన జీవోలు తీసుకొచ్చి టికెట్ల రేట్లు పెంచడానికి అవకాశం ఇవ్వడం వెనకాల ఉన్న అంత ర్యం ఏంటన్నారు. వీరి కుట్రబుద్ధులను ప్రజలు, విద్యార్థులు, యువతి, యువ కులు అర్థం చేసుకోవాలన్నారు. రేవతి ఆమె కుమారుడి మృతికి కారణమైన అల్లు అర్జున్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పుష్ప 2 సినిమా ప్రదర్శనను నిలిపివేయాలని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి కృషి



- కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్
- వీఎన్ రెడ్డి నగర్‌లోని కాలనిలో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-చర్లపల్లి

మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిదిలోని వీఎన్ రెడ్డి నగర్‌లోని కాలనిలో డిసెల్టింగ్ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప కాలనీవాసులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ అభివృద్ధికి కృషి...



కుషాయిగూడ అభివృద్ధికి కృషి చేస్తానన్న కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ అన్నారు. గురువారం చర్లపల్లి డివిజన్ పరిదిలోని కుషాయిగూడ మెయిన్‌రోడ్‌లో పెండింగ్‌లో ఉన్న సెవరేజ్ వర్క్స్ సీసీ రోడ్ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. త్వరలోనే కుషాయిగూడకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ బాలకృష్ణ, ఏఈ స్వరూప, సందీప్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, కుషాయిగూడ కాలనీవాసులు బత్తుల శ్రీకాంత్ యాదవ్, గద్దాల కార్తీక్, గద్దాల క్రాంతి, పండాల గణేష్ గౌడ్, రాజుగౌడ్, వెంకటేశ్వర్లు, నందు, నిఖిల్, అరుణ్, సోను, శ్రీను, శంకర్ గౌడ్, రాజేష్, కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్, హీరాలాల్ నాయక్, శిరీష, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా బర్లపాటి అరవింద్



నవతెలంగాణ-కీసర

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా కీసర మండలం చీర్యాల గ్రామానికి చెందిన బర్లపాటి అరవింద్ విజయం సాధించారు. ఈ సందర్భంగా బర్లపాటి అరవింద్, మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా ఓట్లు వేసి నన్ను గెలిపించిన కాంగ్రెస్ పార్టీ యువ నాయకులకు, మద్దతు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గం ప్రెసిడెంట్ తోటకూర రాహుల్ యాదవ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రెసిడెంట్ బొమ్మక అజయ్, రాష్ట్ర యువ ప్రెసిడెంట్ జక్కిడి శివ చరణ్ రెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు

- మేడ్చల్ ఏఎంసీ చైర్మెన్ నర్సింలు యాదవ్, గ్రంథాలయ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-శామీర్‌పేట

గ్రంథాలయాలు జ్ఞాన బాండాగారాలు అని మేడ్చల్ గ్రంథాలయ చైర్మెన్ బోంగునూరి శ్రీనివాస్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్‌లు అన్నారు. గురువారం ఇరువురు శామీర్‌పేట మండలం ఆలియబాద్ గ్రామంలోని నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ గౌరి కుమారి వెంకటెష్, నాయకులు బండి రాంరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ



- పీవీఎం శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో పూజ
- ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-జవహర్‌నగర్

ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని, అయ్యప్ప స్వామి ఆశీస్సులు జవహర్ నగర్ ప్రజలపై ఉండాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. గురువారం జవహర్ నగర్ పరిధిలోని మల్కారంలో గురు స్వామి పీవీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కేరళ అయ్యప్ప ఆలయం ప్రధాన అర్చకులు శంకరన్ నంబూద్రి, స్థానిక గురుస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌లతో కలసి పాల్గొని ఇరువురు ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల అష్టోత్తర శతనామావళితో ప్రత్యేకమైన మండపం ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా రంగురంగుల పూలతో శ్రీ విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అయ్యప్ప చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 18 కళశాలతో అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వామి పల్లకి సేవను, అమ్మవారి దేవాలయం నుండి మండపం వరకు ఊరేగింపుగా కన్నె స్వాముల పెట్టైతుల్లి ఆట పాటలతో స్వామి వారి విగ్రహాన్ని ఊరేగింపుగా పడిపూజ మండపానికి తీసుకువచ్చారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, అళగిరి సుబ్రహ్మణ్యం, జమాల్పూర్ నవీన్ కుమార్, జిట్టా శ్రీనివాస్ రెడ్డి, ఆలూరి రాజశేఖర్, బండక్రింది ప్రసాద్ గౌడ్, పలువురు గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని యూత్ కాంగ్రెస్ నాయకులు దూసకంటి కళ్యాణ్ తండ్రి మరణించడంతో.. 10వ రోజు వర్ధంతి కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దుసకంటి వెంకటేష్, రవి, గిరి పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

యువజన ఎన్నికల్లో గెలుపొందిన వారికి సన్మానం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో గెలుపొందిన వారిని కూకట్‌పల్లి నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండీ. సలీం, మేడ్చల్ జిల్లా యువజన వైస్ ప్రెసిడెంట్‌గా ఆరిఫ్, మేడ్చల్ జిల్లా సెక్రెటరీగా కృష్ణలను ఆయన శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ బాల్ మంచ్ స్టేట్ కో ఆర్డినేటర్ జిట్టా సునీల్ యాదవ్, 115 డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ రాజ్ పుత్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొయిజ్, చంద్రశేఖర్, రావూఫ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మూడో మహాసభలు విజయవంతం చేయాలి



● సీపీఐ(ఎం) కూకట్‌పల్లి మండల నాయకులు కే.కృష్ణ నాయక్

నవతెలంగాణ-దుండిగల్/కేపీహెచ్‌బీ

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ.. కూకట్‌పల్లి మండలం కేపీహెచ్‌బీ కాలనీ రమ్య సెంటర్ వద్ద కూకట్ పల్లి మండల నాయకులు కే.కృష్ణ నాయక్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. డిసెంబర్ 7,8 తేదీలలో నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో జిల్లా మహాసభ రెండు రోజులు జరగనున్నాయన్నారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. 7న జరగబోయే ర్యాలీలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయ ప్రదం చేయాలని ఆయన కోరారు. గతంలో జరిగిన కార్యక్రమాలు భవిష్యత్ పోరాటాలు నిర్ణయించుకోవడం, చర్చించడం జరుగుతుందన్నారు. మహాసభ విజయవంతం కోసం సీపీఐ(ఎం) పార్టీ శ్రేణులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ కుమార్, చిరంజీవి, గోపాలు, మంగ్యా, కృష్ణ , బాలు, భాష, గోబ్రియా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు
సంపూర్ణ మద్దతు ప్రకటించిన టీయూటీఎఫ్



రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి) రాష్ట్ర అధ్యక్షులు | లచ్చుమల్ల వెంకన్న (యల్. వి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నవతెలంగాన-సిటీబ్యూరో

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామినేనీ వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న తెలిపారు. ఏండ్లుగా దాదాపు 20 వేల మంది వివిధ హెూదాలలో తక్కువ జీతంతో ఉద్యోగాలను వెళ్లదీస్తున్నారని తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఈ నెల 6,7 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన నిరసన దీక్షలకు, 9వ తారీఖు నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేకుండా, కనీసం పనికి తగ్గ వేతనం లేకుండా వెట్టి చాకిరి చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. ఉద్యోగ సంక్షేమం దృష్ట్యా ఎన్నికల సమయంలో గౌరవ సీఎం ఇచ్చిన హామీ మేరకు వారికి కనీస వేతనంతో ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రీమియర్ సోలార్ ఎక్స్‌పో అవార్డుల వేడుక

నవతెలంగాన-సిటీబ్యూరో



నగరంలోని ప్రీమియర్ సోలార్ ఎక్స్‌పో, అవార్డుల వేడుక, సదస్సు, సూర్యకాన్ హైదరాబాద్-2024, మైండ్‌స్పేస్‌లోని హెూటల్ ది వెస్టిన్‌లో జరిగింది. సౌర శక్తి రంగంలో అత్యంత పురాతన మీడియా నెట్‌వర్క్ ఈక్యు మ్యాగజైన్ నిర్వహించిన ఈ కార్యక్రమం డీకార్బనైజేషన్, కార్బన్ న్యూట్రాలిటీ, పర్యావరణ స్థిరత్వంలో పురోగతిని ప్రదర్శించింది. ఈ సమావేశంలో మాజీ ఎంపీ, ఇండియన్ సోలార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సి.నరసింహన్ సహా ఆదాయపు పన్ను అదనపు కమిషనర్, హైదరాబాద్, ఎస్.బి.యాదగిరి, ఐఆర్ఎస్, తదితరులు హాజరయ్యారు. సోలార్ ఎనర్జీ డెవలప్‌మెంట్, ఈ రంగానికి మద్దతుగా రూపొందించిన ప్రభుత్వ కార్యక్రమాలపై కీలక చర్చలు నిర్వహించారు. సౌర విద్యుత్ పరిశ్రమలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులను సైతం అందజేశారు. భారతీయ సోలార్ మాడ్యూల్ తయారీలో అగ్రగామిగా సోవా సోలార్ ప్రశంసలు పొందగా.. అగ్రశ్రేణి ఇన్వర్టర్ బ్రాండ్‌గా సోలిస్ అవార్డును అందుకుంది. ఇతర విజేతలలో సోలార్ మాడ్యూల్ కంపెనీగా యుటిలిటీ స్కేల్ (డొమెస్టిక్ మ్యానుఫ్యాక్చరర్) విభాగంలో ఈసిఈ (ఇండియా) ఎనర్జీస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవేటివ్ సర్వీస్ సొల్యూషన్స్ లీడర్‌గా, ఎస్ఎంఏ సోలార్ తదితర సంస్థలు అవార్డులు అందుకున్నాయి. పునరుత్పాదక ఇంధన రంగానికి అందించిన సేవలకు గానూ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ అవార్డును సి.నరసింహన్ అందుకున్నారు.

ఈ సందర్భంగా, నరసింహన్ మాట్లాడుతూ 2030 నాటికి 500 గిగావాట్ల సౌర విద్యుత్‌ని సాధించాలనే ప్రధాన మంత్రి ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నొక్కి చెప్పారు. పునరుత్పాదక ఇంధనాన్ని స్వీకరించడానికి రెండు తెలుగు రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకుని కొత్త సౌరశక్తి విధానాలను ఆయన ప్రవేశపెట్టారు. సౌరశక్తి ఆర్థిక ప్రయోజనాలను గురించి ఎస్.బి.యాదగిరి వెల్లడించారు.

కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు



● మేడ్చల్ జిల్లా కన్వీనర్ గొట్టే సురేష్

నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని మేడ్చల్ జిల్లా కన్వీనర్ గొట్టే సురేష్ అన్నారు. డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా. విశారదన్ ఆదేశాల మేరకు.. 4వ రోజు కొనసాగు తున్న రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గొట్టే సురేష్ మాట్లాడుతూ నవంబర్18న మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు రాష్ట్రంలో నిరుపేదలకు ఉచితంగా విద్య, వైద్యం, ఉపాధి, అర్హులైన పేదలకు భూమి, నిరుపేద ప్రజలకు అన్ని వసతులతో కూడిన ఇండ్లు ప్రజలందరికీ అందించే భాధ్యత ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ధర్మ సమాజ్ పార్టీ పెట్టిన ఈ 5 డిమాండ్లు సామాన్య ప్రజలకు అందిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్థిక అసమానతలు తొలగి నూటికి 90 శాతం ప్రజలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా బలపడతారని తెలుపుతూ తెలంగాణా ప్రభుత్వానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేకపోవడంతో డిసెంబర్ 2 నుండి 5 వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని లేని పక్షంలో ఆమరణ దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కమిటీ సభ్యులు శివ కుమార్, కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే గుండేటి నర్సింగ్ రావు (చిట్టి), కూకట్ పల్లి మండల కన్వీనర్ పరశురామ్, శ్రీధర్, సీహెచ్ మల్లేష్, శ్రీరాముల తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి మహా పడి పూజ



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ సరేగూడెంలో కొత్తగూడెం శ్రీశైలం గాగిల్లాపూర్‌లోని తత్వమసి సన్నిధానం వారు ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహెూత్సవ కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేష్ ఫంక్షన్ హాల్‌లో చిట్యాల్ నివాసులు దప్పు భుజంగం కుమరుని వివాహ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, రాము గౌడ్, సాయి యాదవ్, స్థానిక నాయకులు, గురు స్వాములు, అయ్యప్ప స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు బండి పరామర్శ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన కూకట్‌పల్లిలోని రాందేవ్ రావ్ ఆస్పత్రిలో చికిత్స పోందు తున్నా.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బాబ్జీ రావును గురువారం కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పరా మర్శించారు. అనంతరం బాబ్జి ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి సీఈవో యోబును వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాపాయస్థితి లేదని బాబ్జి కోలుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపారు. అనం తరం ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలు సుకున్నారు. తమ ఆస్పత్రిలో అన్ని వైద్య విభాగాల్లో అతి తక్కువ ఖర్చుకే వైద్య సేవలు అందిస్తున్నట్టు ఈ సందర్భం గా యోబు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వ రరావు, శివ చౌదరి, బచ్చు మళ్ళీ, రమణ, మధు, నలిని కాంత్, సంధ్య పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే సమాజ సేవకులను
గౌరవించడం అలవర్చుకోవాలి



● కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

విద్యార్థి దశలోనే సమాజ సేవకులను గౌరవించడం అలవర్చుకోవాలని హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు వద్ద ఉన్న చైతన్య టెక్నో స్కూల్ లో 'సమాజ సేవకులను సన్మానించే' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమాజ సేవకులను శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇదే మంచి సమయం అన్నారు. ఇలాంటి కార్యక్రమం మా విద్యార్థి దశలోనే చూశామన్నారు. నేటి విద్యార్థులకు అవగాహన కల్పించి, వారి సేవలు అందించే సామర్థ్యం కలిగిన వారిగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌కు తోటి సిబ్బందికి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగరాయ ప్రసాద్, చైతన్య స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో ప్రతి ఒక్కరికీ సహాయం చేసే
గొప్ప నాయకుడు ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కష్టకాలంలో ప్రతి ఒక్కరికి సహాయం చేసే గొప్ప నాయకుడు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్నారు. చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో 125- గాజుల రామారం డివిజన్ సుభాష్ చంద్ర బోస్ నగర్‌కు చెందిన మహ్మద్ గౌసుద్దీన్ తండ్రి మహ్మద్ శంశుద్దీన్ రూ.1,00,000, 128 - చింతల్ డివిజన్ భగత్ సింగ్ చెందిన జి.అశోక్ కేరాఫ్ జి.విజయ్ కుమార్ రూ .1,15,000 ల ఆరోగ్య పరిస్థితి బాగోలేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా.. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు చేయించిన రూ .2 లక్షల 15 వేలు విలువగల రెండు ఎల్ఓసీ చెక్కులను స్థానిక బీఆర్ఎస్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్ , మక్సూద్ అలీ, బాధిత లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాలనీవాసుల ఆరోగ్య పరిస్థితిపై మా నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తే వెంటనే స్పందించే గొప్ప మనసున్న నాయకులు మా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ఇర్ఫాన్, శౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలను సందర్శించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని సుభాష్ నగర్ 130 డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానికి ముందే మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి భక్తి శ్రద్ధలతో స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు జరిపించి మొక్కు తీర్చుకున్నారు.డివిజన్ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆ ఏడుకొండల స్వామిని వేడుకున్నట్లు కార్పొరేటర్ తెలిపారు.

7న బంద్‌ను జయప్రదం చేయండి



నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ ఏఐటీయూసీ, సీఐటీయూ వామ పక్షాల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో.. సీపీఐ ఆఫీస్ కార్యాలయంలో డిసెంబర్ 7వ తేదిన ఆటో, టాక్సీ, వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్ర వ్యాప్త బంద్‌ని జయప్రదం చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్‌లు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన మహాలక్ష్మి పథకం ఫ్రీ బస్‌తో నష్టపోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని అన్నారు. ఆటో, క్యాబ్ డ్రైవర్‌లకు సంవత్సరానికి రూ.15 వేలు ఇవ్వాలని తెలిపారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దావీద్, చారి, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నాయకులు.. మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని గురువారం కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన నల్ల అరుణ్ కుమార్ గౌడ్, 125 డివిజన్ గాజులరామరం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ షేక్ సల్మాన్‌లకు కూన శ్రీశైలం గౌడ్ శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోనసీరసం గౌడ్ మాట్లా డుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యకర్తల సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఇతర పార్టీలకు దీటుగా కాంగ్రెస్ కంచుకోటగా తీర్చిదిద్దుతామ ని చెప్పారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలన ఉన్నందున కార్యకర్తలు విభేదాలకు వెళ్లకుండా పార్టీని తీర్చిదిద్దాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు ప్రభుత్వం నుంచి మంచి గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూన రాఘవేంద్ర గౌడ్, బిల్లా వెంకట్, వేణు చింటూ, కార్తీక్ , అవినాష్ మాథ్యూస్ , భాను, మహేష్, జ్ఞానేశ్వర్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకోం



● కార్మిక నాయకుడు రవి సింగ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ అన్నారు. మేడ్చల్ మండలంలోని బిగ్ బాస్కెట్ కండ్లకోయ ఏరియాలో డీసీఎం ఓనర్ దశరథ్ రెడ్డి దగ్గర డ్రైవర్‌గా బాబా ఖాన్ గత కొన్ని సంవత్సరాలుగా పని పనిచేస్తున్నాడు. డీసీఎం ఓనర్ కావాలనే ఏ కారణం లేకుండా డ్రైవర్ బాబా ఖాన్‌ని పని నుంచి తీసివేయడం జరిగింది. డీసీఎం యజమాని, డ్రైవర్‌కి ఇవ్వాల్సిన ఒక నెల జీతం ఇవ్వకుండా దుర్భాషలాడుతూ ..ఇబ్బంది పెట్టాడు. అతనికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ల ద్వారా తెలుసుకొని.. బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ని కలిశాడు. తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పుకున్నాడు. వెంటనే స్పందించిన రవిసింగ్ హుటాహుటిన డీసీఎం ఓనర్ దశరథ్ రెడ్డి దగ్గరికి వెళ్లి.. డ్రైవర్‌కు రావలసిన వేతనం గురించి మాట్లాడి.. డ్రైవర్‌కి అక్టోబర్ ఒక నెల వేతనం రూ.22,000 వేలు ఇప్పించాడు. డ్రైవర్ ఎం.డి బాబా ఖాన్, తనకు న్యాయం చేసిన రవిసింగ్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ కూలిన ప్రాంతం పరిశీలన



● కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

నవతెలంగాణ-బాలానగర్

నాలపై ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ కూలిన ప్రాంతాన్ని సర్కిల్ అధికారులు పరిశీలిచారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతం నగర్, నాగార్జున కాలనీ, అక్షయ ఎన్‌క్లేవ్ పరిధిలో అను సంధానంగా నిర్మించి, నాలాపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై ఆకస్మాత్తుగా నాల ఫెన్సింగ్ పడిపోవడంతో.. స్థానికులు కార్పొరేటర్ సతీష్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న వెంటనే కార్పొరేటర్, డీఈ.శంకర్, ఏఈ.రంజిత్‌తో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. కూలిన సెన్సింగ్‌ను పరిశీలించారు. నాలా ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ ఏర్పాటు విషయంపై అధికారులతో చర్చించారు. సర్కిల్ అధికారులు కెమికల్ వల్ల స్టీల్ రస్ట్ వచ్చి పాడైపోయిన కారణంగా.. ఫెన్సింగ్ పడిపోయి ఉంటుందని నిర్ధారణకు వచ్చారు. వెంటనే నూతనంగా ఫెన్సింగ్ నిర్మాణానికి అంచనాలు తయారు చేసి, అతి త్వరలో పనులు ప్రారంభం అయ్యేలా చూస్తామని అధికారులు అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంచి బిక్షపతి, సీనియర్ నేత కన్నయ్య, శశి,సలావుద్దీన్, బస్వరాజు, శేఖర్, సాయినాథ్ గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | డిసెంబర్ 06, 2024 | www.navatelangana.com

మియా బస్తీలో పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ 7వ వార్డు లాలా మియా బస్తీ వాసుల నీటి సమస్య తీర్చడం కోసం ఎమ్మెల్యే శ్రీ గణేష్ గురువారం నూతన బోరింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడి మంచినీటి సమస్య గురించి గతంలో ఆయన దృష్టికి స్థానికులు తీసుకువెళ్లగా సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ నిధులతో బోర్డ్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయ కులు, స్థానికులు పాల్గొని బోర్‌వెల్ విషయంలో మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపి సన్మానించారు.

బోరబండ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన పిసింగి వినయ్‌ను బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దీన్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ డివిజన్ ప్రెసిడెంట్ బండారి అశోక్ కుమార్ ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ కుమార్, లఖన్, మహేందర్ గౌడ్, రజ్వి దేవెందర్ పటేల్, షైక్ వలి, సుధాకర్ రెడ్డి, చెన్నయ్య, కవిత, కృష్ణవేణి, పార్వతి, లక్ష్మి నాయక్, నర్స, తదితరులు పాల్గొన్నారు.

సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన నార్త్ జోన్ డీసీపీ



నవతెలంగాణ-బేగంపేట్

పజాపరిపాలన వార్షికోత్సవం సందర్భంగా బేగంపేట్‌లోని మోతిలాల్ నెహ్రూ నగర్, ఎస్‌బీఐ కాలనీల్లో 27 సీసీటీవీ కెమెరాలను గురువారం నార్త్ జోన్ డీసీపీ ఎస్. రష్మి పెరుమల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. సీసీటీవీ వ్యవస్థను అమలు చేసిన కాలనీల సభ్యులను అభినందించారు. విశాల్ సుదామ్ మాట్లాడుతూ ఈ మొదటి అడుగు పజాపరిపాలన వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి తీసుకున్న చర్యగా చెప్పారు. ఇది కాలనీలోని ప్రజల సంక్షేమం కోసం ఒక గొప్ప కార్యక్రమమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గోపాల కష్ణ మూర్తి, సీఐ సి. రామయ్య ఎస్ఐ శ్రీధర్, కాలనీ అధ్యక్షులు రవీంద్ర, జయశ్రీ, న. చంద్రశేఖర్, శ్రీసాయలమ్, అమిత్, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు బ్యాక్స్, పుస్తకాలు, పండ్లు పంపిణీ



నవతెలంగాణ-బేగంపేట

ప్రజా పాలన వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు రాంగోపాల్ పేట్ డివిజన్‌లోని ఆదయ మెమరీ హై స్కూల్‌లో వికలాంగుల విద్యార్థులకు బ్యాక్స్, పుస్తకాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సనత్ నగర్ నియోజకవర్గ 'ఏ' బ్లాక్ అధ్యక్షుడు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్, ఏమన్ సింగ్ ఠాకూర్, నాగరాజు, వినోద్, పెరమల చందు, ఆవుల శ్రీనివాస్, రాంగోపాల్ పేట్ డివిజన్ సోషల్ వర్కర్లు పాల్గొన్నారు.

సొంత నిధులతో 32 కెమెరాల ఏర్పాటు

- సీసీ కెమెరాలను ప్రారంభించిన డీసీపీ రష్మీ పెరుమాళ్



నవతెలంగాణ కంటోన్మెంట్

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ వెస్లీ టీచర్స్ కాలనీలో కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలు నార్త్ జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్‌ను అభినందించారు. ఈ కాలనీలలో సంక్షేమ సంఘం వారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, క్రైమ్ సీఐ సుందర్ నాయక్, ఎస్సై శివకుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో పేదల ఇండ్ల కల సాకారం

- పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు
- ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు
- రాష్ట్రంలో 4 లక్షల50 వేల ఇండ్ల నిర్మాణమే లక్ష్యం
- 81 మందికి 'డబుల్' ఇండ్ల పట్టాల పంపిణీ
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





నవతెలంగాణ సిటీబ్యూరో

'యుఫోరియా' సినిమాతో మరోసారి దర్శకుడు గుణశేఖర్‌తో కలసి పని చేయటం చాలా ఆనందంగా ఉంది. 20ఏండ్ల క్రితం ఆయనతో నేను చేసిన 'ఒక్కడు' సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అప్పటికే ఆయన చాలా పెద్ద దర్శకుడు. భారీ భారీ సెట్స్‌లో సినిమాలు చేస్తారు. 'ఒక్కడు' సినిమాకి కూడా ఛార్మినార్ సెట్ వేశారు. ఆ సెట్‌లో పని చేయటం మరచిపోలేని అనుభూతి. అలాగే నటీనటుల దగ్గర్నుంచి తనకు కావాల్సిన నటనను ఎలా రాబట్టుకోవాలో గుణశేఖర్‌కి బాగా తెలుసు. ప్రతి విషయంలోనూ చాలా క్లారిటీగా ఉంటారు. కేవలం సెట్స్ విషయంలోనే కాదు ఆర్టిస్టుల కాస్ట్యూమ్స్ విషయంలోనూ ఆయన చాలా కేర్ తీసుకుంటారు. ఇక 'యుఫోరియా'లో నేను చాలా మంచి పాత్ర చేస్తున్నా. ఈ పాత్ర కోసం గుణశేఖర్ నన్ను ఎంపిక చేసుకోవడం చాలా హ్యాపీగా అనిపించింది. ఇన్నేండ్ల తర్వాత మళ్ళీ ఆయనతో పని చేసే అవకాశం రావడం అదృష్టం. ఈ సినిమాలో నా పాత్ర మిమ్మల్ని కచ్చితంగా సర్‌ప్రైజ్ చేస్తుంది.

- భూమిక

భిన్న ప్రేమకథ



దీపక్ సరోజ్, అనైరా, వేణు ఊడుగుల

ఎన్నో సినిమాలలో బాల నటుడిగా అలరించి, 'సిద్ధార్థ రాయ్' సినిమాతో హీరోగా మారి ప్రేక్షకులను మెప్పించారు దీపక్ సరోజ్.

ఆయన హీరోగా రొమాంటిక్ కల్ట్ లవ్ స్టోరీ జోనర్ సినిమా ప్రారంభమైంది. శ్రీ లక్ష్మీనరసింహ ఆర్ట్స్ ప్రొడక్షన్ పతాకంపై నెం.1 ప్రాజెక్ట్‌గా గురువారం ఈ సినిమా పూజా కార్యక్రమాలతో వైభవంగా ఆరంభమైంది. హరీష్ గదగాని దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంతో తన్నీరు హరిబాబు నిర్మాతగా మారుతున్నారు. దీక్షిక, అనైరా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు, హైపర్ ఆది, సత్య, యూట్యూబర్ పుంజు, యాదమ్మ రాజు, రచ్చ రవి తదితరులు ఇతర కీలక పాత్రలలో నటిస్తున్నారు.

ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా దర్శకులు వేణు ఊడుగుల, ప్రదీప్ మద్దాలి, 'కమిటీ కుర్రాళ్ళు' ఫేమ్ యదు వంశీ , 'క' ఫేమ్ సుజిత్-సందీప్, సందీప్ సరోజ్, భరత్ పెద్దగాని, ఉదయ్ శర్మ, వంశీ చాగంటి, హైపర్ ఆది, రచ్చ రవి హాజరయ్యారు. పూజా కార్యక్రమాల అనంతరం ఈ సినిమా స్క్రిప్టని ప్రదీప్ మద్దాల, యదువంశీ అందించగా, వేణు ఊడుగుల క్లాప్ కొట్టారు. సుజిత్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఫస్ట్ షాట్‌కి సందీప్ డైరెక్షన్ చేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ హరీష్ మాట్లాడుతూ, 'దర్శకుడిగా ఇది నా మొదటి సినిమా. కథ చెప్పగానే నిర్మాత వెంటనే మొదలుపెడదాం అన్నారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. ఇది కంప్లీట్ లవ్ జోనర్ సినిమా. రొమాంటిక్ కల్ట్ లవ్ స్టోరీగా ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. జనవరిలో మొదలుపెట్టి, ఏప్రిల్‌లో ముగించాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. 'సిద్ధార్థ రాయ్' సినిమా తర్వాత ఈ చిత్ర డైరెక్టర్ హరీష్ ఒక మంచి ప్రేమ కథ చెప్పారు. దీనికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. మా నిర్మాత హరిబాబుకి ఇది మొదటి సినిమానే అయినా ఆయన చాలా కాలం ఇక్కడ ఉంటారని నాకు అనిపించింది' అని హీరో దీపక్ సరోజ్ చెప్పారు.

హీరోయిన్ అనైరా మాట్లాడుతూ, 'ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నాను. మా దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు. మేం మా బెస్ట్ టీంతో ఎంటర్టైనింగ్ ధమాకా ప్యాకేజ్ సినిమా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అని అన్నారు.

నేను 20 ఏండ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్నాను. సినిమా మీద ఉన్న ప్యాషన్‌తో లక్ష్మీనరసింహ ఆర్ట్స్ అనే బ్యానర్ స్థాపించాను. ఈ సినిమాతో నిర్మాతగా ప్రేక్షకులకు పరిచయం అవుతున్నాను. ఈ సినిమా కథ విన్న వెంటనే నాకు బాగా నచ్చి, గ్రీన్ సిగ్నల్ ఇచ్చాను. మా సినిమాకు సంగీతం సమకూర్చడానికి ముందుకొచ్చిన అనూప్, సినిమాటోగ్రఫీ అందిస్తున్న సురేష్‌కి ధన్యవాదాలు. ఇదొక భిన్న ప్రేమకథ. ఈ కథ నచ్చి ఇందులో నటిస్తున్న నాయకానాయికలు దీపక్ సరోజ్, అనైరాకు మంచి పేరు రావడం ఖాయం

- నిర్మాత హరిబాబు



ఐశ్వర్య గౌడ

'ఏ రోజైతే చూశానో నిన్ను'..

మహేష్ బాబు, నాగార్జున, రవితేజ వంటి ప్రముఖ కథానాయకులతో ఎన్నో విజయవంతమైన సినిమాలను అందించిన ఇనావర్స్ సినిమా ఫ్యాక్టరీ, రాగ్ర ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా రూపొందిస్తున్న నూతన చిత్రం 'ఏ రోజైతే చూశానో నిన్ను'.

ఈ చిత్రం ద్వారా ఇద్దరు బాల నటీనటులు నాయకానాయికలు పరిచయం అవ్వడం విశేషం.

స్క్రీన్ ప్లే, విజువల్ ఎఫెక్ట్స్‌లో సుపరిచితుడైన రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ద్వారా 'చెక్, బుర్రకథ, రంగ రంగ వైభవంగా' వంటి సినిమాల్లో చైల్డ్ హీరోగా నటించి మెప్పించిన భరత్ రామ్ హీరోగా పరిచయమవుతున్నారు.

అలాగే 'ఛార్లీ 777, జాగ్వార్' లాంటి పలు కన్నడ చిత్రాల్లో నటించి, బాలనటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఐశ్వర్య గౌడ ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. ఈ విషయాన్ని తాజాగా నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

ఈ నెలలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కాళేశ్వరం లేకున్నా.. సాగు భేష్

పెరిగిన సాగు విస్తీర్ణం

- ధాన్యం దిగుబడిలో రికార్డు
- ప్రాజెక్టుల కింద అధిక ఆయకట్టు
- కృష్ణా, గోదావరి జలాల వాటాలపై పోరాటమే
- ప్రాధాన్యక్రమంలో ప్రాజెక్టుల పూర్తే లక్ష్యం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

వ్యవసాయ ప్రాధాన్యతకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలోనే సాగునీటి రంగంలో కీలక మార్పులు తీసుకొచ్చింది. ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే కృష్ణాజలాల పంపిణీలో న్యాయంగా రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించేందుకు ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో పదేండ్లుగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో జరిగిన లోటుపాట్లు, విధ్వంసకర పరిస్థితులపై ప్రజాప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రం సమర్పించిన సంగతి తెలిసిందే. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సైతం ఇచ్చిన విషయం విదితమే. రూ.లక్ష కోట్లతో అప్పటి ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరంలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు కుంగిపోయిన తీరుపై అసెంబ్లీలోనే చర్చకు పెట్టింది. నీటిపారుదల రంగంలో పదేండ్లలో పెట్టిన ఖర్చులు, తెచ్చిన అప్పులు, ఆయకట్టు తీరుతెన్నులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం జుడీషియల్ కమిషన్‌ను నియమించింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన ప్రాజెక్టులను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రాధాన్యమిచ్చింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులపైనే ముఖ్యమంత్రి రేవంత్ కేంద్రీకరించారు.

ప్రాజెక్టులకు ప్రాధాన్యత

నీలం వాగు, పింప్రి ప్రాజెక్టు, పాలెం వాగు, మత్తడి వాగు, ఎస్సారెస్పీ స్టేజీ-2, సదర్మట్ ప్రాజెక్టులపై ప్రభుత్వం ముందుగా దృష్టిపెట్టింది. రూ.241 కోట్ల ఖర్చుతో దాదాపు 48 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేలా పనులు చేపట్టింది. 2025 మార్చి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది. గోదావరి బేసిన్‌లో ఉన్న చిన్న కాళేశ్వరం, మోదికుంట, లోయర్ పెన్‌గంగా, చనాక కోరాట, శ్రీపాద ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టు, కృష్ణాబేసిన్‌లోని కోయిల్‌సాగర్, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి, డిండి, ఎస్‌ఎల్బీసీ పనులు ఈ ప్రాధాన్యత జాబితాలో చేర్చింది. ఏడు జిల్లాలను సస్యశ్యామలం చేసే దేవాదుల ఎత్తి పోతల ప్రాజెక్టుకు అవసరమైన 2,947 ఎకరాల భూసేకరణ చేపట్టి, 89,312 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

కేంద్రానికి విజ్ఞప్తి

గత ప్రభుత్వం మొట్టమొదటగా కొబ్బరికాయ కొట్టి అసంపూర్తిగా వదిలేసిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును ఆర్థిక సాయం అందించాలని అధికారం చేపట్టిన తొలి రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన పథకంలో ఈ ప్రాజెక్టును చేర్చి ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆగస్టు 15న ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టును సీఎం ప్రారంభించారు. గత ప్రభుత్వం రూ. 7400 కోట్లు ఖర్చు పెట్టి ఒక్క ఎకరం కూడా నీళ్లు ఇవ్వకుండా వదిలేసిన ఈ ప్రాజెక్టును, ఈ ప్రభుత్వం 482.87 కోట్లతో ఎనిమిది నెలల్లోనే పూర్తి చేసింది. 9 కిలోమీటర్ల రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సీతారామ నీటిని నాగార్జునసాగర్ కెనాల్‌కు అనుసంధానం చేసి 1.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించటం రికార్డు.

ఫ్లోరైడ్‌పై పోరు

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీటితో పాటు ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును గత ప్రభుత్వం విస్మరించింది. ఆ పనులను రేవంత్ సర్కారు తిరిగి ప్రారంభించింది. సాంకేతిక నిపుణులతో కమిటీ వేసి అత్యాధునిక యంత్ర పరికరాలను విదేశాల నుంచి తెప్పించింది. 2027 సెప్టెంబర్ లోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో రూ. 4,658 కోట్లు కేటాయించింది. 2014కు పూర్వం ప్రతిపాదించిన నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులకు ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌తో పాటు మక్తల్, నారాయణపేట్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు, తాగునీటిని అందించే ఈ ప్రాజెక్టుకు రూ.4350 కోట్లు కేటాయించింది. సీతమ్మసాగర్ ప్రాజెక్టుతోపాటు సీతారామ లిఫ్ట్, సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను తెచ్చుకునేందుకు ప్రభుత్వం కేంద్రంతో, మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

కాళేశ్వరంపై విచారణ

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గత ప్రభుత్వం నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ గతేడాది అక్టోబర్‌లో కుంగిపోగా, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో బుంగలు పడి ప్రమాదకర పరిస్థితి తలెత్తింది.

లోపాలను గుర్తించి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల బాధ్యతను నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ(ఎన్డీఎస్‌ఏ)కి అప్పగించింది. ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీ మధ్యంతర నివేదికలోని సిఫారసుల ఆధారంగా వానాకాలం ప్రారంభానికి ముందే బ్యారేజీలకు అత్యవసర మరమ్మతులు చేసింది. జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు సైతం నిర్వహించింది.

పెరిగిన విస్తీర్ణం

కాళేశ్వరం ప్రాజెక్టుతోనే రాష్ట్రంలో పంటల సాగువిస్తీర్ణం పెరిగిందని గత ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంది. ఎన్డీఎస్‌ఏ సూచనల మేరకు ప్రభుత్వం ఈ ఏడాది మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో చుక్క నీటినీ నిల్వ చేయలేదు. కాళేశ్వరం నుంచి ఒక్క చుక్క నీళ్లు లిఫ్ట్ చేయకుండానే ఈ ఏడాది సాగునీటి ప్రాజెక్టుల కింద రికార్డు స్థాయిలో పంటలు సాగయ్యాయి. ఈ వానాకాలంలో 67 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరగడం గమనార్హం. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధిక రికార్డు. యాసంగిలో కూడా 42.11లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని ప్రభుత్వం ఇటీవలే సాగునీటి ప్రణాళికను విడుదల చేయటం గమనార్హం.

నీటివాటా కోసం పట్టు

కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణకు న్యాయపరంగా రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలనీ, ఈ నీటిని వినియోగించేలా చేపట్టిన అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. నీటి వాటాలు, గోదావరి కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు ఇంతకాలం జరిగిన అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారం చేపట్టినప్పటి నుంచీ సీఎం రేవంత్ పట్టుదలతో అడుగులేస్తున్నారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా, ఏపీలో కేవలం 30 శాతం ఉంది. అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం కృష్ణా జలాల్లోని 1005 టీఎంసీల్లో 70 శాతం రాష్ట్ర వాటా సాధించేలా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

భరోసా, కౌన్సిలింగ్ కేంద్రాలను మరింతగా ఆధునీకరిస్తాం

- డీజీపీ హెడ్‌క్వార్టర్స్ వద్ద లెర్నింగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ భవనానికి డీజీపీ షికా గోయెల్ శంకుస్థాపన



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

మహిళలు, బాలికలకు సంబంధించిన నేరాలపై మరింత నిశితంగా దృష్టిని సారించటానికి భరోసా, కౌన్సిలింగ్ కేంద్రాలను మరింతగా ఆధునీకరిస్తామని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఇంచార్జి, సీఐడీ డీజీపీ షికా గోయెల్ అన్నారు. గురువారం డీజీపీ హెడ్‌క్వార్టర్స్ ప్రాంగణంలో మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో నడిచే లెర్నింగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ నూతన భవవ నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళల భద్రత పట్ల ఎదురవుతున్న నూతన సవాళ్లను ఎప్పటికప్పుడు మదింపు చేసుకొని నేరస్థులను కట్టడి చేయటానికి అవసరమైన శిక్షణను ఈ నూతన భవనంలో ఇవ్వనున్నామని ఆమె తెలిపారు. అలాగే, యువతులు, బాలికలపై వేధింపులు, లైంగికదాడులను నిరోధించటానికి కూడా తమ అధికారులు, సిబ్బందికి తగిన వృత్తి నైపుణ్యాన్ని కూడా ఈ ఆధునిక శిక్షణలో భాగంగా చేరుస్తున్నామని షికా గోయెల్ వివరించారు. ఇందుకు అవసరమైన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణా భవనాన్ని లెర్నింగ్ అండ్ ఎక్స్‌పీరియన్స్ పేరుతో నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఇందుకోసం, రూ.2.50 కోట్లు వ్యయం చేస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ నిధులను సీఎస్సార్ వయట్రీస్ స్వచ్ఛంద సంస్థ సమకూరుస్తున్నదనీ, ఆ సంస్థకు చెందిన అధికార ప్రతినిధి మిచెల్ డొమనికా దీనికి సంబంధించిన చెక్కులను ఈ కార్యక్రమంలో పాల్గొని అందజేశారని ఆమె తెలిపారు. ఈ నూతన శిక్షణా భవనానికి రాష్ట్రంలోని 27 భరోసా కేంద్రాలు, మరో 27 కౌన్సిలింగ్ కేంద్రాలు అనుసంధానమై అవసరమైన శిక్షణను ఆయా కేంద్రాల అధికారులు సిబ్బంది పొందుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్బీవీఆర్ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాశ బిస్త్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, మహిళా భద్రతా విభాగం డీఐజీ రెమా రాజేశ్వరీ, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ ఐజీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాలకు రీపోస్టుమార్టానికి హైకోర్టు నో

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం పూలకొమ్మ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలకు తిరిగి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఎన్‌కౌంటర్‌పై జ్యుడిషియల్ విచారణ, బంధువుల సమక్షంలో రెండోసారి ఇంక్వెస్ట్ చేసేందుకు కూడా అనుమతించలేమని వెల్లడించింది. ఇప్పటికే ఆరుగురు మతదేహాలను బంధువులకు అప్పగించామనీ, హైకోర్టు ఆదేశించిన కారణంగా మల్లయ్య మృతదేహం మాత్రమే భద్రపర్చామని ప్రభుత్వం చెప్పింది. మల్లయ్య మృతదేహాన్ని కూడా బంధువులకు అప్పగించాలని పోలీసులకు ఆదేశాలిచ్చింది. అప్పగింతకు ముందు ఫొటో, వీడియో తీసుకోవడానికి మల్లయ్య భార్యను. ఆమె తరపు న్యాయవాదిని అనుమతించాలని చెప్పింది. ఏటూరు నాగారంలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమంటూ మృతుడు మల్లయ్య భార్య కె.ఐలమ్మ అలియాస్ మీనా వేసిన పిటిషన్‌ను గురువారం జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారించారు. మల్లయ్య మృతదేహాన్ని పిటిషనర్, ఆమె లాయర్ సమక్షంలో అప్పగించాలనీ, సెల్‌ఫోన్ ద్వారా ఫొటోలు తీసుకునేందుకు వారిని అనుమతించాలని పోలీసులను ఆదేశించారు ఈ నెల 26కి విచారణను వాయిదా వేసింది.

విద్యార్థి బ్యాగులో బుల్లెట్లు !

- గన్నవరం విమానాశ్రయంలో కలకలం

గన్నవరం : కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయంలో బుల్లెట్లు కలకలం రేపాయి. భద్రతా సిబ్బంది తనిఖీల్లో ఓ ప్రయాణికుడి వద్ద బుల్లెట్లు ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం సిఐ బివి శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న ఆర్య అనే విద్యార్థి విజయవాడ నుంచి ఢిల్లీకి వెళ్లేందుకు గురువారం విమానాశ్రయానికి చేరుకున్నారు. భద్రతా సిబ్బంది తనిఖీల్లో విద్యార్థి బ్యాగ్‌లో రెండు బుల్లెట్లు ఉండటాన్ని గుర్తించారు. బుల్లెట్లను స్వాధీనం చేసుకొని గన్నవరం పోలీసులకు అప్పగించారు. యువకుడిది హర్యానాలోని పానిపట్టు ప్రాంతమని సిఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

సర్కార్ తప్పిదాలను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ కేసులు

- కాంగ్రెస్ తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు
- ఇందిరమ్మ పాలన అంటే ఎమర్జెన్సీ పాలనే :తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్ పార్టీ అంటేనే కాంగ్రెస్ సర్కార్ భయపడుతున్నదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మెన్ మేడే రాజీవ్సాగర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రమంగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇందిరమ్మ పాలన అంటే నిర్బంధ పాలన అని కాంగ్రెస పార్టీ మరోసారి రుజువు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత దేశమంతా చేతిలో రాజ్యాంగం పట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అంటూంటే కాంగ్రెస్ పాలిత తెలంగాణలోనే ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను అణచి వేయాలనే ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ పార్టీ పాల్పడుతుందని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టిన సరే తప్పకుండా కాంగ్రెస్ తప్పిదాలను, వారి అక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళతామని స్పష్టం చేశారు.

పోలీసులను అడ్డు పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి నిర్బంధ పాలన చేస్తున్నారని విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాలు కాకుండా నిర్బంధ పాలన విజయోత్సవాలను కాంగ్రెస్ సర్కార్ నిర్వహిస్తే వారికి సరిపోతుందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రభుత్వం తప్పిదాలను ప్రశ్నిస్తే తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడ అక్రమ కేసులు బనాయించలేదని వివరించారు. ఫోన్‌ట్యాపింగ్ అవుతుందని సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టడానికి హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ ఒడ్డి వెళితే అతని మీదే అక్రమ కేసు బనాయించారని దుయ్యబట్టారు. అక్రమ కేసు విషయం తెలిసి కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లిన సినియర్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేశారని విమర్శించారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు మీద అక్రమ కేసు బనాయించవద్దని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తుచేశారు.

దీంతో ఎలాగైనా అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇలాంటి చర్యలకు పూనుకుందని తెలిపారు. ప్రజాపాలన అంటూ విజయోత్సవాలు చేస్తూ ప్రతిపక్షాల నేతలను అక్రమంగా అరెస్టు చేయడం ఏంటనీ ప్రశ్నించారు.

బీఫ్ బ్యాన్

- రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాలు, మత కార్యక్రమాల్లో నిషేధం : అసోం ప్రభుత్వం నిర్ణయం

గువహతి : రాష్ట్రంలో బీఫ్ బ్యాన్‌ను మరింతగా విస్తరిస్తూ బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. హెూటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో, మత పండుగల్లో దీనిపై నిషేధం విధించింది. ఈ మేరకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత విశ్వ శర్మ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈ నిబంధనల్ని సంబంధిత చట్టంలో చేర్చాలని క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో బీఫ్ వినియోగానికి సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న చట్టం పటిష్టంగానే ఉన్నప్పటికీ.. అందులో రెస్టారెంట్లు, హెూటళ్లతో పాటు మతపరమైన, సామాజిక కార్యక్రమాల సందర్భంగా బీఫ్ వాడకంపై ఇప్పటి వరకూ నిషేధం విధించలేదని ఆయన చెప్పారు. గతంలో ఆలయాలకు సమీపంలో బీఫ్ తినటంపై నిషేధం ఉండేదనీ, తాజాగా బహిరంగా ప్రదేశాల్లో దీని వినియోగంపై బ్యాన్ విధించాలని నిర్ణయం తీసుకున్నట్టు సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజా నిర్ణయంతో హెూటళ్లు, రెస్టారెంట్లు, మత, సామాజిక కార్యక్రమాల్లో బీఫ్ వినియోగం ఉండదు. ఇక బీఫ్ నిషేధం విషయంలో ఇటు బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం నడుస్తున్నది. అసోం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆలిండియా డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఏఐయూడీఎఫ్) ఖండించింది. దీనిని పొలిటికల్ జిమ్మిక్కుగా ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ అమినుల్ ఇస్లాం తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో 40 శాతం మంది జనాభా వ్యక్తిగత అంశం ప్రభావితమవుతుందని అన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం.. అసోం జనాభాలో 34.22 శాతం మంది ముస్లింలు, 3.74 శాతం మంది క్రైస్తవులు ఉన్నారు.

వాస్తవానికి అసోంలో బీఫ్ తినట నేరం కాదు. 2021లో అసోం ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం హిందువులు, జైనులు, సిక్కులు అధికంగా ఉండే ప్రాంతాలు, దేవాలయాలకు ఐదు కిలో మీటర్ల పరిధిలో బీఫ్ అమ్మకాలు నిషేధ. ప్రస్తుతం నిర్ణయంతో ఆ నిషేధం హెూటళ్లు, రెస్టారెంట్లు, బహిరంగ, మత కార్యక్రమాలకూ విస్తరించినట్టయ్యింది.

సీఎం సోదరునికి రక్షణ కల్పించి ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి ఎందుకు కల్పించరు?


- బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి రక్షణ కల్పిస్తున్న పోలీసులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి రక్షణ కల్పించడం లేదని బీఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా ప్రతినిధి కాని వ్యక్తికి రక్షణ కల్పించి ప్రజా ప్రతినిధికి భద్రతనివ్వరా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్‌లో ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇతర నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో నిలదీస్తారనే తమ నాయకులను అరెస్ట్ చేస్తున్నారని తెలిపారు. పట్నం నరేందర్‌రెడ్డిని జైల్లో పెట్టి 25 రోజులుగా కొడంగల్ ప్రజలకు దూరంగా పెట్టారనీ, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అపాయింట్ మెంట్ తీసుకుని పాడి కౌశిక్‌రెడ్డి వెళ్లి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకోని బంజారాహిల్స్ పోలీసులు ఆయనపైనే కేసు నమోదు చేశారని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిట్టిన సిఎం రేవంత్ రెడ్డి పైన బీఎస్‌ఎస్ యాక్ట్ క్రింద ఎందుకు కేసు పెట్టడం లేదని ప్రశ్నించారు. మాజి మంత్రి హరీశ్‌రావు, జగదీశ్ రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి నుంచి కౌశిక్ రెడ్డికి ప్రాణభయం ఉందని తనతో అనేక సార్లు చెప్పినట్టు తెలిపారు.

'సెకి'పై తప్పుదారి పట్టిస్తున్న సిఎం ప్రకటన

- అధ్యయనమే తప్ప అడుగు ముందుకు లేదు
- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు విమర్శ





सेकी SECI SUN FOR EVER

అమరావతి : అదాని విద్యుత్ ఒప్పందాల రద్దుపై ముఖ్యమంత్రి ప్రజలను తప్పుదారి పట్టించేలా ప్రకటన చేశారని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటును, దేశాన్ని కుదిపేస్తున్న అదాని మహాకుంభకోణం రాష్ట్రం చుట్టూ తిరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం ఆ ఒప్పందాలను రద్దు చేయకుండా దొడ్డిదారిలో కొనసాగించులనుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 'సెకి ఒప్పందాన్ని అధ్యయనం చేస్తున్నాం.. రద్దు చేసుకుంటే ఫైన్ కట్టాల్సి వస్తుంది' అంటూ ముఖ్యమంత్రి మీడియాతో చెప్పటం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10 రోజుల నుంచి అధ్యయనం చేస్తూనే ఉన్నామని చెప్పున్నారే తప్ప అందులో ఒక్క అడుగు కూడా ముందుకు కదల్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒప్పందం రద్దు చేసుకునే అవకాశం ఉందని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ నేరుగా ఉత్తరం రాసినా ముఖ్యమంత్రి దీనిపై స్పందించలేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి సరఫరా చేస్తామన్న విద్యుత్‌ను అదాని ఇప్పటివరకు సరఫరా చేయలేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించిందని తెలిపారు. దీనికి ఆ కంపెనీపై ఎలాంటి సూట్ వేయటంగానీ, అపరాధ రుసుం వసూలు చేయడం గానీ చేయలేదని పేర్కొన్నారు. ఒప్పందాన్ని ఉల్లంఘించిన అదాని కంపెనీపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మనం ఫైన్ కట్టాలని చెప్పడం ప్రజల్ని తప్పుదారి పట్టించటమేనని విమర్శించారు. అవినీతి కేసులో అమెరికాలో కుతికల్లోతులో దిగబడి ఉన్న అదాని నాటి రాష్ట్ర ప్రభుత్వానికి లంచం ఇచ్చి అధిక ధరలకు ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. తగ్గించే అవకాశం ఉన్నా పాతికేళ్ల పాటు అదే ధరను కొనసాగించారని తెలిపారు. దీనివల్ల రూ.లక్షల కోట్ల మేర ప్రజలపై భారం పడుతుందని గుర్తుచేశారు. అయినా ముఖ్యమంత్రి దీనిపై మౌనం వహించటం రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎలాంటి సంకోచం లేకుండా ఒప్పందాలు అన్నింటినీ రద్దు చేసి తక్కువ ధరకు ప్రజలకు విద్యుత్ సరఫరా చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లల్లో.. చలి ప్రభావం

విజృంభిస్తున్న వైరల్ ఫివర్స్

- పెరుగుతున్న నిమోనియా తీవ్రత
- చల్లటి వాతావరణంతో ఇబ్బంది పడుతున్న అస్తమా, టీబీ పేషెంట్లు
- ప్రయివేట్ ఆస్పత్రుల్లో దోపిడీ
- సర్కార్ దవాఖానాలో పిల్లల వైద్యుల కొరత





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

"సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని దాతర్‌పల్లికి చెందిన జూపల్లి బాలయ్య, సంతోష దంపతులకు ఇద్దరు కుమారులు. 8 ఏండ్ల కుమారుడు ధనుష్ నియోనియాతో బుధవారం మృతి చెందాడు. చలిజ్వరంతో బాధపడుతున్న ధనుష్‌ను స్థానిక ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు చేసి నిమోనియాతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఆరోగ్యం విషమించినందున హైదరాబాద్‌లోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించినా ఫలితం దక్కలేదు" ఇది ఒక్క ధనుష్ పరిస్థితే కాదు. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వాతావరణంలో వస్తున్న మార్పులు, చలి తీవ్రత వల్ల చిన్న పిల్లలతో పాటు వృద్ధులు సైతం వ్యాధుల బారిన పడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వాళ్లపై చలి తీవ్రత మరింతగా కనిపిస్తోంది.

రాష్ట్రంలో వాతావరణంలో చోటు చేసుకుంటున్న పెను మార్పుల వల్ల వ్యాధులు విజృంభిస్తున్నాయి. అధిక తేమ, అధిక వేడిమి, అతి చలి వీస్తుంది. అకాల వర్షం కూడా కురుస్తున్నాయి. రాష్ట్రంలో చలి తీవ్రత అత్యధికంగా ఉన్న మండలాల్లో సంగారెడ్డి జిల్లాలోని కోహీర్, న్యాలకల్ వంటి మండలాలున్నాయి. కోహీర్‌లో ఒక రోజు 8, 9 సెంటిగ్రేడ్‌ల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మార్పులు ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగానూ కనిపిస్తున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ములుగు, కొత్తగూడెం, నిర్మల్, వనపర్తి, సూర్యాపేట తదితర జిల్లాల్లోనూ చలితీవ్రత బాగా ఉన్నట్టు అధికారులు చెప్తున్నారు. వాతావరణంలో మార్పుల ప్రభావాన్ని తట్టుకోలేక ముఖ్యంగా చిన్నపిల్లలు అనేక జబ్బుల పాలైన పరిస్థితి ఉంది. శ్వాసకోశ, వైరల్ ఫీవర్, నిమోనియా, తలనొప్పి, సర్ది, దగ్గు వంటి సమస్యలతో ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు ప్రతి ఇంటా పిల్లలు వ్యాధుల బారిన పడుతుండటంతో ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లోని పీడియాట్రిక్ వైద్యుల ఓపీలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇన్‌పేషెంట్లతో ఆస్పత్రులు కిక్కిరిసి పోతున్నాయి. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులే కాకుండా మున్సిపల్ కేంద్రాల్లోని దవాఖానాల్లోనూ పిల్లలు, పెద్దలతో నిండిపోయాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలందుతున్నప్పటికీ పిల్లల వైద్యుల కొరత ఉండటం వల్ల పిల్లల పట్ల మక్కువతో ప్రయివేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు

వాతావరణ మార్పులు, చలి తీవ్రత వంటి పరిస్థితులు చిన్న పిల్లల్ని అనేక రకాల వ్యాధుల బారిన పడేస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ ప్రాథమిక సమాచారం మేరకు సంగారెడ్డి జిల్లాలోనే 2500 మంది చిన్న పిల్లలు వివిధ వ్యాధులకు గురయ్యారు. సిద్దిపేట జిల్లాలో 2150 మంది, మెదక్ జిల్లాలో 1350 మంది పిల్లలు వ్యాధుల బారిన పడినట్టు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లా అధికారిక సమాచారం మేరకు 1221 మంది శ్వాసకోశ సమస్యతో, 969 మంది వైరల్ ఫీవర్‌తో, 380 మంది నిమోనియా వ్యాధి బారిన పడినట్టు మెడికల్ ల్యాబ్ రిపోర్టు ద్వారా వెల్లడవుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత, తడిపొడి వాతావరణం వల్ల పిల్లల్లో గొంతు ఇన్‌ఫెక్షన్స్ కూడా ఎక్కువగా కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. చల్లటి వాతావరణం ఏర్పడితే తట్టుకోలేని పిల్లల్లో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతున్నది. రెండు మూడు వారాలుగా దగ్గు, జ్వరం తగ్గకపోవడంతో నిమోనియాగా మారి ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ సమస్య ఏర్పడుతుంది. గజ్వేల్ మండలంలోని దాతర్‌పల్లికి చెందిన ధనుష్ అనే చిన్నారి నిమోనియా విషమించే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.

భరించలేనంతగా ఆస్పత్రుల ఖర్చులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లల వైద్యుల కొరత ఉండటంతో ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా సీజనల్ వ్యాధుల పేరిట అధిక ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. వైరల్ ఫివర్స్, నిమోనియా వంటి వ్యాధులు వెనువెంటనే తగ్గకపోవడంతో ప్రయివేట్ ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డుల్లో చేరినప్పటికీ పీడియాట్రిక్ వైద్యుల కొరత ఉంది. ప్రభుత్వ వైద్యులు సైతం ప్రయివేట్ ఆస్పత్రుల్ని నడుపుతున్నారు. మరో పక్క ఇతర ప్రయివేట్ ఆస్పత్రుల్లో 24 గంటల పాటు పిల్లల డాక్టర్ పర్యవేక్షణ ఉంటదని ఆర్‌ఎంపీలు చెప్పడంతో తల్లిదండ్రులు విధిలేని పరిస్థితిల్లో ప్రయివేట్ ఆస్పత్రుల్ని ఆశ్రయిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం



వాతావరణంలో వచ్చే మార్పుల్ని బట్టి మనిషిలో వివిధ రకాల వ్యాధులు ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా చలి కాలంలో పిల్లలు.. అస్తమా, టీబీ పేషెంట్లు జాగ్రతలు పాటించాలి. చల్లి తీవ్రతను తట్టుకునేందుకు వెచ్చదనాన్నిచ్చే దుస్తులు ధరించాలి. స్వెటర్లు, మంకీక్యాప్, రగ్గులు వాడాలి. చన్నీళ్ల స్నానం చేయొద్దు. వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. అస్తమా, టీబీ సమస్య ఉన్న వాళ్లు పొద్దున, రాత్రి వేళల్లో బయట తిరగొద్దు. చలి వీచే కూలర్లు, ఏసీ, ఫ్యాన్ల వాడకాన్ని తగ్గించాలి. పిల్లల్లో శ్వాసకోశ సమస్యతో పాటు వైరల్ ఫివర్స్, నిమోనియా వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా చిల్రన్స్ వార్డుల్లో చికిత్స అందిస్తున్నాం.

-డాక్టర్ శ్రీనివాసరెడ్డి, పిల్లల వైద్య నిపుణులు, పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

బిజినెస్

లక్ష డాలర్లకు బిట్ కాయిన్ విలువ



వాషింగ్టన్ : క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ విలువ దూసుకుపోతోంది. రికార్డ్ స్థాయిలో లక్ష డాలర్లకు చేరింది. దీంతో భారత కరెన్సీలో ఒక్క బిట్ కాయిన్ విలువ రూ.84 లక్షల పైమాటే. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైన తర్వాత క్రిప్టో కరెన్సీ విలువ పెరుగుతోంది. ఈ ఒక్క ఏడాదిలోనే బిట్ కాయిన్ విలువ రెండింతలయ్యింది. గడిచిన నాలుగు వారాల్లో ఆ కరెన్సీ విలువ 45 శాతం ఎగిసింది. అమెరికా ఎన్నికల్లో విజయం సాధించిన పార్టీ నేతల్లో క్రిప్టో కరెన్సీ అనుకూల వ్యక్తులు ఉండటమే ఇందుకు కారణం.

గ్రేట్ ప్లేస్ టు వర్క్ కంపెనీగా ఎస్ఇఐఎల్ ఎనర్జీ

నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రముఖ విద్యుత్ ఉత్పత్తి కంపెనీ ఎస్ఇఐఎల్ ఎనర్జీ తమకు అత్యంత ప్రతిష్టాత్మకమైన 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' గుర్తింపు లభించినట్లు తెలిపింది. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది పని ప్రదేశంలో సంస్కృతిని గుర్తించే గ్లోబల్ అథారిటీ. "పని చేయడానికి మా సంస్థను గొప్ప ప్రదేశంగా గుర్తించబడినందుకు మేము సంతోషిస్తున్నాము. ఈ విజయం మా బృందం అంకితభావం, కృషి, పని ప్రదేశం అభిరుచికి ప్రత్యక్ష నిదర్శనం. మా ఉద్యోగులే మాకు గొప్ప ఆస్తి అని నమ్ముతున్నాము." అని ఎస్ఇఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సిఇఒ రాఘవ్ త్రివేది తెలిపారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి నుంచి హెల్త్‌కేర్ ఫండ్

ముంబయి : బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి కొత్తగా బజాజ్ ఫిన్‌సర్వ్ హెల్త్‌కేర్ ఫండ్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. ఇందులోని నిధులను ఔషధ, వైద్య రంగాలకు సంబంధించిన కంపెనీల్లో ప్రధానంగా పెట్టుబడిగా పెట్టనున్నట్లు పేర్కొంది. ఈ ఫండ్ డిసెంబర్6న తెరువబడి.. 20తో ముగుస్తుందని తెలిపింది. కనీస పెట్టుబడి రూ.500గా నిర్ణయించింది. ఫార్మాస్యూటికల్స్, హాస్పిటల్స్, డయాగ్నోస్టిక్స్, వెల్‌నెస్ రంగాలలో ఉన్న కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాలలో ప్రధానంగా పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘ కాలంలో సంపద సృష్టి సామర్థ్యాన్ని కోరుకునే మదుపరులకు అనుకూలంగా ఉంటుందని బజాజ్ ఫిన్‌సర్వ్ ఎఎంసి సిఇఒ గణేష్ మోహన్ పేర్కొన్నారు.

ఆరేళ్లలో 3.12 కోట్ల గృహాలు అవసరం

- నైట్‌ఫ్రాంక్, క్రెడాయ్ అంచనా

న్యూఢిల్లీ : వచ్చే 2030 నాటికి దేశంలో మరో 3.12 కోట్ల అందుబాటు ధరలోని గృహాలు అవసరమవుతాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ నైట్‌ఫ్రాంక్, క్రెడాయ్ సంయుక్తంగా ఓ రిపోర్ట్‌లో తెలిపాయి. ఇవి రూ.67 లక్షల కోట్ల వ్యాపార అవకాశాలను సృష్టించనుందని అంచనా వేశాయి. ఇప్పటికే 1.01 కోట్ల అందుబాటు గృహాలకు కొరత ఉందని పేర్కొన్నాయి. ఇదే క్రమంలో రుణ సంస్థలకు కూడా విశేష అపార అవకాశాలను కల్పిస్తోందని తెలిపింది. ఇళ్ల కొనుగోలుదార్లలో 77 శాతం మంది వరకు రుణాలపై ఆధారపడొచ్చనే అంచనా. ప్రస్తుత విలువతో పోల్చితే మూడు రెట్లు పెరిగి రూ.45 లక్షల కోట్ల గృహ రుణాల అవకాశాలు రానున్నాయని విశ్లేషించింది.

కొత్త ఏడాదిలో హ్యుందాయ్ కార్లు ప్రియం

న్యూఢిల్లీ : ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) కొత్త ఏడాది నుంచి ధరలు పెంచనున్నట్లు ప్రకటించింది. జనవరి 1వ తేది నుంచి తమ అన్ని మోడల్ వాహనాలపై రూ.25 వరకు పెంపు ఉంటుందని గురువారం వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం, రవాణ ఖర్చులు పెరగడంతో పాటు, మారకం విలువ ప్రభావం తదితర పరిణామాల వల్ల ధరలు పెంచాల్సి వస్తుందని హెచ్ఎంఐఎల్ పేర్కొంది. ఈ పెంపు చేపడుతున్నట్లు హ్యుందాయ్ ఇండియా హోల్‌టైమ్ డైరెక్టర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ తరుణ్ గార్గ్ తెలిపారు. ఉత్పత్తి వ్యయం పెరిగిన నేపథ్యంలో పెంపు నిర్ణయం తప్పలేదన్నారు. ఈ కంపెనీ కార్ల ధరల శ్రేణీ రూ.5.92 లక్షల నుంచి రూ.46 లక్షల వరకు ఉంది.

ఫ్రాన్స్ ప్రధానిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం

- 1962 తర్వాత ఇదే మొదటిసారి



పారిస్ : ప్రతిపాదిత బడ్జెట్‌పై తలెత్తిన వివాదాల నేపథ్యంలో ప్రధాని మైఖేల్ బార్నియర్‌ను పదవీచ్యుతుడిని చేసేందుకు మితవాద, వామపక్ష పార్లమెంట్ సభ్యులు బుధవారం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. తీర్మానం గెలుపొందడానికి 288 ఓట్లు అవసరం కాగా, 331 ఓట్లతో పార్లమెంట్ ఆ తీర్మానాన్ని ఆమోదించింది. 1962 తర్వాత ప్రధానిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడం ఇదే మొదటిసారి.

ఫ్రాన్స్ పార్లమెంట్‌లోని దిగువ సభ అయిన నేషనల్ అసెంబ్లీలో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేదు. ప్రధానంగా మూడు బ్లాక్‌లు వున్నాయి. అవి అధ్యక్షుడు మాక్రాన్‌కు చెందిన మధ్యేమార్గ పక్షాలు, వామపక్ష భావజాలంతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్, మితవాద నేషనల్ ర్యాలీ. తాజాగా బార్నియర్‌కు వ్యతిరేకంగా వామపక్ష వాదులు, మితవాదులు చేతులు కలిపారు. ప్రజల అవసరాలను తీర్చకుండా పొదుపు చర్యలను రుద్దుతున్నారని వారు విమర్శిస్తున్నారు. బార్నియర్‌ను సెప్టెంబరులోనే మాక్రాన్ ప్రధానిగా నియమించారు. ప్రభుత్వాన్ని కాపాడేందుకు చిట్ట చివరి ప్రయత్నంగా బార్నియర్ మాట్లాడుతూ, బాధ్యతతో వ్యవహరించాలని, దేశ ప్రయోజనాల గురించి ఆలోచించాలని ప్రతిపక్ష సభ్యులను కోరారు. ఆర్థికంగా, సామాజికంగా, ద్రవ్యపరంగా పరిస్థితులు చాలా క్లిష్టంగా వున్నాయని వ్యాఖ్యానించారు. అయితే ఈ వాదనలను న్యూపాపులర్ ఫ్రంట్, నేషనల్ ర్యాలీ నేతలు కొట్టిపారేస్తున్నారు.

బంగ్లాదేశ్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలి

- ముఖ్య సలహాదారుతో రాజకీయ పార్టీల ప్రతినిధుల చర్చలు

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్‌లో త్వరగా ఎన్నికలు నిర్వహించాలిందిగా పలు రాజకీయ పార్టీలు ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్‌ను కోరాయి. ముఖ్య సలహాదారుతో జరిగిన సమావేశంలో ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులు దీనిపై చర్చించారు. దేశంపై జరుగుతున్న దురాక్రమణను ఏ రీతిన ఎదుర్కొనాలనే అంశంపై యూనస్ రాజకీయ పార్టీల నుండి సలహాలు, సూచనలు కోరారు. అగర్తలాలో బంగ్లాదేశ్ అసిస్టెంట్ హై కమిషన్ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన నేపథ్యంలో బంగ్లాదేశ్-భారత్ సంబంధాల తీరుతెన్నులను నిర్ణయించేందుకు అనుసరించే వ్యూహంపై రాజకీయ పార్టీల నుండి సూచనలు కోరేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అయితే ఈ సమావేశానికి అవామీ లీగ్, దాని మిత్రపక్షాలు హాజరు కాలేదు. ఎన్నికల తేదీని ప్రకటిస్తే ప్రజల్లో ఒక రకమైన ఉత్సాహం తలెత్తుతుందని, ఆ ఉత్సాహం దేశానికి ఉపకరిస్తుందని అందుకే ఈ సమావేశం ప్రధాన ఎజెండా కానప్పటికీ దీనిపై చర్చించామని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) స్థాయి సంఘం సభ్యుడు అమీర్ ఖుస్రూ చౌదరి తెలిపారు. యూనస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇంత విస్తృత స్థాయిలో రాజకీయ సమావేశం జరగడం ఇదే ప్రథమం. ఎన్నికలకు ముందుగా పరిస్థితులు ఒక కొలిక్కి వచ్చేందుకు రాజకీయ పార్టీలతో చర్చలు జరుపుతానని యూనస్ హామీ ఇచ్చారు. అయితే భవిష్యత్ ఎన్నికల్లో అవామీ లీగ్, దాని మిత్రపక్షాలను చేర్చుకుంటారో లేదో స్పష్టత రాలేదు.

రవాణా శాఖకు కొత్త లోగో...విజయాలపై బ్రోచర్

అవిష్కరించిన సీఎం రేవంత్, మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాపాలన- రవాణా శాఖ విజయోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ లోగో... ఆర్టీసీ సాధించిన విజయాలపై బ్రోచర్‌ను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. గురువారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో రవాణా శాఖ నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రభుత్వ సలహాదారులు, జీహెచ్ఎంసీ మేయర్, కార్పొరేషన్ల చైర్మెన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్క్రాపింగ్ పాలసీ ఆర్డర్స్, కారుణ్య నియామకాల కింద ఉద్యోగ నియామకాల పత్రాలను అందజేశారు. రూ. 3902.31 కోట్ల విలువైన ఉచిత ప్రయాణానికి చెక్కులను అందజేశారు. ఏడాదికాలంలో 15.76 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని ఈ సందర్భంగా మంత్రి పొన్నం వివరించారు. తెలంగాణ ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. ఆటోమాటిక్ టెస్టింగ్ సెంటర్స్, ఆటోమెటిక్ డ్రైవింగ్ సెంటర్స్ తెస్తామన్నారు. ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవగాహన పార్కులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రోడ్ ప్రమాదాల నివారణకు కఠిన నిబంధనలు అమలు చేస్తామన్నారు. రవాణా శాఖ యూజర్ చార్జీలు వాడుకునేలా అనుమతి ఇవ్వాలని సీఎంను కోరారు. 'బస్ కా పయ్యా నై చెలగా' అని ఆర్టీసీ కార్మికులు తెలంగాణ కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేండ్లుగా ఆర్టీసీ చంపి బొంద పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదన్నారు. ప్రజా పాలనలో కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. కారుణ్య నియామకాలు చేపట్టామన్నారు. 21 శాతం ఫిట్మెంట్ అందజేశామనీ, రూ. 280 కోట్లతో బాండ్స్ ఇచ్చామని తెలిపారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ 10 నెలల్లోనే లాభాల్లోకి తెచ్చామని వివరించారు. దీనికి మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి నెల రూ. 350 -రూ. 400 కోట్లు ఆర్టీసీకి కేటాయించడం వల్ల ఆర్టీసీ లాభాల బాట పట్టిందన్నారు. ఆర్టీసీలో ఇంటర్నల్‌గా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూశామని వివరించారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో మహిళలు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈవీ పాలసీ, స్క్రాప్ పాలసీ, కొత్త ఎలక్ట్రిక్ బస్సుల పాలసీ రవాణా శాఖకు మరింత గౌరవాన్ని పెంపొందిస్తాయని మంత్రి వివరించారు.

ఏడాదిలో ఆర్టీసీ సాధించిన విజయాలివే ....

- 1389 కొత్త బస్సుల కొనుగోలు
- మొదటిసారిగా హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో 10 రాజధాని ఏసీ బస్సులు...హైదరాబాద్ నుంచి పలు జిల్లా కేంద్రాలకు 75 డీలక్స్ బస్సులు, రాజధాని హైదరాబాద్‌లో 125 మెట్రో డీలక్స్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి.
- 446 ఎలక్ట్రిక్ బస్సులు కొనుగోలు చేయనుంది. ఇప్పటికే 261 బస్సులు కొనుగోలు పూర్తి
- ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీని ప్రకటించింది. 21 శాతం ఫిట్ మెంట్ తో కూడిన వేతనాన్ని ఇచ్చింది.
- ఆర్పీఎస్-2013 బాండ్ల పెండింగ్ బకాయిలు రూ.280 కోట్లను విడుదల
- ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు రూ.కోటి ప్రమాద బీమా.
- హైదరాబాద్ తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కొత్తగా డిస్పెన్సరీ ఏర్పాటు
- ఆర్టీసీలో దాదాపు 12 ఏండ్ల తర్వాత 3038 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
- పెద్దపల్లి, ములుగు జిల్లాల్లో కొత్త డిపోల నిర్మాణం
- హుస్నాబాద్ బస్ స్టేషన్ సుందరీకరణ, జనగామ బస్ స్టేషన్ విస్తరణ
- హైదరాబాద్ మెట్రో ఎక్స్‌ప్రెస్ జనరల్ పాస్ దారులకు ఏసీ సర్వీసుల్లో 10 శాతం రాయితీ కల్పించడం
- ఎయిర్ పోర్ట్ మార్గంలో తిరిగే పుష్పక్ బస్సుల్లో ముగ్గురు అంత కన్నా ఎక్కువ మంది ఒకేసారి కలిసి ప్రయాణిస్తే టికెట్‌లో 10 శాతం రాయితీ
- ఏడాదిలో బస్ ఆన్ కాంట్రాక్ట్ కింద 15171 బస్సులను పెండ్లిళ్లు, ముహుర్తాలు, విహారయాత్రల కోసం అద్దెకు బస్సులు.
- కార్గో సేవలను మరింతగా విస్తరించడంలో భాగంగా రాజధాని హైదరాబాద్‌లో పార్శిల్ హోం డెలివరీ సదుపాయం
- బస్సుల కదలికలను పసిగట్టేందుకు 9320 బస్సులకు ట్రాకింగ్ సదుపాయం.వాటిని గమ్యం యాప్‌నకు అనుసంధానం.
- ప్రసిద్ధమైన మేడారం జాతరకు 3515 ప్రత్యేక బస్సులను సంస్థ నడిపింది.
- శ్రీ రామనవమి సందర్భంగా 47,092 మంది భక్తులకు భద్రాద్రి రాములోరి తలంబ్రాలను లాజిస్టిక్స్ విభాగం అందజేసింది.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి

- జమ్మికుంట కేవీకేలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభం



నవతెలంగాణ - జమ్మికుంట

ప్రకృతి వ్యవసాయం కనుమరుగు కాకుండా రైతులం దరూ సమిష్టిగా కృషి చేయాలని, వ్యవసాయ అనుబంధ రంగాలు కూడా దీనిలో భాగం అవ్వాలని తెలంగాణ వ్యవసాయ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ అనుబంధ శాఖకు అనువదించేలా ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు, రైతు సహకార సంఘాల వారు రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని కోరారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ప్రపంచ నేలల దినోత్సవం, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ప్రారంభోత్సవం, గ్రామ నవ నిర్మాణ సమితి స్వర్ణోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమ సంఘాలు ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ రంగంలో యాంత్రీకరణపై ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. నేల ఎన్నో రకాల సూక్ష్మ జీవులకు ఆవాసాన్ని కల్పిస్తోందన్నారు. భవిష్యత్ తరాలకు సారవంతమైన నేలలను అందించడం అందరి బాధ్యతని తెలిపారు. ఆ దిశగా రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ఏటీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా మాట్లాడారు. వ్యవసాయ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలో కార్యాచరణపై దృష్టి సారించాలని కోరారు. రైతులకు ప్రకృతి వ్యవసాయం మీద అవగాహన రావడం కోసం దేశ వ్యాప్తంగా 731 కృషి విజ్ఞాన కేంద్రాలు, 30వేల కృషి సఖీలు (మహిళలు) ద్వారా శిక్షణ ఇచ్చే విధంగా 10వేల జీవ వనరుల కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పంట దిగుబడికి అతి ముఖ్యమైన సేంద్రీయ కర్బన శాతం ప్రకృతి వ్యవసాయం ద్వారా పెరుగుతుందని చెప్పారు. ఇటువంటి గొప్ప ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. వ్యవసాయం, రైతు సంక్షేమ సభ్యులు యం.భవానిరెడ్డి, కేవీకే ప్రధాన కార్యదర్శి పి.విజయ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టును మూడు సంవత్సరాల పాటు జమ్మికుంట, సైదాపూర్ మండలాల్లోని 8 గ్రామాల్లో 6340 మంది రైతులతో 10 వేల ఎకరాలలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, 1974లో పరిపాటి జనార్దన్‌రెడ్డి స్థాపించిన గ్రామ నవ నిర్మాణ సమితి సంస్థ 50సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించారు. జీవ వనరుల కేంద్రానికి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, కేవికే శాస్త్రవేత్తలు, సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.కుమారస్వామి, డాక్యుమెంటేషన్ ఆఫీసర్ రమాకాంత్, ఫీల్డ్ స్టాఫ్, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పాలస్తీనియన్ల ప్రక్షాళనే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు

- అమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శ
- అమెరికా, మిత్రపక్షాలకూ భాగస్వామ్యం
- పశ్చిమాసియా పరిస్థితులపై నివేదిక విడుదల



కైరో : గాజాలో గత 13 మాసాలుగా ఇజ్రాయిల్ మారణహోమానికి పాల్పడుతోందని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ప్రాణాంతకమైన దాడులకు, విధ్వంసానికి పాల్పడుతూ పాలస్తీనియన్లను ఉద్దేశ్యపూర్వకంగా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొంది. కీలకమైన మౌలిక వసతులను నాశనం చేస్తూ, ఆహారం, మందులు, ఇతర రకాల సాయాన్ని అందనివ్వకుండా చేస్తోందని పేర్కొంది. ఈ మేరకు పశ్చిమాసియాలో పరిస్థితులపై గురువారం ఒక నివేదికను విడుదల చేసింది. ఈ ఊచకోతలో అమెరికా దాని మిత్రపక్షాలకు కూడా భాగస్వామ్యం వుందని పేర్కొంటూ తక్షణమే వారు ఆయుధ సరఫరాలను నిలిపివేయాలని పిలుపిచ్చింది. ఇది కచ్చితంగా నర మేధమే, వెంటనే దీన్ని ఆపాల్సిందేనని అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సెక్రటరీ జనరల్ ఆగ్నెస్ కేలామర్డ్ ఆ నివేదికలో స్పష్టం చేశారు. పోషకాహార లోపం, వ్యాధులు ఈ రెండూ కలిసి పాలస్తీనియన్లపై నెమ్మదిగా దాడి చేస్తున్నాయని, ఫలితంగా వారు నెమ్మదిగా మృత్యువుకు చేరవవుతున్నారని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. 21వ శతాబ్దంలో మరే ఘర్షణలు, యుద్ధాల్లో చూడని విధంగా గాజాల్లో అత్యంత వేగంగా విధ్వంసం, మరణాలు నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేసింది.

ఇజ్రాయిల్ తక్షణమే ఈ మానవ సంహారాన్ని ఆపాలంటూ ఇప్పటివరకు పాలస్తీనా మిత్రపక్షాలు, మానవ హక్కుల గ్రూపులు కోరుతున్నాయి. తాజాగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా అవే డిమాండ్లతో నివేదిక వెలువరించింది. తన చర్యల ద్వారా ఇజ్రాయిల్ 1951 ఊచకోత ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆ నివేదిక విమర్శించింది. నెమ్మదిగా, ఒక పద్ధతితో పాలస్తీనియన్లు మృత్యువుకు చేరువయ్యేలా ఇజ్రాయిల్ చర్యలు వుంటున్నాయని పేర్కొంది. గాజాపై జరుగుతున్న దాడుల తీరును నివేదిక వివరించింది. ఇజ్రాయిల్ ప్రభుత్వం, మిలటరీ, అధికారులు చేసిన వందకు పైగా ప్రకటనలను సమీక్షించామని, తద్వారా వారి అసలు ఉద్దేశ్యాన్ని నిర్ధారించేందుకు ప్రయత్నించామని నివేదికలో పేర్కొన్నారు. ఇళ్లను, పొలాలను, ఆస్పత్రులను, నీటి సదుపాయాలను ఇలా దైనందిక జీవితంలో అవసరమయ్యే వాటిని ధ్వంసం చేసి కాలక్రమంలో పాలస్తీనియన్ల జీవన ప్రమాణాలను దెబ్బతీయాలని, అంతిమంగా వారిని నిర్మూలించాలన్నది ఇజ్రాయిల్ లక్ష్యంగా వుందని ఆ నివేదిక విమర్శించింది.

కాగా, ఇజ్రాయిల్ ఈ ఆరోపణలను తీవ్రంగా తోసిపుచ్చుతోంది. ఇవన్నీ యూదు వ్యతిరేక అపవాదులేనని వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ న్యాయస్థానంలో ఇటువంటి ఆరోపణలను సవాలు చేస్తున్నామని పేర్కొంది. కల్పిత కథనాలతో పూర్తిగా తప్పుడు సమాచారాన్ని ఈ నివేదికలో ఇచ్చారని ఇజ్రాయిల్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో విమర్శించింది.

దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అభిశంసన

- శనివారం సాయంత్రం ఓటింగ్
- అధ్యక్షుడి రాజీనామాకు వెల్లువెత్తుతున్న డిమాండ్లు
- రక్షణ మంత్రి రాజీనామా, కొత్త డిఫెన్స్ చీఫ్ నియామకం



కొత్త సియోల్ : దేశంలో సైనిక పాలన విధిస్తూ చర్యలు తీసుకున్నందుకు అధ్యక్షుడు, రక్షణ మంత్రిలను అభిశంసించడానికి ప్రతిపక్ష పార్టీలు చర్యలు చేపట్టాయి. ప్రధాన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ (డిపి) నేతృత్వంలో ఆరు ప్రతిపక్ష పార్టీలు గురువారం సాయంత్రం అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్‌కు అందచేశాయి. శనివారం సాయంత్రం పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానంపై ఓటింగ్ జరగనుంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 72గంటల్లోగా దీనిపై ఓటింగ్ జరగకపోతే మొత్తంగా తీర్మానం రద్దవుతుంది. పాత తీర్మానం రద్దయినా లేదా వీగిపోయినా చట్ట ప్రకారం కొత్త తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి వుంటుంది. కాగా పాలక కన్జర్వేటివ్ పీపుల్ పవర్ పార్టీ (పిపిపి) నేత హన్ డాంగ్ హూన్ ఈ అభిశంసన ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనివల్ల రాజకీయ అస్థిరత నెలకొంటుందని వాదిస్తున్నారు. దక్షిణ కొరియాలో ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అధ్యక్షునిపై అభిశంసన తీర్మానం ప్రక్రియ చేపట్టారు.

మరోవైపు అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. ఆయన రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజ సంఘాలు ఇలా అన్ని వర్గాల నుండి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం అధ్యక్షుడి రాజీనామా డిమాండ్ చేస్తూ వేలాదిమంది ప్రజలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. యూన్ రాజీనామా చేసేవరకు దేశంలో సార్వత్రిక సమ్మె నిర్వహిస్తామని అతిపెద్ద కార్మిక సంఘం కొరియన్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (కెసిటియు) పిలుపిచ్చింది.

రక్షణ మంత్రి రాజీనామా

దక్షిణ కొరియా రక్షణ మంత్రి రాజీనామాను గురువారం అధ్యక్షుడు యూన్ ఆమోదించారు. ఈ నేపథ్యంలో మంత్రి రాజీనామా వెలువడింది. ప్రతిపక్షాలు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని, కమ్యూనిస్టు ఉత్తర కొరియా పట్ల సానుభూతి చూపిస్తున్నారని సాకుగా చూపిస్తూ అధ్యక్షుడు మంగళవారం రాత్రి దేశంలో సైనిక పాలన విధించారు. అయితే ఈ సైనిక పాలన కేవలం ఆరు గంటలే అమల్లో వుంది. ఈలోగా పార్లమెంట్ అందుకు వ్యతిరేకంగా ఓటు వేయడంతో దాన్ని రద్దు చేశారు. సౌదీ అరేబియాలో దక్షిణ కొరియా రాయబారిగా చేసిన రిటైర్డ్ ఫోర్ స్టార్ జనరల్ చోయ్ బయాంగ్ హైక్‌ను కొత్త రక్షణ మంత్రి గురువారం నియమించారు. ఈ మేరకు అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటన చేసింది. మార్షల్ లాను ఎత్తివేశామని ప్రకటించినప్పటి నుండి అధ్యక్షుడు బహిరంగంగా కనిపించలేదు. అంతకుముందు రక్షణ మంత్రి కిమ్‌ను అభిశంసించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి విడిగా తీర్మానాన్ని అందచేశాయి. సైనిక పాలన విధించాలంటూ అధ్యక్షుడికి సిఫార్సు చేసింది ఆయనేనని ఆరోపించాయి. ఈ నేపథ్యంలో తాను రక్షణ మంత్రిగా రాజీనామా చేస్తానంటూ కిమ్ బుధవారం ముందుకొచ్చారు. ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు ప్రకటించారు. దీనికంతా మొత్తం బాధ్యత తనదేనని పేర్కొన్నారు.

ఏపీలో ప్రశాంతంగా టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్

కాకినాడ :ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. 92.62 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌హన్ సగిలి తెలిపారు.

ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు పోటీల్లో ఉన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని 16,737 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ సరళిని పర్యవేక్షించేందుకు కాకినాడ కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను కాకినాడ జెఎన్‌టియులో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. కాకినాడ జిల్లా పిఠాపురం, శంఖవరం మండలాల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల పరిశీలకులు కె.హర్షవర్ధన్ పరిశీలించారు. డిసెంబర్ తొమ్మిదిన ఓట్ల లెక్కింపు జరుగుతుందని అధికారులు తెలిపారు.

వాయనాడ్ బాధితుల పట్ల కేంద్రం సవతి తల్లి ప్రేమ !

- సాయానికై అభ్యర్థిస్తున్నా పట్టించుకోని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన ఎల్‌డిఎఫ్
- ఎన్.ఎస్.సాజిత్



తిరువనంతపురం : వాయనాడ్ బాధితుల పునరావాసానికి తగినంత కేంద్ర సాయాన్ని అందచేయాలని పదే పదే అభ్యర్థిస్తున్నా కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి వైఖరి ప్రదర్శించడంపై కేరళ ప్రజలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. తిరువనంతపురంలోని రాజ్‌భవన్ వద్ద, వివిధ జిల్లాల ప్రధాన కార్యాలయాల వద్ద వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి. రాజ్‌భవన్ వద్ద జరిగిన ఆందోళనలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, మహిళలతో సహా పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ నిరసన తెలియచేశారు. కలపట్టాలో కూడా బాధితులు తమ నిరసనను తెలియచేశారు. కొండచరియలు కూలి పెను విషాదం సంభవించిన నేపథ్యంలో కేంద్రం సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కోరుతునే వుంది. పైగా, ఆనాటి సహాయక చర్యల్లో పాలు పంచుకున్న విమానాలకు అయిన బిల్లు రూ.153,47కోట్లను ఎస్‌డిఆర్‌ఎఫ్ నుండి కేంద్ర ప్రభుత్వం లాక్కుంది. కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన ఈ తీరు పట్ల కూడా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్‌భవన్ మార్చ్‌ను ప్రారంభిస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్ ప్రసంగించారు. రాజ్యాం గపరమైన బాధ్యతలను నిర్వర్తించాల్సిందిగా పదే పదే కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించు కోవడం లేదన్నారు. దేశంలోనే ఇటువంటి కొండచరియలు విరిగిపడిన విపత్తుల్లో ఇది చాలా పెద్దదని, ఇప్పటికే ఈ విషాదం చోటు చేసుకుని నాలుగు నెలలు గడిచిపోయాయని, అయినా బాధితులకు ఆర్థిక సాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వం సంసిద్ధంగా లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తీవ్ర స్థాయిలో విధ్వంసం చోటు చేసుకుంటే ఏవో కొన్ని వార్డులు కొట్టుకుపోయాయంటూ ఈ విపత్తునే అపహాస్యం చేసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ విషాదం నుండి బతికి బయటపడిన 2వేల కుటుంబాలకు పునరావాసం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు. వారికి మెరుగైన భవితవ్యం కల్పించేలా సమరగ పునరావాస ప్రణాళిక రూపొందుతోందన్నారు. ఇందుకోసం రూ.2వేల కోట్లు సాయం అందించాలని రాష్ట్రం కోరుతోందని, ఇందుకు సంబంధించి సవివరంగా మెమోరాండం కూడా అందచేశామని చెప్పారు.